www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


బ్యాంకాక్‌లో మహమ్మద్ యూనస్‌తో ప్రధాని మోదీ

మోదీ–యూనస్ భేటీ
బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రతకు భరోసా ఇవ్వాలి
ప్రజాస్వామ్య, సుస్థిర, సమ్మిళిత, శాంతియుత బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఉంటుంది
అక్రమ చొరబాట్లను అడ్డుకోవాలి: ప్రధాని మోదీ
షేక్ హసీనా అప్పగింతపై చర్చించిన యూనస్
'బిమ్‌స్టెక్'ను బలోపేతం చేద్దాం
21 సూత్రాల ప్రణాళికను ప్రతిపాదించిన మోదీ
2

శనివారం | 5-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 6 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం; తిథి: అష్టమి రా.7.27 తదుపరి నవమి; నక్షత్రం: పునర్వసు తె.5.32 తదుపరి పుష్యమి; వర్జ్యం: సా.5.26-7.02; దుర్ముహూర్తం: ఉ.6.10-ఉ.7.48; అమృతఘడియలు: తె.3.06-4.43; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.10; సూర్యాస్తమయం: 6.25 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం లోగోను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో వీసీలు, ఉన్నతాధికారులు

పదేళ్లు.. 20 వేల కోట్లు!

బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూముల అమ్మకాల తీరిది..

పర్యావరణ విధ్వంసం, జల వనరుల నిర్మూలన
ఆకాశహర్మ్యాలతో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు
అప్పటి లెక్కలన్నీ తీస్తున్న రేవంత్ సర్కార్
ప్రజల ముందుంచి బీఆర్ఎస్‌ను నిలదీయాలని యోచన
కేటీఆర్ 'భూములు వెనక్కి' వ్యాఖ్యలపై గరంగరం
వెనక్కి తీసుకుంటామంటే పరిశ్రమలెలా అని ప్రశ్న
హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతింటుందని ఆందోళన

బీఆర్ఎస్ హయాంలో జరిగిన కోకాపేట్ భూముల వేలం రద్దుకు నిరుద్యోగుల ధర్నా.. కేటీఆర్‌పై ఫైర్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): 'రేవంత్ మాటలునమ్మి 400 ఎకరాల భూమిలో అంగుళం కూడా కొనకండి. మూడేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చేది మేమే. అప్పుడు ఆ భూముల్ని వెనక్కి తీసుకుంటాం. కాంగ్రెస్ సర్కార్ చెప్పిందని ఎవరైనా కొంటే డబ్బులు నష్టపోతారు" అంటూ గురువారం మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడుతున్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రభుత్వ భూముల అమ్మకాలపై వివరాలు ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆయా భూముల అభివృద్ధి క్రమంలో జరిగిన పర్యావరణ విధ్వంసం, గుట్టలు, నీటి వనరుల నిర్మూలన వంటి వివరాలనూ తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. అలాగే, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం సహా అనుబంధ సంస్థలకు ఎంత విలువైన భూముల్ని

మిగతా 12వ పేజీలో...

విద్యార్థులకు వర్సిటీలు
భవిష్యత్తు కల్పించాలి

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను బోధించాలి
విద్యార్థులే కేంద్రంగా యూనివర్సిటీలు పనిచేయాలి
ప్రొఫెసర్లకు పునరావాస కేంద్రాలుగా మారవద్దు
సమగ్ర మార్పులతో విధానపత్రం రూపొందించండి
వీసీలతో భేటీ, విద్యా కమిషన్ సమీక్షలో సీఎం
13

నకిలీ ఫొటోలు, వీడియోలపై
సీఎం రేవంత్ ఆగ్రహం

కంచ గచ్చిబౌలి భూ వివాదంలో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న వారిపై కేసులు పెట్టండి
పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించిన సీఎం
10

'కంచ గచ్చిబౌలి' నివేదికపై కసరత్తు
ఉదయం డిప్యూటీ సీఎం భట్టితో సీఎస్ సమావేశం
సాయంత్రం భట్టి, మంత్రి పొంగులేటి భేటీ
సుప్రీంకు సమర్పించాల్సిన నివేదికపై చర్చ

'హైదరాబాద్ ఎమ్మెల్సీ'కి
తప్పని పోరు!

బరిలో ఎంఐఎం, బీజేపీతోపాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు
23న పోలింగ్.. గెలుపుపై ఎంఐఎం ధీమా
బలం లేకున్నా బరిలో బీజేపీ
పోటీకి దూరంగా బీఆర్ఎస్, కాంగ్రెస్
వారి ఓట్లు ఎటువైపు అనే దానిపై ఆసక్తి
గులాంగిరీ చేసే వారికే పోస్టులు, టికెట్లా?
సీనియర్, సిన్సియర్ నేతలను ఇప్పటికైనా గుర్తించాలి: రాజాసింగ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా ఏకగ్రీవంగా ఎన్నిక జరుగుతున్న హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానానికి ఈసారి పోరు అనివార్యంగా మారింది. బీజేపీ అభ్యర్థిగా విజ్ఞానభారతి విద్యాసంస్థల చైర్మన్ ఎన్.గౌతమ్‌రావు, ఎంఐఎం అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ మిర్జా రియాజుల్ ఎఫెండీ శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఇంతకు ముందే స్వతంత్ర అభ్యర్థులుగా కంటె సాయన్న, చంద్రశేఖర్ చాలిక కూడా నామినేషన్లు వేశారు. మొత్తంగా ఇప్పటివరకు నాలుగు నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 9వ తేదీవరకు గడువు ఉంది. 23న పోలింగ్, 25న ఓట్ల

మిగతా 14వ పేజీలో...

'నీట్'పై తమిళనాడు బిల్లు
తిరస్కరణ

ఆమోదించని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
అసెంబ్లీలో వెల్లడించిన సీఎం స్టాలిన్
9న అఖిలపక్ష సమావేశానికి పిలుపు
2

ఫార్మాపైనా సుంకాలు

దాంతోపాటు సెమీకండక్టర్లపైనా త్వరలో విధిస్తాం: ట్రంప్


అమెరికాలోని మియామీకి వెళ్తూ అధ్యక్ష విమానంలో మీడియాకు 50 లక్షల డాలర్ల గోల్డ్ కార్డును చూపుతున్న ట్రంప్

మేం విధించిన సుంకాలు మాకు బేరమాడే శక్తినిచ్చాయి. ఇప్పుడు అన్ని దేశాలూ మమ్మల్ని సంప్రదిస్తున్నాయి. మేం చేసిన పని వల్ల కలిగిన గొప్ప ప్రయోజనం అదే. ఈ సుంకాలు మళ్లీ అమెరికాను డ్రైవర్ సీటులో కూర్చోబెట్టాయి.
- డొనాల్డ్ ట్రంప్

మునుపెన్నడూ లేని స్థాయిలో ఉంటాయని వెల్లడి
అద్భుత ఆఫర్లతో వచ్చే దేశాలతో సుంకాలపై సంప్రదింపులకు సిద్ధంగా ఉన్నానని స్పష్టీకరణ
ఐఫోన్లు, ఐప్యాడ్ల ధరలు 30–43% పెరిగే చాన్స్
అమెరికాపై 34% అదనపు సుంకం వేసిన చైనా
భారత మార్కెట్లు పతనం.. ఫార్మా షేర్లు కుదేలు
930, 345 పాయింట్ల మేర సెన్సెక్స్, నిఫ్టీ డౌన్
18 లక్షల కోట్లు కోల్పోయిన ప్రపంచ కుబేరులు
భారీగా నష్టపోయిన జుకెర్‌బెర్గ్, జెఫ్ బెజోస్, మస్క్

వాషింగ్టన్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాల కత్తి దూసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో బాంబు పేల్చారు! త్వరలోనే ఫార్మాస్యూటికల్ (ఔషధాలు), సెమీకండక్టర్లపైనా దిగుమతి సుంకాలు విధిస్తామని.. గురువారం సాయంత్రం ఆయన ప్రకటించారు. ఆ సుంకాలు మునుపెన్నడూ ఎరుగని స్థాయిలో ఉంటాయనే సంకేతాలిచ్చారు. బుధవారం ఆయన ప్రకటించిన సుంకాల జాబితాలో ఈ రెండు రంగాలూ లేకపోవడంతో ఆయా పరిశ్రమలవారు ఊపిరి పీల్చుకున్నారు. ఫార్మా షేర్ల ధరలు పెరిగాయి కూడా. కానీ, అంతలోనే ఆయన ఈ ప్రకటన చేయడంతో ఫార్మా ఇండస్ట్రీ ఆనందం ఆవిరైంది. ట్రంప్ ప్రకటన ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో స్టాక్‌మార్కెట్ కుదేలైంది. సెన్సెక్స్ 930 పాయింట్లు, నిఫ్టీ 345 పాయింట్ల మేర పతనమయ్యాయి. ముఖ్యంగా ఫార్మా రంగ షేర్లు భారీగా నష్టపోయాయి. అటు అమెరికా, ఆసియా మార్కెట్లూ పతనమయ్యాయి. వాల్‌స్ట్రీట్‌లో ఎస్ అండ్ పీ 500 ఫ్యూచర్స్ 3.6 శాతం మేర పడిపోగా.. డౌజోన్స్ సూచి 3.4%, నాస్‌డాక్ 4% మేర

మిగతా 2వ పేజీలో...

నేను ఉగ్రవాదిని కాను..రాజకీయ నాయకుడిని

» ఏడుగురు ప్రధానులు నాతో చర్చలు జరిపారు

» విచారణ సందర్భంగా సుప్రీంకు తెలిపిన యాసిన్ మాలిక్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: తాను రాజకీయ నాయకుడినే తప్ప ఉగ్రవాదిని కాదని జమ్మూ-కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) చీఫ్ యాసిన్ మాలిక్ సుప్రీంకోర్టుకు తెలిపారు. తనతో ఏడుగురు ప్రధానులు చర్చలు జరిపారని చెప్పారు. శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ముందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. ప్రస్తుతం తిహాడ్ జైలులో ఉన్న ఆయనను వివిధ కేసుల విచారణ నిమిత్తం ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు పరచకూడదని, వర్చువల్ విధానంలోనే విచారణ జరపాలని కోరుతూ సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. ఆయన కోర్టుకు వస్తే భద్రతపరంగా ముప్పు ఉంటుందని తెలిపింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ ఉగ్రవాది హఫీజ్ సయీద్‌తో యాసిన్ మాలిక్ తీసుకున్న ఫొటోను గతంలో అన్ని పత్రికలు ప్రచురించడంతో పాటు అన్ని ఛానెళ్లు ప్రసారం చేశాయని తెలిపారు. దీనికి యాసిన్ మాలిక్ సమాధానం చెప్పారు. ఆ ఫొటోను చూపించే తనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తమ సంస్థను కేంద్ర ప్రభుత్వం 'ఉపా' కింద ఉగ్రవాద సంస్థగా గుర్తించలేదని చెప్పారు. పి.వి.నరసింహారావు దగ్గర నుంచి నరేంద్ర మోదీ వరకు ఏడుగురు ప్రధానులు తనతో చర్చలు జరిపారని తెలిపారు. అయితే ఆకస్మికంగా తనపై 35ఏళ్ల క్రితం ఉన్న మిలిటెంట్ కేసులను తిరగదోడి విచారణ జరుపుతున్నారని చెప్పారు. ఇది కాల్పుల విరమణ ఒప్పందానికి వ్యతిరేకమని తెలిపారు. ఇందుకు తుషార్ మెహతా అభ్యంతరం చెప్పారు. ప్రస్తుత కేసుకు, కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధం లేదని అన్నారు. తాను భద్రతపరంగా ముప్పు కాదని యాసిన్ తెలిపారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వలేదన్నారు. అహింసాయుతంగా జరిపిన రాజకీయ ఆందోళనలపైనే కేసులు నమోదయ్యాయి తప్ప, ఇతరత్రా ఏవీ తనపై లేవని అన్నారు.

'సరిహద్దు ప్రజలు' దేశ భద్రతకు కళ్లూ చెవులు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: దేశ సరిహద్దుల్లో ఉన్న గ్రామాల ప్రజలను.. సరిహద్దు భద్రతా బలగాల కళ్లు, చెవులుగా కేంద్రప్రభుత్వం అభివర్ణించింది. ఆయా గ్రామాల అభివృద్ధికి సంబంధించిన 'ఉజ్వల గ్రామాల పథకం' రెండో దశకు ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర క్యాబినెట్ శుక్రవారం సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. దీంట్లో భాగంగా రూ.6,839 కోట్ల వ్యయంతో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, బిహార్, గుజరాత్, జమ్మూకశ్మీర్, లడఖ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని సరిహద్దు గ్రామాల్లో 2028-29 వరకు అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టనున్నారు. మరోవైపు మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో రైల్వేల విస్తరణకు రూ.18,658 కోట్ల వ్యయంతో చేపట్టే నాలుగు ప్రాజెక్టులను కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదించింది. వీటి ద్వారా దేశంలో రైల్వేమార్గం మరో 1,247 కి.మీ.ల మేర పెరగనుంది.

తమిళనాడు బీజేపీ అధ్యక్ష రేసులో నేను లేను

కొత్త అధ్యక్షుని ఎంపిక తర్వాత చాలా మాట్లాడతా: అన్నామలై

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు బీజేపీ అధ్యక్షునిగా మరోసారి కొనసాగాలని తాను కోరుకోవడం లేదని అన్నామలై ప్రకటించారు. ఆ పదవికి నియామకం జరిగిన తర్వాత దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తానని తెలిపారు. శుక్రవారం ఉదయం కోయంబత్తూరు విమానాశ్రయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల తాను ఢిల్లీ వెళ్లి బీజేపీ రాష్ట్ర అధ్యక్షపదవికి కొందరి పేర్లను సిఫారసు చేసినట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదని అన్నామలై తెలిపారు. అన్నాడీఎంకే, బీజేపీ మధ్య రాష్ట్రంలో ఎన్నికల పొత్తు కుదిరే అవకాశాలు ఉండటం వల్లే అధ్యక్ష పదవి నుండి తప్పుకొంటున్నారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ఎటువంటి రాజకీయ ఊహాగానాలపైనా తాను స్పందించబోనని స్పష్టం చేశారు. తనకు అధిష్ఠానవర్గం నిర్ణయమే శిరోధార్యమన్నారు.

3రోజుల పర్యటనకు శ్రీలంక చేరుకున్న మోదీ

కొలంబో, ఏప్రిల్ 4: ప్రధాని మోదీ శ్రీలంక చేరుకున్నారు. బ్యాంకాంక్‌లో బిమ్‌స్టెక్ సదస్సు పూర్తి చేసుకుని కొలంబో చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో శ్రీలంక మంత్రులు ఘన స్వాగతం పలికారు. 3రోజుల పర్యటనలో భాగంగా మోదీ శ్రీలంక అధ్యక్షుడు అనురతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. రక్షణ, డిజిటల్, ఇంధన భద్రత తదితర రంగాల్లో రెండు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. పర్యటనలో భాగంగా భారత సహకారంతో నిర్మిస్తున్న పలు ప్రాజెక్టులను మోదీ ప్రారంభిస్తారు. శాంపూర్ సౌరశక్తి ప్రాజెక్టు స్థలాన్ని సందర్శిస్తారు. 6న మోదీ దిస్సనాయకేతో కలిసి అనురాధపురాలోని మహాబోధి ఆలయాన్ని సందర్శిస్తారు.

ఫార్మాపైనా సుంకాలు



(మొదటి పేజీ తరువాయి)

డౌన్ అయ్యాయి. అటు యూరోపియన్ మార్కెట్ల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్.. ఆసియాలో జపాన్, దక్షిణ కొరియా మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. కొవిడ్ (2020) తర్వాత మార్కెట్లు ఈ స్థాయిలో క్రాష్ కావడం ఇదే మొదటిసారి. దీంతో టాప్-500 ప్రపంచ కుబేరుల సంపద 208 బిలియన్ డాలర్లు.. అంటే దాదాపుగా రూ.17.8 లక్షల కోట్ల మేర ఆవిరై పోయింది. భారీగా నష్టపోయిన ప్రముఖుల్లో ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా అధిపతి జుకెర్‌బర్గ్, అమెజాన్ చీఫ్ జెఫ్ బెజోస్ వంటివారున్నారు. మెటా షేర్లు 9% మేర పతనం కావడంతో.. జుకెర్‌బర్గ్ 17.9 బిలియన్ డాలర్ల మేర (దాదాపు రూ1.5 లక్షల కోట్లు) నష్టపోయారు. అమెజాన్ షేర్లు కూడా 9% పతనమై బెజోస్ వ్యక్తిగతంగా రూ.1.3 లక్షల కోట్ల మేర సంపద కోల్పోయారు. ఇక.. ట్రంప్‌కు అనుంగు మిత్రుడు, టెస్లా అధినేత ఈలన్ మస్క్ సంపద 11 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.94 వేల కోట్లు) మేర కరిగిపోయింది. ప్రముఖ పాదరక్షల బ్రాండ్లు నైకీ, అడిడాస్ వంటి సంస్థల షేర్లు రెండంకెల పతనాన్ని చవిచూశాయి. కాగా.. భారత్‌పై 26% సుంకాలను విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించగా, ఆ తర్వాత వైట్‌హౌస్ అధికారులు విడుదల చేసిన అనెక్సర్‌లో అది 27 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. కానీ, గురువారనాడు దాన్ని మళ్లీ సవరించి భారత్‌పై 26% సుంకం విధిస్తున్నట్టు మరో పత్రాన్ని వైట్‌హౌస్ వర్గాలు విడుదల చేశాయి. మరోవైపు.. అమెరికా ప్రతీకార సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దెబ్బతీస్తాయని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం పార్లమెంటులో సమాధానం చెప్పాలంటూ కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీలు పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో నిరసన తెలిపారు.

చర్చలకు సిద్ధం

తన ప్రతీకార సుంకాల ప్రకటనతో స్టాక్‌మార్కెట్లు కుదేలైనా ట్రంప్ మాత్రం తన నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. తాను సుంకాలు విధించడం వల్లనే ఇప్పుడు ప్రతి దేశం తమను అభ్యర్థిస్తోందని.. ఇప్పుడా దేశాలు తాము ఏం అడిగినా కాదనే పరిస్థితిలో ఉన్నాయని, తమ కోసం ఏదైనా చేస్తాయని ఆయన మీడియాతో అన్నారు. తన హయాంలో అమెరికాను మరింత సుసంపన్నం చేస్తానని పునరుద్ఘాటించారు. "మేం విధించిన సుంకాలు మాకు బేరమాడే శక్తినిచ్చాయి. ఇప్పుడు అన్ని దేశాలూ మమ్మల్ని సంప్రదిస్తున్నాయి. మేం చేసిన పని వల్ల కలిగిన గొప్ప ప్రయోజనం అదే. ఈ సుంకాలు మళ్లీ అమెరికాను డ్రైవర్ సీటులో కూర్చోబెట్టాయి" అని ఆయన పేర్కొన్నారు. "ఏదైనా దేశం అమెరికాతో డీల్ కుదుర్చుకోవాలని భావిస్తే అందుకు మీరు అంగీకరిస్తారా?" అని విలేకరులు ప్రశ్నించగా.. అద్భుతమైన ఆఫర్లతో ఏ దేశమైనా ముందుకొస్తే తాను సిద్ధమేనని జవాబిచ్చారు.

చైనా ప్రతీకార చర్యలు..

'తమలపాకుతో నువ్వొకటిస్తే తలుపుచెక్కతో నేనొకటిస్తా' అన్న సామెత చందంగా.. తమ దేశంపై తాజాగా 34 శాతం సుంకాలు విధించిన అమెరికాపై చైనా అంతేస్థాయిలో అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించింది. అంతటితో ఆగక.. అమెరికా రక్షణ రంగానికి, కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ పరిశ్రమలకు అత్యంత కీలకమైన అరుదైన ఖనిజ లోహాల ఎగుమతులపై నియంత్రణలు విధించింది. అమెరికాకు చెందిన 16 సంస్థలకు పంపే ద్వంద్వ వినియోగ ఉత్పత్తుల ఎగుమతిపై నిషేధం విధించింది. చైనాకు ఎగుమతులు చేస్తున్న ఆరు అమెరికా సంస్థలపై వేటు వేసింది.. చైనా తీసుకున్న ఈ నిర్ణయాలు అమెరికాలో ఆయా రంగాలకు చెందిన పరిశ్రమలపై గట్టిగానే ప్రభావం చూపనున్నాయి. అమెరికాపై తాము విధించిన ఈ అదనపు సుంకం ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి వస్తుందని చైనా కస్టమ్స్ టారిఫ్ కమిషన్ ఆఫ్‌ద స్టేట్ కౌన్సిల్ ప్రకటించింది. అమెరికాపై ప్రపంచ వాణిజ్య సంస్థలో వ్యాజ్యం కూడా దాఖలు చేసింది. కాగా, చైనా విధించిన ప్రతీకార సుంకంపై ట్రంప్ వెంటనే స్పందించారు. తాను విధించిన సుంకాలతో భయాందోళనలకు గురై చైనా తప్పు చేసిందని తన సొంత సామాజిక మాధ్యమం సోషల్ ట్రూత్‌లో పోస్ట్ చేశారు.


పెరగనున్న ఐఫోన్లు, ఐప్యాడ్ల ధరలు?

ప్రతీకార సుంకాలతో అమెరికాను మళ్లీ సుసంపన్నం చేస్తానంటూ ట్రంప్ ఘనంగా ప్రకటించారుగానీ.. ఈ పెంపు ప్రభావం అంతిమంగా అమెరికన్ వినియోగదారులపైనే పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు.. యాపిల్ సంస్థ ఐఫోన్ల ఉత్పత్తికి చైనాపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. కొన్నాళ్లుగా వియత్నాం, భారత్ వంటి దేశాల్లోనూ ఉత్పత్తి ప్రారంభించింది. కానీ, తాజా పెంపుతో చైనాపై సుంకాల భారం 54 శాతానికి చేరింది. అలాగని తమ ఉత్పత్తి మొత్తాన్నీ చైనా నుంచి వియత్నాంకో, భారత్‌కో తరలిద్దామన్నా.. ఆ రెండు దేశాలపైనా వరుసగా 46%, 26% చొప్పున సుంకాలను ట్రంప్ విధించారు. ఆ ప్రభావం యాపిల్‌పై గట్టిగానే పడబోతోంది. ఇప్పుడు యాపిల్ ముందున్న దారులు రెండే.. సుంకాల వల్ల అదనంగా పడే భారాన్ని తాను భరించడం. లేదా వినియోగదారులపై వేయడం. అలా వేయడం వల్ల ఐఫోన్ల ధరలు 30 నుంచి 43 శాతం దాకా పెరుగుతాయని అంచనా. దీనివల్ల.. ప్రస్తుతం అమెరికాలో 799 డాలర్లకు విక్రయిస్తున్న ఐఫోన్ 16 ధర దాదాపు 1142 డాలర్లకు విక్రయించాల్సి ఉంటుంది. 1599 డాలర్లకు విక్రయిస్తున్న ఐఫోన్ 16 ప్రోమ్యాక్స్ ధర ఏకంగా 2,300 డాలర్లు అవుతుంది.

గోల్డెన్ 'ట్రంప్ కార్డ్..' ఇదే..



వాషింగ్టన్: ఎలాంటి నిబంధనల జంఝాటాలు లేకుండా నేరుగా అమెరికా పౌరసత్వం పొందడానికి వీలుకల్పించే 'గోల్డ్ కార్డ్' ఫస్ట్‌లుక్ వచ్చేసింది. గురువారం ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో మాట్లాడుతున్న సమయంలో దీనిని విడుదల చేశారు. "ఐదు మిలియన్ డాలర్లు చెల్లిస్తే ఇది మీదే.. ఇదే మొదటి కార్డ్.. ఇదేవిటో తెలుసా..? ఇది గోల్డ్ కార్డ్.. ది ట్రంప్ కార్డ్" అంటూ వీసా గోల్డ్ కార్డ్‌ను చూపించారు. మొదటి కార్డును తానే కొనుగోలు చేశానని చెప్పారు. బంగారు రంగులో ఉన్న ఈ కార్డ్‌పై డొనాల్డ్ ట్రంప్ 'మగ్‌షాట్' చిత్రం ఉండటం గమనార్హం. నేరస్తులకు సంబంధించి పోలీసులు/జైలు అధికారులు తీసే చిత్రాలే 'మగ్ షాట్‌లు'. అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో.. ట్రంప్ ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారంటూ నమోదైన కేసు నేపథ్యంలో ఆయన అట్లాంటాలోని ఫుల్టన్ కౌంటీ జైలులో లొంగిపోయారు. ఆ సమయంలో జైలు అధికారులు ట్రంప్ మగ్‌షాట్స్ తీశారు. అందులో ఆయన ముఖం నేరుగా కనిపించేలా ఉన్న చిత్రం వైరల్‌గా మారింది. ఇప్పుడు గోల్డ్‌కార్డ్‌పై దాన్ని ముద్రించడం విశేషం. ఇక కార్డ్‌పై ఆయన వెనకాల స్టాట్యూ ఆఫ్ లిబర్టీ చిత్రంతోపాటు 'ది ట్రంప్ కార్డ్' అని క్యాప్షన్ పెట్టారు. అంతేకాదు.. దీని విలువ 5 మిలియన్ డాలర్లు అన్నదీ చాలా స్పష్టంగా కనిపించేలా ముద్రించారు. అమెరికాలో నివసించాలనుకునే ఇతర దేశాల సంపన్నులను ఆకర్షించేందుకు 'గోల్డ్ కార్డ్' వీసాను ప్రవేశపెడుతున్నట్టు ట్రంప్ గతంలోనే ప్రకటించారు. దీనికోసం 5 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.42.7 కోట్లను చెల్లించాల్సి ఉంటుంది. ఇలా సమకూరే నిధులతో అమెరికా అప్పులను కూడా తీర్చేయవచ్చని కూడా ట్రంప్ తెలిపారు.



ఇమ్మిగ్రేషన్ దరఖాస్తులో ఇక నుంచి రెండు జెండర్లే..

» 'ఇతర జెండర్' ఆప్షన్ తొలగింపు

వాషింగ్టన్, ఏప్రిల్ 4: ఇమ్మిగ్రేషన్ దరఖాస్తుల్లో అమెరికా పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్ సేవల (యూఎస్‌సీఐఎస్) సంస్థ మార్పులు తీసుకొచ్చింది. ఇకపై దరఖాస్తుల్లో స్త్రీ లేదా పురుషులను మాత్రమే గుర్తించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ మార్పు ఏప్రిల్ 2వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో 2023లో బైడెన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇతర జెండర్' ఎంపిక అవకాశాన్ని తొలగించినట్లయింది. ఈ ఏడాది జనవరిలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యనిర్వాహక ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో యూఎస్‌సీఐఎస్ ఈ కొత్త పాలసీని అమల్లోకి తెచ్చింది. లింగనిర్ధారణకు బర్త్ సర్టిఫికెట్ లేదా దానికి సమానమైన ధ్రువీకరణను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని యూఎస్‌సీఐఎస్‌కు ప్రభుత్వం సూచించింది.

దక్షిణ కొరియా అధ్యక్షుడిపై వేటు

యూన్‌ను పదవి నుంచి తొలగించిన కోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: దక్షిణ కొరియాలో నాలుగు నెలలుగా నెలకొన్న రాజకీయ అనిశ్చితికి ఎట్టకేలకు తెరపడింది. ఆ దేశాధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను రాజ్యాంగ ధర్మాసనం పదవి నుంచి తొలగించింది. గతేడాది డిసెంబరులో నేషనల్ అసెంబ్లీ ఆమోదించిన అభిశంసన తీర్మానాన్ని సమర్థిస్తూ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. ఈ తొలగింపు తక్షణమే అమల్లోకి వస్తుంది. ఈ క్రమంలో యూన్ ఉన్నపళంగా అధ్యక్ష నివాసాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుంది. తాజా పరిణామాల నేపథ్యంలో దక్షిణ కొరియా చట్ట ప్రకారం 60 రోజుల్లోగా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. యూన్ సుక్ గతేడాది డిసెంబరులో సైనిక చట్టాన్ని ప్రకటించిన నేపథ్యంలో ఆయన అభిశంసన తీర్మానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.

'నీట్'పై తమిళనాడు బిల్లు తిరస్కరణ

» ఆమోదించని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే అర్హత పరీక్ష నీట్ నుంచి మినహాయింపు కోరుతూ తమిళనాడు అసెంబ్లీ రూపొందించిన బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. నీట్ కారణంగా తమిళనాట పలువురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నీట్‌ను రద్దు చేయిస్తామని డీఎంకే అధ్యక్షుడి హోదాలో ఎంకే స్టాలిన్ హామీ ఇచ్చారు. ఆ మేరకు డీఎంకే ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. నీట్‌కు వ్యతిరేకంగా బిల్లును అసెంబ్లీలో ఆమోదించి, గవర్నర్‌కు పంపించగా ఆయన తిరస్కరించారు. అనంతరం కొన్ని మార్పులు చేసి, రెండోసారి గవర్నర్ పరిశీలనకు పంపారు. అయితే.. గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో ఆ బిల్లును రాష్ట్రపతి తిరస్కరించినట్లు తనకు సమాచారం అందిందని స్టాలిన్ శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. 2021 సెప్టెంబరు 13న శాసనసభలో నీట్ మినహాయింపు ముసాయిదా బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించి, గవర్నర్‌కు పంపితే ఆయన తిరస్కరించారని తెలిపారు. 2022 మే 2న అఖిలపక్ష సమావేశం నిర్వహించి, వారి సూచనలతో బిల్లులో కొన్ని సవరణలు చేసి, మళ్లీ గవర్నర్ ఆమోదానికి పంపగా.. ఆయన రాష్ట్రపతికి పంపి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన శాసనసభలో చేసిన ముసాయిదా బిల్లును కేంద్రం ఆమోదించకపోవడం గర్హనీయమన్నారు. నీట్‌పై భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించేందుకు అన్ని పార్టీలతో ఈ నెల 9న భేటీ కానున్నట్లు స్టాలిన్ తెలిపారు. ఆ సమావేశంలో తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

'బిమ్‌స్టెక్'ను బలోపేతం చేద్దాం

సభ్య దేశాల చెల్లింపు వ్యవస్థలతో యూపీఐ అనుసంధానం

» స్థానిక కరెన్సీలో వాణిజ్యానికి ప్రోత్సాహం

» మోదీ 21 సూత్రాల ప్రణాళిక ప్రతిపాదన

» బిమ్‌స్టెక్ సదస్సులో బ్యాంకాక్ విజన్-2030కు ఆమోదం



ప్రధాని మోదీతో బంగ్లాదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారు యూనస్

బ్యాంకాక్, ఏప్రిల్ 4: బిమ్‌స్టెక్ దేశాల చెల్లింపు వ్యవస్థలతో భారత యూపీఐని అనుసంధానించాలని ప్రధాని మోదీ ప్రతిపాదించారు. దీనిద్వారా సభ్య దేశాల మధ్య పర్యాటకాభివృద్ధితో పాటు వాణిజ్యం, పారిశ్రామిక రంగాలకు విస్తృత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. బ్యాంకాక్‌లో శుక్రవారం నిర్వహించిన 6వ బిమ్‌స్టెక్ సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రపంచ శ్రేయస్సును మరింత మెరుగుపరచడానికి ఈ ఫోరం ఒక ముఖ్యమైన వేదికగా మోదీ అభివర్ణించారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం అత్యవసరమని, దీనికోసం 21 సూత్రాల కార్యాచరణ ప్రణాళికను ప్రతిపాదిస్తున్నానని అన్నారు. దీనిలో భాగంగా బిమ్‌స్టెక్ దేశాలకు చెందిన 300మంది యువతకు భారత్‌లో ఏటా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఐటీ రంగ సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకొని ఈ వేదికను సాంకేతికంగా బలోపేతం చేద్దామని మోదీ పిలుపునిచ్చారు. సభ్య దేశాల మధ్య వ్యాపార సంబంధాలను పెంపొందించడానికి బిమ్‌స్టెక్ చాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఏర్పాటు చేయాలని, వార్షిక వ్యాపార సదస్సులు నిర్వహించడంతో పాటు స్థానిక కరెన్సీలో వాణిజ్యాన్ని ప్రోత్సహించాలని సూచించారు. విపత్తు నిర్వహణ, సహాయ, పునరావాసంలో సహకారం దిశగా బిమ్‌స్టెక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బిమ్‌స్టెక్ పరిధిని, సామర్థ్యాలను విస్తరించాల్సిన అవసరాన్ని ప్రధాని నొక్కిచెప్పారు. సభ్య దేశాలకు మానవ వనరుల శిక్షణ, నానో ఉపగ్రహాల తయారీ, ప్రయోగాలు, రిమోట్ సెన్సింగ్ డేటా వినియోగం కోసం గ్రౌండ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, నలంద యూనివర్సిటీల్లో బిమ్‌స్టెక్ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని, సభ్యదేశాలకు చెందిన దౌత్యవేత్తలకు ఏటా శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. యువత భాగస్వామ్యం కోసం ఈ ఏడాది బిమ్‌స్టెక్ యంగ్ లీడర్స్ సమ్మిట్ నిర్వహిస్తామని, బిమ్‌స్టెక్ హ్యాకథాన్, యంగ్ ప్రొఫెషనల్ విజిటర్స్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. కాగా, బంగాళాఖాతం ప్రాంతంలో భద్రత, సమ్మిళితత్వం పట్ల భాగస్వామ్య నిబద్ధతను సాకారం చేయడానికి బిమ్‌స్టెక్ సమావేశం బ్యాంకాక్ విజన్-2030ను ఆమోదించింది. థాయ్‌లాండ్ ఆతిథ్యం ఇస్తున్న ఈ సదస్సుకు భారత్, బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్, శ్రీలంక, భూటాన్ దేశాధినేతలు హాజరయ్యారు.

హిందువుల భద్రతకు భరోసా ఇవ్వండి

బిమ్‌స్టెక్ సదస్సు నేపథ్యంలో ప్రధాని మోదీతో బంగ్లాదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారు యూనస్ బ్యాంకాక్‌లో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయొద్దని యూనస్‌ను మోదీ ఈ సందర్భంగా హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీల భద్రతకు భరోసా ఇవ్వాలని కోరారు. గతేడాది ఆగస్టులో హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత నుంచి ఈ రెండు దేశాల నేతలు కలుసుకోవడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య, సుస్థిర, శాంతియుత, ప్రగతిశీల, సమ్మిళిత బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఉంటుందని పునరుద్ఘాటించారు. సరిహద్దు భద్రతపై కూడా నేతలు చర్చించారు. బిమ్‌స్టెక్ అధ్యక్ష పదవిని చేపట్టిన బంగ్లాదేశ్‌కు మోదీ అభినందనలు తెలిపారు. కాగా, హసీనా అప్పగింతపై మోదీ, యూనస్ ఈ భేటీలో చర్చించారని విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. దీనిపై ఇప్పుడు ఇంతకుమించి వ్యాఖ్యానించడం సరికాదని ఆ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీతో ప్రధాని మోదీ శుక్రవారం బ్యాంకాక్‌లో సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా, బ్యాంకాక్‌లోని వాట్ ఫో ఆలయంలో విశ్రాంతి తీసుకుంటున్న భంగిమలో ఉన్న 46 మీటర్ల పొడవైన బుద్ధుడి విగ్రహాన్ని ప్రధాని మోదీ సందర్శించారు. నాలుగు సింహాలతో కూడిన అశోక చక్రం ప్రతిమను మందిరానికి బహూకరించారు.

వక్ఫ్ బిల్లు చట్టబద్ధతపై సుప్రీంకు కాంగ్రెస్, ఎంఐఎం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: పార్లమెంటు ఉభయసభలూ ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లును కాంగ్రెస్, ఏఐఎంఐఎం పార్టీలు సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. రాజ్యాంగ నిబంధనలను అది ఉల్లంఘిస్తోందని బిహార్‌లోని కిషన్‌గంజ్ కాంగ్రెస్ ఎంపీ మొహమ్మద్ జావేద్, ఎంఐఎం అధ్యక్షుడు-హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శుక్రవారం ఈ మేరకు పిటిషన్లు దాఖలు చేశారు. వక్ఫ్‌పై ఏర్పాటైన జేపీసీలో వీరిద్దరూ సభ్యులు కూడా. ఈ బిల్లు ముస్లింల పట్ల వివక్ష చూపుతోందని.. వారి మతపరమైన స్వేచ్ఛను అడ్డుకునేలా ఉందని.. వక్ఫ్ ఆస్తులు, నిర్వహణపై నియంత్రణ విధిస్తోందని జావేద్ తరఫు న్యాయవాది అనాస్ తన్వీర్ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. మరోవైపు, వక్ఫ్ బిల్లును లోక్‌సభలో బుల్డోజ్ చేశారన్న సోనియాగాంధీ వ్యాఖ్యలపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'బిల్లుపై దాదాపు 14 గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగింది. వివిధ పార్టీలకు చెందిన 61 మంది ఎంపీలు చర్చలో పాలుపంచుకున్నారు. మూడు సార్లు ఓటింగ్ జరిగింది. ఇంత విస్తృత చర్చ, సముచిత ఆమోదం తర్వాత.. సభ నియమావళినే సీనియర్ నేత ప్రశ్నించడం పార్లమెంటరీ ప్రజాస్వామ్య గౌరవానికి తగినట్లుగా లేదు' అని ఆయన అన్నారు. వక్ఫ్ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం చరిత్రాత్మకమని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇదిలా ఉండగా, వక్ఫ్ సవరణ బిల్లు వ్యవహారం ఎన్డీయే కూటమి పార్టీ జేడీయూలో ముసలం పుట్టించింది. ఈ బిల్లుకు అనుకూలంగా జేడీయూ ఎంపీలు పార్లమెంటులో ఓటు వేయడాన్ని తప్పుబడుతూ ఐదుగురు కీలక నేతలు పార్టీకి రాజీనామాలు సమర్పించారు. వీరిలో షహనవాజ్ మాలిక్, మొహమ్మద్ అన్సారీలు గురువారం రాజీనామా చేయగా, నదీమ్ అఖ్తర్, రాజు నయ్యర్, తబ్రీజ్ సిద్ధిఖీలు పార్టీకి శుక్రవారం గుడ్‌బై చెప్పారు.

రాజ్యసభలో వక్ఫ్ బిల్లుకు 128-95తో ఆమోదం

వక్ఫ్ బిల్లుపై రాజ్యసభలో బీజేపీకి కష్టాలు తప్పవన్న అంచనాలను ఆ పార్టీ తలకిందులు చేసింది. బిల్లుకు 128 మంది సభ్యుల స్పష్టమైన మద్దతును కూడగట్టుకుంది. వీరిలో ఐదుగురు బీజేడీ ఎంపీలు, వైసీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ కూడా ఉన్నారు. రాజ్యసభలో 9 ఖాళీలు ఉండగా.. సభలో 236 మంది విగిలారు. వీరిలో 128 మంది బిల్లుకు మద్దతుగా, 95 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. 13 మంది గైర్హాజరయ్యారు. ఇండియా, ఎన్డీయే కూటములకు చెందని 23 మంది ఎంపీల్లో 13మంది గైర్హాజరు కావడం బీజేపీ వ్యూహ చతురతకు నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పార్లమెంటు నిరవధిక వాయిదా

» బడ్జెట్ సమావేశాల్లో 16 బిల్లులకు ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. శుక్రవారం ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన కాసేపటికే నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. వక్ఫ్ బిల్లు అంశంలో ప్రభుత్వంపై కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ చేసిన విమర్శలపై ఎన్డీయే సభ్యులు నిరసన తెలిపారు. 12 గంటలకు సభ తిరిగి ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. సభ్యుల ఆందోళనల నడుమ సభను స్పీకర్ వాయిదా వేశారు. కాసేపటికే రాజ్యసభను కూడా ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ నిరవధికంగా వాయిదా వేశారు. జనవరి 31వ తేదీ నుంచి శుక్రవారం వరకు బడ్జెట్ సమావేశాలు జరిగాయి. తొలి విడత సమావేశాల తర్వాత మధ్యలో ఫిబ్రవరి 14 నుంచి మార్చి 9వ తేదీ వరకు విరామం ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల్లో లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ 100 శాతం కంటే ఎక్కువగా పనిచేయడం (ఉత్పాదకత) విశేషం. వక్ఫ్ (సవరణ) బిల్లుతో పాటు మొత్తం 16 బిల్లులకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. గురువారం (ఏప్రిల్ 3) ఉదయం 11 గంటల నుంచి శుక్రవారం వేకువజాము వరకు విరామం లేకుండా 17:02 గంటల పాటు రాజ్యసభ సమావేశాలు జరిగాయి. రాజ్యసభ చరిత్రలోనే ఇంత సుదీర్ఘ సమయం సభ నడపడం ఇదే తొలిసారి. వక్ఫ్ బిల్లుతో పాటు మణిపూర్ అంశంపై చర్చించారు.

తిరుమల దారిలో
అలిపిరి బేస్‌క్యాంప్

తిరుమల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో రోజురోజుకు వాహనాల రద్దీ పెరిగిపోతున్న నేపథ్యంలో అలిపిరిలో టీటీడీ ఏర్పాటు చేయాలని భావిస్తున్న బేస్ క్యాంప్ ప్రాజెక్ట్ కీలకంగా మారనుంది. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను తీర్చడంతో పాటు తిరుమల పవిత్రత, పర్యావరణాన్ని రక్షించడంలో ఆ ప్రాజెక్టు ప్రధాన పాత్ర పోషిస్తుందని టీటీడీ భావిస్తోంది. తిరుమలకు ప్రస్తుతం రోజుకు 10 వేల వరకు వాహనాలు వస్తున్నాయి. దీంతో పర్యావరణానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక వసతి విషయంలో ప్రధానంగా తిరుమలలో 7,790 టీటీడీ గదులు, 1,105 మఠాల గదులు, 6,800 లాకర్లున్నాయి. వీటి ద్వారా కేవలం 55 వేల మందికి మాత్రమే వసతి కల్పించే అవకాశముంటోంది. మిగతా భక్తులకు ఇబ్బందులు తప్పట్లేదు. ఈ సవాళ్లను ఎదుర్కోవడం కోసమే టీటీడీ బేస్‌క్యాంప్ ప్రాజెక్టుపై దృష్టి సారించింది. తిరుమల విజన్-2047లో భాగంగా అలిపిరిలో బేస్‌క్యాంప్ ఎను ఏర్పాటు చేయాలని భావించిన టీటీడీ ఈవో శ్యామలరావు ప్రత్యేక శ్రద్ధతో ప్రాజెక్టును సిద్ధం చేశారు. దీనికోసం 10 నుంచి 15 హెక్టార్ల స్థలాన్ని వినియోగించనున్నారు. 25 వేల మంది భక్తులకు సకల సౌకర్యాలతో వసతి కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందించారు.

స్థానిక ఎన్నికలు జూలైలో..!?

తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపాలిటీలకు.. తర్వాత గ్రామ పంచాయతీల్లో

- ఎన్నికల ఏర్పాట్లపై చర్చిస్తున్న సర్కారు?
- బీసీలకు 42% రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లే యోచన

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు త్వరలోనే మోక్షం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపాలిటీలకు కొన్ని రోజుల వ్యవధిలోనే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. జూలైలో ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల ఏర్పాట్లపైనా చర్చిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపాలిటీలకు ఎన్నికలకు నిర్వహించి, ఆ తర్వాత పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఇదే అంశంపై సంబంధిత అధికారులతో చర్చిస్తోంది. అధికారులు మాత్రం ముందు సర్పంచ్ ఎన్నికలే నిర్వహించాలని సూచించినట్లు తెలిసింది. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఇప్పటికే ఏడాదికి పైగా అయ్యిందని, కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా రూ.1,500 కోట్లకు పైగా నిలిచిపోయాయనే వివరాలను సర్కారు దృష్టికి తీసుకెళ్లారు. మొదట సర్పంచ్ ఎన్నికలను నిర్వహించి, ఆయా పాలకవర్గాల వివరాలను కేంద్రానికి నివేదిస్తే.. నిలిచిపోయిన నిధులు వచ్చేందుకు అవకాశం ఉంటుందని వివరించినట్లు తెలిసింది. అయితే మొదట ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించినా, తర్వాత కొద్ది రోజుల్లోనే సర్పంచ్ ఎన్నికలు ఉంటాయని ప్రభుత్వం పేర్కొన్నట్లు సమాచారం. ఈ విషయంపై త్వరలోనే స్పష్టత రానుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. జూలైలో స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకు అడుగులు ముందుకు పడుతున్నట్లు పేర్కొన్నాయి. ప్రస్తుతం పంచాయతీలు, మునిసిపాలిటీలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న సంగతి తెలిసిందే.

42% రిజర్వేషన్లతోనే ఎన్నికలు!

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం చొప్పున రిజర్వేషన్లను అమలు చేయాలని సర్కారు భావిస్తోంది. ఇందుకోసం స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీల రిజర్వేషన్లను 29 నుంచి 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో రెండు బిల్లులు ప్రవేశపెట్టి, ఆమోదించింది. అవి గవర్నర్ ఆమోదం కోసం వెళ్లాయి. పార్లమెంటులో చర్చించి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లోకి ఈ బిల్లులను చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నిరవధిక వాయిదా పడ్డాయి. ఉభయసభల్లో తెలంగాణ బీసీ బిల్లులు చర్చకు రాలేదు. మళ్లీ వానాకాలంలో పార్లమెంటు సమావేశాలు జరుగుతాయి. దీంతో ఈ అంశంపై మరికొంత కాలం వేచి చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. అప్పటికీ ఈ ప్రక్రియ మొదలవకపోతే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఎలా ముందుకెళ్లాలనేదానిపై న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలని యోచిస్తోంది. అయితే బీసీలకు రిజర్వేషన్ల పెంపు బిల్లులను అలాగే ఉంచి, ఎన్నికలకు వెళ్లాలనుకుంటే గతంలో అమలైన రిజర్వేషన్లతోనే నిర్వహించాల్సి ఉంటుంది. ఆ ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను కేటాయించగా.. మిగిలిన రిజర్వేషన్లను బీసీలకు కేటాయించాలి. గతంలో బీసీలకు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 21-22 శాతం మేర రిజర్వేషన్లు అమలవగా, మునిసిపాలిటీల్లో 31 శాతం చొప్పున అమలయ్యాయి. ఇప్పుడూ అలాగే అమలు చేయాల్సి ఉంటుంది. మరోవైపు స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున బీసీలకు 42% రిజర్వేషన్లను అమలు చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. దీనిపైనా పార్టీలో కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.

గవర్నర్ ఆమోదిస్తారా?

గవర్నర్ దగ్గర రెండు బీసీ బిల్లుల ఆమోదం ఆలస్యమయ్యే అవకాశం ఉందా? అంటే ఏమీ చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఎందుకంటే గతంలో ఝార్ఖండ్‌లో బీసీల రిజర్వేషన్లు పెంచుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా అసెంబ్లీలో బిల్లులు పెట్టి, వాటిని గవర్నర్‌కు పంపింది. కానీ, ఆర్నెల్ల దాకా గవర్నర్ వాటిని ఆమోదించలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సఖ్యత నేపథ్యంలోనే గవర్నర్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు మద్దతిస్తారనేది బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో తెలంగాణ బిల్లులను కేంద్రం ఎప్పుడు ఆమోదిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది.

మైనర్లు వాహనం నడిపితే..
ఏడాది పాటు బండి రిజిస్ట్రేషన్ రద్దు

- వారికి 25 ఏళ్లు వచ్చేదాకా నో లైసెన్స్
- నేటి నుంచి హైదరాబాద్‌లో స్పెషల్ డ్రైవ్
- సిటీ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇకపై మైనర్లు వాహనం తీసుకుని రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ హెచ్చరించారు. అదే జరిగితే ఆ వాహనం రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేస్తామని తెలిపారు. శనివారం నుంచి నగరంలోని అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. నగరంలో రోజు రోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై పోలీసులు దృష్టిసారించగా.. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తేలిందని జాయింట్ సీపీ పేర్కొన్నారు. దీంతో మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడిన వాహనం తల్లిదండ్రులదైనా..? లేక దాని యజమాని ఎవరైనా ఉపేక్షించేది లేదన్నారు. మైనర్ అని తెలిసీ వాహనం ఇచ్చినందుకు బాధ్యులకు జరిమానా, జైలు శిక్ష విధిస్తారని స్పష్టం చేశారు. అంతేకాదు, మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడిన వారికి 25 ఏళ్లు వచ్చేంత వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హత ఉండదని చెప్పారు. కాబట్టి తల్లిదండ్రులు, వాహన యజమానులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని జోయల్ డేవిస్ కోరారు.

నాసా ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్‌లో
శ్రీ చైతన్య విద్యార్థుల విజయ దుందుభి

- 13వసారీ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాం: డైరెక్టర్ సీమ

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని 'నాసా ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ 2025'లో వరుసగా 13వ సారి తమ విద్యాసంస్థ విజయదుందుభి మోగించిందని శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సీమ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 25 దేశాలకు చెందిన విద్యాసంస్థలు పాల్గొనగా భారత్‌కు మొత్తం 60 అవార్డులు వచ్చాయని వివరించారు. అందులో 30 అవార్డులను తమ విద్యార్థులే సాధించారని తెలిపారు. ఈ కాంటెస్ట్‌లో భారత్ ప్రథమ స్థానంలో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇంతవరకూ ప్రపంచంలోని ఏ విద్యా సంస్థ ఇలాంటి ఘనత సాధించలేదని, వరుసగా శ్రీ చైతన్య విద్యా సంస్థలే క్యాష్ అవార్డులను గెలుచుకోవడం గర్వకారణమని తెలిపారు. ఈ అవార్డ్ విన్నింగ్ ప్రాజెక్టుల్లో తమ విద్యార్థులు మొత్తం 369 మంది పాల్గొన్నారని వివరించారు. ఈ విజయంలో భాగస్వాములైన తమ సిబ్బందిని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

వామనరావు దంపతుల హత్య కేసులో..
ఆధారాలన్నీ 3 వారాల్లో సమర్పించండి

- సర్కారుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద దంపతులు గట్టు వామనరావు, నాగమణి హత్య కేసుకు సంబంధించిన ఆధారాలన్నిటినీ మూడు వారాల్లోగా తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పెద్దపల్లి జిల్లా మంథనిలో 2021 ఫిబ్రవరి 17న జరిగిన న్యాయవాది గట్టు వామనరావు దంపతుల హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ వామనరావు తండ్రి గట్టు కిషన్‌రావు అదే ఏడాది సెప్టెంబర్ 18న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నిందితులు తనను బెదిరిస్తున్నారని, ఈ కేసును వేగంగా విచారించి దోషులను కఠినంగా శిక్షించాలని సుప్రీంకు ఇచ్చిన పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేత పుట్ట మధుకర్ ప్రమేయంతోనే ఈ హత్య జరిగిందని, సీబీఐ విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పిటిషనర్ తరఫు న్యాయవాది మేనకా గురుస్వామి సుదీర్ఘకాలంగా తమ వాదనలు వినిపిస్తున్నారు. ఈ కేసును సీబీఐకి అప్పగించడానికి తమకెలాంటి అభ్యంతరమూ లేదని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. న్యాయస్థానం ఆదేశిస్తే విచారణకు తాము సిద్ధమేనని సీబీఐ కూడా అంగీకరించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, రాజేశ్ బిందాల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసును పరిశీలించింది. ఈ కేసుకు సంబంధించిన వీడియోలు సహా అన్ని పత్రాలను తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయా రికార్డులను పరిశీలించిన తర్వాతే సీబీఐకి ఈ కేసును అప్పగించడంపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. కాగా ఈ కేసు మే 6న మరోసారి విచారణకు వచ్చే అవకాశముంది.

బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌గా
కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీతా దయాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌గా మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం పర్కాపూర్‌కు చెందిన కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి నియమితులయ్యారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమెతో పాటు ఆరుగురు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. సీతా దయాకర్‌రెడ్డి ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం సీతాదయాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన సందర్భంగా ఆమెకు సీఎం శుభాకాంక్షలు చెప్పారు. చైర్‌పర్సన్‌గా తనకు అవకాశం కల్పించిన రేవంత్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 1994లో రాజకీయాల్లోకి వచ్చిన సీతాదయాకర్‌రెడ్డి 2001లో దేవరకద్ర జడ్పీటీసీగా గెలుపొందారు. అప్పటి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా పనిచేశారు. 2009లో కొత్తగా ఏర్పడిన నియోజకవర్గం దేవరకద్ర నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. టీడీపీతో ఆమె రాజకీయ ప్రస్థానం ప్రారంభం కాగా, గత అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఐఏఎస్ వాణీప్రసాద్‌కు క్యాట్‌లో దక్కని ఊరట

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): క్యాడర్ వివాదంలో ఉన్న ఐఏఎస్ అధికారిణి వాణీప్రసాద్‌కు ఊరట లభించలేదు. తనను తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను హైదరాబాద్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) కొట్టివేస్తూ శుక్రవారం తీర్పు వెలువరించింది. వాణీప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్‌పై బస్వారాజ్ పాట్నే, వరుణ్‌సింధు కుల్‌కౌముదితో కూడిన క్యాట్ హైదరాబాద్ బెంచ్ విచారణ చేపట్టింది. డీవోపీటీ జారీచేసిన ఆదేశాలు చట్టబద్ధంగానే ఉన్నాయని పేర్కొంటూ వాణీప్రసాద్ వినతిని తిరస్కరించారు.

రూ.3 కోట్ల విలువైన బంగారం దోపిడీ

- వేలూరు నుంచి కేజీఎఫ్‌కు తరలిస్తుండగా ఘటన

వి.కోట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా వి.కోట మండలం నాయకనేరి అటవీ ప్రాంతంలో దారి దోపిడి ముఠా ఓ కారును అడ్డగించి రూ.3 కోట్ల విలువైన 3.75 కిలోగ్రాముల బంగారు కడ్డీలను దోచుకెళ్లింది. కేజీఎఫ్‌కు చెందిన ఓ వ్యాపారి స్థానికంగా దుకాణాలకు బంగారాన్ని సరఫరా చేస్తుంటారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు కారులో బంగారం తీసుకెళ్తుండగా ఆంధ్రా-తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన నాయకనేరి అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి ఐదుగురు దుండగులు కారును అడ్డగించారు. ముఖాలకు మాస్కులు ధరించిన వారు మార్వాడీతో పాటు కారు డ్రైవరును కత్తులతో బెదిరించి బంగారాన్ని దోచుకెళ్లారు. ఈ ఘటనతో నిర్ఘాంతపోయిన వ్యాపారి తొలుత ఫిర్యాదు చేసేందుకు వెనకాడారు. చివరకు శుక్రవారం వి.కోట పోలీసులకు రూ.3 కోట్ల విలువైన బంగారాన్ని దొంగలు దోచుకెళ్లినట్టు ఫిర్యాదు చేశారు.

వరంగల్ జిల్లా కోర్టులో బాంబు కలకలం

- జడ్జికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఈ-మెయిల్

వరంగల్ లీగల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టులో శుక్రవారం బాంబు కలకలం రేగింది. కోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు శుక్రవారం ఉదయం జిల్లా కోర్టు జడ్జి సీహెచ్. రమేష్ బాబుకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఈ-మెయిల్ వచ్చింది. దాంతో సుబేదారి సీఐ పి. సత్యనారాయణ రెడ్డికి జడ్జి విషయం తెలిపారు. సీఐ వెంటనే బాంబు స్క్వాడ్‌ను పిలిపించారు. బాంబు స్క్వాడ్ జాగిలాలతో కోర్టు లోపల, బయట పరిసరాలను అణువణువు గాలించారు. సుమారు రెండు గంటల పాటు తనిఖీలు సాగించగా, ఎక్కడ బాంబు ఆనవాళ్లు కనిపించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జడ్జికి మెయిల్‌లో వచ్చింది తప్పుడు సమాచారమని గుర్తించి పోలీసులు విచారణ చేపట్టారు.

చెడగొట్టు వానకు రైతు విలవిల!

పలు జిల్లాల్లో వందల ఎకరాల్లో పంటనష్టం

- ములుగు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన
- నష్ట పరిహారమిచ్చి ఆదుకుంటామని ప్రకటన



గోవిందరావుపేట మండలం కర్లపల్లిలో వరి చేనును పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ములుగు/మహబూబాబాద్ అగ్రికల్చర్/యాదాద్రి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నోటికాడి బుక్క నేలపాలైంది.. కోత దశలో వరి చేన్లు నేలవాలాయి. కల్లాల్లో ఆరబోసిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. ఆశలు పెట్టుకున్న మామిడి తోటలు.. ఆదుకుంటాయనుకున్న మిర్చి, మొక్కజొన్న, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. గురువారం కురిసిన అకాల వర్షానికి పలు జిల్లాల్లో వందల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. రెక్కల కష్టం, వేలాది రూపాయల పెట్టుబడి వర్షార్పణం కావడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో కోతకు వచ్చిన సుమారు 400 ఎకరాల వరి పంట నేలవాలింది. వడగండ్ల ధాటికి మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో మండలంలో వరి, మిర్చి పంట దెబ్బతిన్నది. కమలాపురం వద్ద 30 ఎకరాల్లో పొగాకు పంట తడిసి ముద్దయ్యింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో 2 వేల క్వింటాళ్ల మొక్కజొన్నలు వరద నీటిలో మునిగి నష్టం వాటిల్లింది. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో అకాల వర్షానికి మిర్చి బస్తాలు తడిసిపోయింది. కొత్తగూడలో వడగండ్ల వానతో 150 ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 250 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీటిలో 150 ఎకరాల్లో మామిడి, 93 ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్టుగా ప్రాథమిక అంచనాలు రూపొందించారు.

రైతులను ఆదుకుంటాం: సీతక్క

మంత్రి సీతక్క ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో శుక్రవారం పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని, నష్ట పరిహారం ఇచ్చి ఆదుకుంటామన్నారు. పంట నష్టంపై తక్షణమే సర్వే మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడి తక్షణ సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు పరిశీలించారు. రైతుల నుంచి పంట నష్టం వివరాలు తెలుసుకుని.. వారిని ఆదుకుంటామని భరోసానిచ్చారు.

నేడు రాష్ట్రానికి వర్ష సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండల తీవ్రత మళ్లీ పెరగనుంది. ఆదివారం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు, పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దాదాపు 42 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఇక శనివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశముందని వివరించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం, మెదక్ జిల్లాల్లో కొన్ని చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

ఫ్యాటీ లివర్‌పై సర్కారు ఫోకస్

- ఎన్ఎఎఫ్ఎల్‌డీ కేసులపై ప్రత్యేక దృష్టి
- గుర్తింపు, చికిత్సా విధానాలపై పరిశీలన
- ఏఐజీ ఆస్పత్రితో వైద్యశాఖ చర్చలు
- 50 వేల నుంచి లక్ష మందికి పరీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరిగిపోతున్న ఫ్యాటీ లివర్ కేసులపై వైద్య, ఆరోగ్య శాఖ దృష్టిసారించింది. ముఖ్యంగా మద్యపానం తీసుకోని వారిలో వచ్చే ఫ్యాటీ లివర్ కేసులు ప్రమాదకరంగా మారుతున్నాయి. పైకి ఆరోగ్యంగా కనిపిస్తుండడంతో, చివరిదాకా వ్యాధిని గుర్తించక ప్రాణాలకు ప్రమాదంగా మారుతోంది. ఇలాంటి కేసుల్ని గుర్తించేందుకు ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసిజ్(ఎన్ఎఎఫ్ఎల్‌డీ) కేసుల గుర్తింపుకు ముందస్తు పరీక్షలు ఎలా చేస్తున్నారు? కేసుల ధోరణి, చికిత్సా విధానాలపై ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రి ఏఐజీ సలహాలు, సూచనలను తీసుకుంటోంది. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్థు, ఆ శాఖ ఉన్నతాధికారులు ఏఐజీ ఆస్పత్రి వైద్యుల బృందంతో చర్చించారు. ప్రస్తుతం ఏఐజీ ఆస్పత్రిలో ఎన్ఎఎఫ్ఎల్‌డీ కేసుల్ని ఫైబ్రోస్కాన్ ద్వారా గుర్తిస్తున్నారు. ఈ విధానాన్నే ప్రభుత్వ దవాఖానాల్లోనూ అమలు చేయాలని ఆరోగ్యశాఖ భావిస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఎఎఫ్ఎల్‌డీ స్క్రీనింగ్

రాష్ట్రంలో ఎన్ఎఎఫ్ఎల్‌డీ కేసుల స్థితిగతులను అంచనా వేసేందుకు ఏఐజీ ఆస్పత్రి రంగంలోకి దిగింది. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల నుంచి లక్ష మందికి ఎన్ఎఎఫ్ఎల్‌డీ పరీక్షలను చేయాలని నిర్ణయించింది. అందుకు పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ స్క్రీనింగ్ కేవలం మద్యపానం తీసుకోని వారికే ఉచితంగా చేయనున్నారు. పట్టణ, పల్లె ప్రాంతాల్లోనూ చేపట్టనున్న ఈ పరీక్షలు 20 సంవత్సరాలు పైబడిన 60 ఏళ్లలోపు స్త్రీ, పురుషలకు మాత్రమే చేయనున్నారు. ఫైబ్రోస్కాన్ చేసిన ఐదు నిమిషాల్లోనే వ్యాధి నిర్ధారణ ఫలితాలు వెల్లడవుతాయి. ఏఐజీ ఆస్పత్రి చేసే ఈ స్క్రీనింగ్ నివేదికను వైద్య ఆరోగ్యశాఖ తీసుకొని, దానిని విశ్లేషించి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని వైద్యవర్గాలు వెల్లడించాయి. ఆ నివేదిక ద్వారా రాష్ట్రంలో ఎన్ఎఎఫ్ఎల్‌డీ ఏ మేరకు ఉందో అంచనాకు రావొచ్చని అధికారులు అంటున్నారు.

ఏసీబీ వలలో నీటిపారుదల ఏఈ

- ఎన్‌వోసీ జారీకి రూ. 10 లక్షలు డిమాండ్
- రూ. లక్ష తీసుకుంటుండగా పట్టివేత



ఏఈ రవికిషోర్

పటాన్‌చెరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌వోసీ జారీ చేసేందుకు రూ. పది లక్షల లంచం డిమాండ్ చేసిన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల నీటిపారుదల శాఖ ఏఈ రవికిషోర్ ఏసీబీకి చిక్కారు. పటాన్‌చెరులోని నీటిపారుదల శాఖ డివిజనల్ కార్యాలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గుమ్మడిదల గ్రామ శివారులో సంతోష్ అనే వ్యక్తి తన 4,400 గజాల స్థలానికి ఇటీవల ప్రహరీ నిర్మించాడు. పక్కనే చిన్న నాలా ప్రవహిస్తుండటంతో డ్రైనేజీని నిర్మించాడు. గత నెల 28న మండల నీటిపారుదల శాఖ ఏఈ రవికిషోర్ సదరు స్థల యజమానిని హైడ్రా పేరు చెప్పి బెదిరించాడు. నిబంధనలకు విరుద్ధంగా నాలాను కబ్జా చేసి ప్రహరీ నిర్మించారని, దీనిపై హైడ్రాకు ఫిర్యాదు చేసి కూల్చి వేయిస్తామన్నాడు. ఇదంతా జరగకూడదంటే రూ. పది లక్షలు ఇస్తే, నాలాకు ఎన్‌వోసీ జారీ చేస్తామని చెప్పాడు. పలు దఫాలుగా జరిపిన చర్చల్లో రూ.7 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం జరిగింది. తరువాత స్థల యజమాని ఎన్‌వోసీకి దరఖాస్తు చేసుకున్నాడు. ముందస్తుగా రూ.లక్ష చెల్లించాలని డిమాండ్ చేయడంతో శుక్రవారం ఉదయం బాధితుడు హైదరాబాద్ ఏసీబీ విభాగాన్ని ఆశ్రయించాడు. తరువాత పటాన్‌చెరు డీఈ కార్యాలయం వద్దకు చేరుకున్న బాధితుడు ఏఈ రవికిషోర్‌ను కలుసుకుని రూ. లక్ష చెల్లిస్తానన్నారు. కార్యాలయంలో వద్దని బయట తన సిల్వర్ కలర్ స్కోడా కారు ముందు సీట్లో కూర్చుని డ్యాష్ బోర్డులో పెట్టాలని సూచించారు. వెనక సీట్లో కూర్చున్న రవికిషోర్ సూచనల మేరకు రెండు రూ.500 నోట్ల కట్టలను డ్యాష్ బోర్డులో పెట్టాడు. కార్యాలయం ఆవరణలో మాటు వేసి చూస్తున్న ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి రవికిషోర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ.. ఏఈ రవికిషోర్ ఎన్‌వోసీ జారీ చేసేందుకు లంచం రూపంలో రూ. లక్ష తీసుకున్నానని అంగీకరించినట్లు స్పష్టం చేశారు. ఈ వ్యవహారం అంతటినీ వీడియో తీశామని తెలిపారు. ఏఈని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

మోసగాడు ఈ మేనమామ

- మేనల్లుడు, మేనకోడలి ఆస్తులు కాజేసేందుకు జగన్ యత్నం: షర్మిల

అమరావతి, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, తన సోదరుడు వైఎస్ జగన్‌ను తిట్టడం కోసమే తాను రాజకీయాల్లో కొనసాగడంలేదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. "రాష్ట్ర ప్రయోజనాల కోసమే నేను రాజకీయాల్లో ఉన్నాను. కానీ, దీనికి భిన్నంగా నా విషయంలో కవరేజీ ఇస్తున్నారు. ఇది బాధాకరం." అని ఆమె తెలిపారు. ఆస్తుల పంపకాల విషయంలో స్వయంగా ఎంవోయూపై జగన్ సంతకం చేశారని, ఆస్తుల్లో ఎవరికి ఏవి చెందాలనేది స్పష్టంగా అందులో పేర్కొన్నారని షర్మిల వివరించారు. కానీ, వాటిని ఇంతవరకూ ఇవ్వలేదని తెలిపారు. "గిఫ్ట్‌ను ఆయన విజయమ్మకు ఇచ్చారు. నాకు ఇవ్వలేదు. ఇచ్చిన షేర్లను జగన్ వెనక్కి అడుగుతున్నారు. ఇది సొంత తల్లికి కుమారుడు చేస్తున్న మోసం." అని ఆమె వాపోయారు. తల్లిమీద కేసు పెట్టినవాడిగాను, ఆస్తులు కాజేయడానికి సొంత మేనల్లుడు,మేనకోడలినే మోసం చేసిన మేనమామగాను జగన్ చరిత్రలో మిగిలిపోతారని విమర్శించారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో శుక్రవారం విలేకరులతో షర్మిల మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం చంపేస్తోందని ఆమె ఆరోపించారు. "పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్ల ఎత్తుకే పరిమితం చేయడంవల్ల అది బ్యారేజీ స్థాయికి పరిమితం అవుతుంది. కేవలం ఎత్తిపోతల పథకంగానే మిగిలిపోనుంది. ఇలాంటి ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికి కలిగే ప్రయోజనం ఏమిటి? సహాయ, పునరావాస ప్యాకేజీని ఎగ్గొట్టేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ఎత్తు వేసింది. 85 వేలమంది నిర్వాసితులకు అన్యాయం చేసింది. అయినా, కూటమినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్; వైసీపీ అధినేత జగన్ కూడబలుక్కున్నట్లుగా మౌనంగా ఉన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్వేత పత్రం విడుదల చేయాలి." అని షర్మిల డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అందరూ దోషులేనా?

ఒక సిట్టింగ్ జడ్జి ఇంట్లో నోట్లకట్టలు దొరికితే, మీరు ఆయనను బదిలీ మాత్రమే చేశారు, మరి వీళ్ళను ఎందుకు చేయలేదు? అంటూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టును ఉద్దేశించి వేసిన ప్రశ్నలో అణచిపెట్టుకోలేనంత ఆగ్రహం, అక్కసూ కనిపిస్తున్నాయి. పదేళ్ళుగా పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపేస్తున్న ఉపాధ్యాయుల నియామకప్రక్రియ అంతా కలుషితం, గందరగోళం, అవినీతిమయం అంటూ సుప్రీంకోర్టు గురువారం చేసిన నిర్ధారణ తృణమూల్ అధినేత్రికి పెద్ద ఎదురుదెబ్బ. సర్వోన్నత న్యాయస్థానం మీద గౌరవం ఉన్నదని అంటూనే, తీర్పు అనంతరం ఆమె తాను చేయదల్చుకున్న రాజకీయ వ్యాఖ్యలన్నీ చేశారు. పాతికవేలమంది కుటుంబాలను రోడ్డునపడేసిన పాపాన్ని బీజేపీ, సీపీఎం మీదకు నెట్టేశారు. గత ఏడాది కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం ఆమెకు మరింత బాధ కలిగించే అంశం. ఆ హైకోర్టు తీర్పు వెనుక ప్రస్తుతం బీజేపీ ఎంపీగా మారిన అప్పటి న్యాయమూర్తి ఉన్నారని కదా ఆమె వాదన.

ఏడాదిలో ఎంత మార్పు! పాతికవేలమందిని ఒక్కవేటున తొలగించడం, వారు ఎనిమిదేళ్ళుగా ఆర్జించిందంతా నెలరోజుల్లోనే వసూలు చేయడం ఇత్యాది కఠినమైన నిబంధనలతో గత ఏడాది కలకత్తా హైకోర్టు వెలువరించిన తీర్పు అమలును సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలువరించడంలో మానవీయ అంశాలతో పాటు అనేకం పనిచేశాయి. 2016నాటి ఈ రాష్ట్ర స్థాయి పరీక్షలో అక్రమార్కులు ఎందరు, నీతిమంతులు ఎవరన్నది పట్టించుకోకుండా, బియ్యాన్నీ రాళ్ళనీ వేరు చేయకుండా, మొత్తం నియామకప్రక్రియనే తప్పుబట్టి, అందరూ దొంగలేనని నిర్ధారించడం అమానుషం కాదా? అని ప్రశ్నిస్తూ మమత ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సార్వత్రిక ఎన్నికలముందు వెలువడిన ఆ తీర్పువెనుక రాజకీయ కుట్ర ఉన్నదన్న వాదనను కూడా ఆమె ప్రజల్లోకి తీసుకుపోయారు. అభిజిత్ గంగోపాధ్యాయ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా ఈ కుంభకోణం మీద ఎంత శ్రద్ధచూపారో తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు వరుస ఎఫ్ఐఆర్‌లు నమోదవుతూ మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ళమీద దాడులు జరుగుతూ తృణమూల్ బాగా అప్రదిష్టపాలైంది. ఏకంగా పద్నాలుగు కేసులను ఆయన సీబీఐకి అప్పగించి, ఎప్పటికప్పుడు మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తూ మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ లక్ష్యాలుగా విమర్శలు గుప్పించేవారు. ఒక దశలో సుప్రీంకోర్టు రంగప్రవేశం చేసి ఆయనను నిలువరించాల్సి వచ్చింది కూడా. రెండేళ్ళపాటు ఇలా అవినీతి వ్యతిరేకపోరాటం చేసిన ఈ సిట్టింగ్ జడ్జి సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి లోక్‌సభకు పోటీ చేయడంతో తృణమూల్‌కు ఆయుధం అందివచ్చింది. బీజేపీ మనిషి అంటూ ఎంతోకాలంగా తాము చెబుతున్నది నిజమైందని, ఈ కుంభకోణంలో ఆయన ఇచ్చిన ఆదేశాలన్నీ రద్దు చేయాలని తృణమూల్ అప్పట్లో డిమాండ్ చేసింది. అంతిమంగా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు వెనుక బీజేపీ ఉన్నదని దాని వాదన.

విద్యామంత్రి పార్థాచటర్జీ సహా పలువురు నాయకులను జైలుకు పంపిన ఈ కుంభకోణంలో బీజేపీ, తృణమూల్ నాయకుల పరస్పర ఆరోపణలను అటుంచితే, కోల్‌కత్తా హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు ఆ మరుసటి నెలలోనే నిలిపివేయడం వెనుక ఈ కేసుతో లక్షన్నరమంది జీవితాలు ముడిపడివున్నాయన్న విచక్షణ కూడా ఉంది. సీబీఐ నివేదిక, స్కూల్ సర్వీస్ కమిషన్ చేసిన నిర్ధారణలు, వివిధ దర్యాప్తులు, విచారణలు తేల్చిన లెక్కలను బట్టి మొత్తం నియామకాల్లో ఓ నాలుగున్నర వేల పోస్టులు మాత్రమే అక్రమంగా భర్తీ అయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం వాదన. ఇప్పుడు అక్రమం, సక్రమం నిష్పత్తిని నిగ్గుతేల్చకుండా హైకోర్టు మాదిరిగానే యావత్ ప్రక్రియను ఒకేగాటన కడుతూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పుచెప్పడం ఈ ఉద్యోగులకు అశనిపాతం. ఈ తీర్పు ప్రభుత్వ నియామక వ్యవస్థల్లో జవాబుదారీతనాన్ని పెంచవచ్చు. కానీ, భార్యాబిడ్డలు, అమ్మానాన్నలను చూసుకుంటూ, అప్పునీ, అనారోగ్యాన్నీ మోసుకుంటూ, పదేళ్ళుగా ఉద్యోగంలో ఉంటూ మూడుపదులు దాటిపోయినవారిని ఇలా రోడ్డునపడవేస్తే మిగతా జీవితాన్ని ఎలా నెట్టుకొస్తారని న్యాయస్థానం ఆలోచించివుంటే బాగుండేది. కొందరు చేసిన పాపానికి అందరూ ఇంతటి శిక్ష అనుభవించాల్సిందేనా, వందమంది దోషులు తప్పించుకున్నా సరే, ఒక్క అమాయకుడు కూడా బలి కాకూడదన్న సహజ న్యాయసూత్రం ఇక్కడ అమలవుతున్నదా? అన్నవి ప్రశ్నలు.

ముస్లింలపై మరో దాడి!

స్వాతంత్ర్య తొలి దశాబ్దంలో తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం–1954ను రద్దు చేస్తూ పార్లమెంటు 1995లో కొత్త వక్ఫ్ చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టానికి 2013లో ప్రధాన సవరణలు చేశారు. జరిగిన సవరణలు 57 అని నా లెక్కలో తేలింది. దాదాపు 12 సంవత్సరాలు గడిచిపోయాయి. ఎవరి ప్రయోజనాల కోసమయితే ఆ చట్టాన్ని చేశారో వారు ఏమైనా ఫిర్యాదులు చేస్తే వాటి ఆధారంగా కొత్త సవరణలు తప్పనిసరి అని లేదా లాభదాయకమని ప్రభుత్వం విశ్వసించిన పక్షంలో సవరణల బిల్లు ద్వారా సదరు చట్టంలో సంస్కరణలు తీసుకురావచ్చు. అయితే వక్ఫ్ (సవరణ) బిల్లు–2025 చేసింది వక్ఫ్ చట్టాన్ని సంస్కరించడం ఎంత మాత్రం కాదు. అందుకు విరుద్ధంగా ప్రస్తుతమున్న చట్టాన్ని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన సొంత ఉద్దేశాలతో గుర్తించడానికి వీలు లేకుండా వికృతం చేసింది. ఒక అసమగ్ర చట్టాన్ని తీసుకువచ్చింది.




■ పి. చిదంబరం

'పళని' పలుకు

బహుళ మతాలు విలసిల్లుతున్న ఒక ప్రజాస్వామిక దేశంలో గౌరవించవలసిన మొదటి సూత్రం అన్ని మతాలు సమానమే అన్నది కాదూ? ఏదైనా ఒక మతానికి చెందిన మత సంస్థల నిర్వహణ అనేది విధిగా అదే మతస్థుల చేతుల్లో ఉండితీరాలి. హిందూ మతస్థులు అత్యధికంగా ఉన్న భారత్‌లో ఆ సూత్రం హిందూ దేవాదాయ, ధర్మాదాయ సంస్థలు అన్నిటికీ ఎటువంటి మినహాయింపు లేకుండా వర్తింప చేస్తున్నారు. 'మైనారిటీ' మతాల విషయంలోనూ ఈ సూత్రాన్ని భారత రాజ్యాంగం ప్రకారం వర్తింప చేస్తున్నారు. మత సంస్థల నిర్వహణలో స్వేచ్ఛ అనే విషయమై భారత రాజ్యాంగ అధికరణ 26 ఇలా నిర్దేశించింది: 'ప్రజా సంక్షేమం, ఆరోగ్యకరమైన నైతికతలకు లోబడి మత సంస్థల నిర్వహణకు సంబంధించి ప్రతి మతానికి ఈ క్రింద ఉదహరింపబడిన స్వేచ్ఛ ఉంటుంది– మత, ధార్మిక సంస్థల సంస్థాపన, నిర్వహణ; మత విషయాల సంబంధిత కార్యకలాపాలను తమకుతామే నిర్వహించుకొనుట; స్థిర, చరాస్తులను సమకూర్చుకొనుట; చట్టం ప్రకారం సదరు స్థిర, చరాస్తుల నిర్వహణ.

హిందూ మత సంస్థలు, దాతృత్వ సంస్థల పాలనా వ్యవహారాలను హిందువులు మాత్రమే నిర్వహిస్తున్నారు. హిందూ దేవాలయాలు, మత సంస్థలు, దాతృత్వ సంస్థల నిర్వహణ, పాలనా వ్యవహారాలలో హిందూయేతరులకు పాత్ర కల్పించాలని ఎవరూ సూచించరు, హిందువులు ఎవరూ అటువంటి సూచనను అంగీకరించబోరు. ఇది స్పష్టం. (అసలు హిందూయేతరులు ఎవరినీ తిరుమల–తిరుపతి దేవస్థానంలో కనీసం ఉద్యోగులుగా కూడా నియమించకూడదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు). ఇతర మతాలకు చెందిన కోట్లాది అనుయాయులు కూడా అదే అభిప్రాయాన్ని కలిగివున్నారు.



ప్రస్తుతం ఉన్న వక్ఫ్ చట్టాన్ని నరేంద్రమోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వికృతం చేసి, ఈ అసమగ్ర చట్టాన్ని తీసుకువచ్చింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు ముస్లింలే అయి ఉండాలన్న నిబంధనను తొలగించారు. ముస్లిమేతరులు కూడా బోర్డులో నియమితులవుతారు. మరి, దీన్ని ఇతర మతాల సంస్థల పాలనావ్యవహారాలకు కూడా వర్తింపచేస్తారా? హిందూ సంస్థలలో హిందూయేతరులను నియమిస్తారా? వక్ఫ్ (సవరణ) ముస్లిం మతస్థులపై మరో దాడి, సందేహం లేదు. అదొక దుష్టయోచన ఫలితమని స్పష్టమవుతోంది.

ప్రస్తుతం హిందూ, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ మతాలకు సంబంధించిన ఆరాధనా మందిరాలు, దాతృత్వ సంస్థలలో ఏ ఇతర మతానికి చెందిన వ్యక్తికి పాత్ర కల్పించేందుకు చట్టాలు అనుమతించడం లేదు.

వక్ఫ్ చట్టం–1995 కింద ఆ సూత్రాన్ని నిష్ఠాబద్ధంగా పాటించారు. వక్ఫ్ అంటే ముస్లిం చట్టం గుర్తించిన ధార్మిక, మత, దాతృత్వ కార్యకలాపాల కోసం ఏ వ్యక్తి అయినా ఆస్తిని శాశ్వతంగా సమర్పించడం. ముస్లిమేతరులు సృష్టించిన వక్ఫ్‌లను సైతం న్యాయస్థానాలు గుర్తించడం జరిగింది. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. అంతేకాకుండా ప్రస్తుతమున్న చట్టం ప్రకారం ఒక వక్ఫ్ అనేది చాలవరకు స్వతంత్ర, స్వయం పాలిత ఆస్తి. రాష్ట్రాల స్థాయిలో వక్ఫ్ ఆస్తుల నియంత్రణకు అత్యున్నత సంస్థ వక్ఫ్ బోర్డు. ఇందులో సభ్యులు అందరూ విధిగా ముస్లింలే ఉంటారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి సైతం ముస్లిమే అయివుండాలి. ఈ బోర్డు తన అధికారాలను వక్ఫ్ ఆదేశాలకు, వక్ఫ్ లక్ష్యాలకు, వక్ఫ్ ఆచారాలు, ఉపయోగాలకు అనుగుణంగా చెలాయించాలి. వక్ఫ్ ఆస్తులపై న్యాయ నిర్ణయాలు తీసుకునే అధికారం ఒక ట్రిబ్యునల్‌కే ఉంటుంది. ఈ న్యాయాధికార సంస్థకు జిల్లా జడ్జి చైర్‌పర్సన్‌గా ఉంటారు.

వివాదాస్పద సవరణ బిల్లు ఎంతో కాలంగా ఉన్న సూత్రాలు, ఆచరణలను తలకిందులు చేసింది: (1) 'ఏ వ్యక్తి అయినా' ఒక వక్ఫ్‌ను సృష్టించలేడు; కనీసం ఐదు సంవత్సరాలుగా ఇస్లాంను ఆచరిస్తున్నానని నిరూపించిన వ్యక్తి మాత్రమే ఒక వక్ఫ్‌ను సృష్టించాలి. ఎందుకు? ఒక వ్యక్తి తాను ఇస్లాంను ఆచరిస్తున్నానని ఎలా నిరూపించాలి? సమాధానం లేదు. (2) ఒక వక్ఫ్ సృష్టికర్త తన చర్యవెనుక ఎటువంటి 'వంచనాపూర్వక ఎత్తుగడ' లేదని నిరూపించాలి. 'వంచనాపూర్వక ఎత్తుగడ' అంటే ఏమిటి? సమాధానం లేదు; (3) వక్ఫ్‌గా సమర్పించిన ఆస్తి 'ప్రభుత్వ' ఆస్తి అని వాదన వస్తే దాని నిజానిజాలపై సీనియర్ ప్రభుత్వాధికారి విచారణ నిర్వహించాలి. సదరు వక్ఫ్ ప్రభుత్వ ఆస్తి అవునో కాదో ఆ విచారణాధికారి నిర్ణయిస్తాడు. ప్రభుత్వ ఆస్తి అని నిర్ధారించినపక్షంలో ఆ అధికారి అందుకు సంబంధించి రెవెన్యూ రికార్డులలో సవరణలు చేయాలి. ఇది న్యాయమూర్తి తన సొంత కేసులో తానే తీర్పు ఇవ్వడం'లాంటిది కాదా? ఈ ప్రశ్నకూ సమాధానం లేదు. (4) రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు ముస్లింలే అయి ఉండాలన్న నిబంధనను తొలగించారు. ఈ ప్రకారం ముస్లిమేతరులను కూడా వక్ఫ్ బోర్డులో నియమితులవుతారు. మరి దురుద్దేశాలతో వ్యవహరించే ఒక ప్రభుత్వం ముస్లిమేతరులనే ఎక్కువగా వక్ఫ్ బోర్డు సభ్యులుగా నియమించవచ్చు. ఇదొక తిరోగామి నిబంధన. మరి దీన్ని ఇతర మతాల సంస్థల పాలనావ్యవహారాలకు కూడా వర్తింపచేస్తారా? హిందూ మత/ దాతృత్వ సంస్థలలో హిందూయేతరులను నియమిస్తారా? సమాధానం లేదు; (5) వక్ఫ్ (సవరణ) బిల్లు నమూనా అద్వితీయమైనది. దీని స్ఫూర్తితో ఇతర మతాల సంస్థలకు సంబంధించిన చట్టాలలో కూడా సవరణలు చేస్తారా?

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింలపై దాడిని జాతీయ పౌరుల పట్టిక/ పౌరసత్వ సవరణ చట్టంతో ప్రారంభించింది. ఉమ్మడి పౌర స్మృతిని తొలుత ఉత్తరాఖండ్‌లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ముస్లింలు మెజారిటీగా ఉన్న ఏకైక రాష్ట్రం జమ్మూ–కశ్మీర్‌ను విభజించి కేంద్ర పాలిత ప్రాంతాల స్థాయికి కుదించారు. 2019–20 నుంచి 2023–24 దాకా మైనారిటీలకు మొత్తం రూ.18,274 కోట్ల మేరకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. అయితే ఆ మొత్తంలో రూ. 3,574 కోట్ల ఖర్చు పెట్టనే లేదు. మౌలానా ఆజాద్ ఫెలోషిప్ ఫర్ మైనారిటీ స్టూడెంట్స్‌తో సహా ముస్లింలకు అందిస్తున్న విద్యాసంబంధ సహాయాన్ని నిలిపివేశారు. వక్ఫ్ (సవరణ) బిల్లు ముస్లిం మతస్థులపై మరో దాడి, సందేహం లేదు. అదొక దుష్టయోచన ఫలితమని స్పష్టమవుతోంది.

గత ఏడాది 18వ లోక్‌సభ ఎన్నికలలో ఓటర్లు తమకు ఇచ్చింది 240 సీట్లు మాత్రమే అయినప్పటికీ ప్రజల వైఖర్లు, అభిప్రాయాలు ఏమీ మారలేదని భారతీయ జనతా పార్టీ భావిస్తోంది. 17వ లోక్‌సభ కాలంలో అనుసరించిన రాజకీయ అజెండానే జాతీయ పాలక పార్టీ ఇప్పుడూ ఔదలదాల్చుతోంది. మార్పులేని ఆ అజెండానే అమలు పరిచేందుకు బీజేపీ నిశ్చయించుకుంది. అందులో భాగమే పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన కొత్త వక్ఫ్ చట్టం.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

నికోబార్‌లో నమ్మకద్రోహం

సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలపై బహిరంగ చర్చలలో ఏ పదమూ, 'జాతీయ మీడియా'లా భ్రమలు కల్పించదు, తప్పుదోవ పట్టించదు. జాతీయ మీడియాగా పరిగణన పొందుతున్న వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, టీవీ ఛానెల్స్ ఆలోచనా రీతులు సంకుచిత పరిధిలోనే ఉండిపోతున్నాయి. సైద్ధాంతిక, పక్షపాత గంతలు కట్టుకుని వాస్తవాలను చూస్తున్నాయి. జాతీయ రాజధాని ప్రాంతం (నేషనల్ క్యాపిటల్ రీజియన్) నుంచి, తరచు ఎన్‌సిఆర్ నుంచి మాత్రమే మన సువిశాల భారతదేశ సంఘటనలు, పరిణామాలను అవి చూస్తున్నాయి. అధికార పీఠానికి అన్ని విధాల చేరువలో ఉండడం వాటిని ప్రలోభపరుస్తుంది, సంతృప్తి పరుస్తుంది. కనుకనే వార్తాపత్రికల సంపాదకీయ పుటలలో కేంద్ర కేబినెట్ మంత్రుల వ్యాసాలు తరచు ప్రచురితమవుతుంటాయి. ఇక టెలివిజన్‌లో భారతావని విలక్షణ వైవిధ్యం భిన్న పార్టీలకు చెందిన రాజకీయ వేత్తల మధ్య అరుపులు, కేకల వ్యవహారానికి పరిమితమవుతోంది! ఈ కారణంగానే మన సువిశాల మాతృభూమి వేర్వేరు ప్రాంతాలలోని విభిన్న సామాజిక సముదాయాల జీవనస్థితిగతులపై నిశిత, సమగ్ర అధ్యయనాలకు సంబంధించిన కథనాలకు 'జాతీయ' వార్తాపత్రికలలో అల్ప ప్రాధాన్యం మాత్రమే లభిస్తుండగా, 'జాతీయ' టెలివిజన్‌లో అసలు ప్రస్తావనకే నోచుకోవడం లేదు!

'జాతీయ మీడియా'పై నా సంశయాలు సంవత్సరాలుగా పెరుగుతూనే ఉన్నాయి. అవి సహేతుకమైనవని పెద్ద ఎత్తున వెల్లడవుతోన్న ఒక జాతీయ కళంకం గురించిన రెండు ప్రశస్త వ్యాస సంకలనాలు ధ్రువపరిచాయి. మరి ఎన్‌సిఆర్‌లోని ఏ టెలివిజన్ స్టూడియోలోను ఆ విషయమై ఎన్నడూ ఎలాంటి చర్చ కనీస మాత్రంగానైనా జరగలేదు. జరగగలదనే ఆశాభావానికి సైతం ఆస్కారం లేదు. నేను ప్రస్తావించిన లజ్జాకర విషయం గ్రేట్ నికోబార్ దీవిలో ప్రణాళికా బద్ధ విధ్వంసం. చెన్నై నుంచి వెలువడే ఫ్రంట్ లైన్ మ్యాగజైన్ (3 మార్చి, 2025 సంచిక), పంకజ్ సేఖ్సారియ సంకలనం చేసిన వ్యాస సంపుటంలో ఆ అంశంపై నిశిత, విపుల వ్యాసాలు ఉన్నాయి. పంకజ్ సంకలనం 'The Great Nicobar Betrayal' ఒక దుర్బల దీవిని ప్రభుత్వం బుద్ధిపూర్వకంగానే విపత్తులోకి నెట్టివేస్తోందని పేర్కొంది. పంకజ్ స్వయంగా అండమాన్ నికోబార్ దీవులలో పలు సంవత్సరాల పాటు పరిశోధన నిర్వహించారు. ఆయన సంకలనంలోని వ్యాస రచయితలకు కూడా ఆ దీవుల స్థితిగతుల గురించి పరిశోధనల రూపేణా ప్రత్యక్ష పరిజ్ఞానం ఉన్నది.

కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రాజెక్టుతో గ్రేట్ నికోబార్ దీవికి అనేక ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆ వ్యాసాలు అన్నీ స్పష్టం చేశాయి ప్రస్తుతం ఆ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80,000కోట్లు. ఇది ఇంకా తప్పకుండా పెరుగుతుందని నిశ్చితంగా చెప్పవచ్చు. ఈ దుర్బల దీవిలో ఒక నౌకాశ్రయం, ఒక అంతర్జాతీయ విమానాశ్రయం, భారత్ ప్రధాన భూభాగం నుంచి వలసవెళ్లే లక్షలాది ప్రజల ఆవాసానికిగాను ఒక పట్టణాన్ని ఆ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్నారు. 910 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న గ్రేట్ నికోబార్ దీవి నికోబార్ దీవుల సముదాయంలో చాలా పెద్దది. 'అండమాన్, నికోబార్ అనే ద్వీప సముదాయంలో భాగంగా ఉన్న గ్రేట్ నికోబార్ భూకంపాలకు ఆస్కారమున్న ప్రాంతం. ఈ దీవిలో



గ్రేట్ నికోబార్‌లో అమలవుతున్న మెగా ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం ఒక విపుల ప్రణాళికతో ఆ దీవి ప్రాకృతిక, సాంస్కృతిక సమగ్రతపై సంకల్పించిన దాడి. పర్యావరణాన్ని పరిరక్షించి సుస్థిరాభివృద్ధిని ప్రోత్సహించవలసిన శాసన విహిత బాధ్యతలు ఉన్న ప్రభుత్వ సంస్థలు, ఆదివాసీల హక్కులను రక్షించవలసిన రాజ్యాంగ బాధ్యత ఉన్న అధికారులు తమ విధ్యుక్త ధర్మాలను విస్మరించడం దిగ్భ్రాంతిగొలుపుతుంది.

గత దశాబ్దంలో 400కు పైగా భూకంపాలు నమోదయ్యాయి. 2004లో గ్రేట్ నికోబార్ సునామీ తాకిడికి గురయింది. దీవి అంతా ధ్వంసమయింది. ఆ దీవివాసులు అయిన ఆదివాసీలలో అనేక మంది సునామీలో కొట్టుకుపోయారు. మరెంతో మంది పూర్తిగా నిరాశ్రయులయ్యారు.

ఆ సముద్ర ఉత్పాతం ఊహించని, ఆకస్మిక పరిణామం. అయితే ఇప్పుడు అమలవుతున్న కొత్త ప్రాజెక్టు ప్రభుత్వం ఒక విపుల ప్రణాళికతో ఆ దీవి ప్రాకృతిక, సాంస్కృతిక సమగ్రతపై సంకల్పించిన దాడి! అవును, అక్షరాలా దౌర్జన్యమే, సందేహం లేదు.

నౌకాశ్రయ నిర్మాణంతో అరుదైన భారీ తాబేళ్ల ఆవాస ప్రదేశాలన్నీ ధ్వంసమవుతాయి. ఇంకా పర్యావరణానికి ఎనలేని నష్టం వాటిల్లుతుంది. నిర్మించనున్న పుర నివేశం (టౌన్‌షిప్)తో 130చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని కోటికి పైగా వృక్షాలు ఉన్న దట్టమైన అడవి అంతరించిపోతుంది. ఈ దీవి చాలా అరుదైన, స్థల విశిష్ట వృక్ష, కీటక, పక్షి, జంతు జాతులు, సరీసృపాలకు నెలవు. ఈ జీవ వైవిధ్యమంతా నాశనమై పోతుంది. ఇదంతా పర్యావరణపరమైన హాని కాగా సామాజిక మూల్యాలు అంతే తీవ్రమైనవి. అసలే దుర్బలురు అయిన ఆ దీవి మూలవాసులు అందరూ మరింతగా పేదరికంలోకి జారిపోతారు. గిరిజన సముదాయాలను కాపాడాలనే రాజ్యాంగ నిర్దేశాలు పూర్తిగా ఉల్లంఘనకు గురవుతాయి. గ్రేట్ నికోబార్‌లో ప్రస్తుతం 8500 మంది నివసిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలయితే జనాభా సంఖ్య 40 రెట్లు పెరుగుతుంది. ఆ దీవి సంస్కృతి, పర్యావరణంపై భారతదేశ ప్రధాన భూభాగం నుంచి జనాభా వలసల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. ఆ మార్పు చాలా హానికరంగాను, మార్పులేనిదిగాను ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అండమాన్ నికోబార్ దీవులలో విస్తృతంగా క్షేత్ర పరిశోధనలు చేసిన అజయ్ సైని, అన్విత అబ్బి ఇటీవల ఒక వ్యాసంలో ఇలా రాశారు: 'గ్రేట్ నికోబార్ మెగా ప్రాజెక్టు కేవలం ఒక పర్యావరణ విపత్తు మాత్రమే కాదు; అభివృద్ధి పేరిట జరుగుతున్న ఉద్దేశపూర్వక, భయంకర, భాషాసంబంధి, సాంస్కృతిక జాతి సంహారం'.

ఈ మెగా ప్రాజెక్టు గ్రేట్ నికోబార్‌ను సామాజిక నిర్మాణాలను పర్యావరణ వ్యవస్థలనూ పూర్తిగా ధ్వంసంచేస్తుంది. ఆర్థిక లబ్ధిపరంగా చూసిన అది సమర్థనీయమైన ప్రాజెక్టు కానేకాదు. ఫ్రంట్‌లైన్‌లో వెలువడిన ఒక వ్యాసం శీర్షిక 'The numbers do not add up' (సంఖ్యలు కలిసిరావు) ఆ వాస్తవాన్ని ప్రభావదాయకంగా చెప్పింది. నౌకాశ్రయం, పర్యాటక రంగం నుంచి సంభావ్య రాబడి పెద్దగా ఉండదని, ఆ ప్రాజెక్టును ఆర్థికంగా ప్రయోజనకరంగా చేయదని రాజశేఖర్ వ్యాఖ్యానించారు. మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరిచేందుకు భారీ ధనరాశులను ఉపయోగించడం వాస్తవంగా ప్రైవేట్ కార్పొరేట్ ప్రయోజనాలకు దోహదం చేస్తుందని ఆయన అన్నారు. ఈ వ్యాసాలను చదవడం ద్వారా ఆ దీవి పర్యావరణాన్ని పరిరక్షించి సుస్థిరాభివృద్ధిని ప్రోత్సహించవలసిన శాసన విహిత బాధ్యతలు ఉన్న ప్రభుత్వ సంస్థలు, ఆదివాసీల హక్కులను రక్షించవలసిన రాజ్యాంగ బాధ్యత ఉన్న అధికారులు తమ విధ్యుక్త ధర్మాలను ఎలా విస్మరిస్తున్నారో దిగ్భ్రాంతి గొలుపుతుంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, భారతీయ వన్యప్రాణుల సంస్థ, నీతి ఆయోగ్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్షేత్ర వాస్తవాలను జాగ్రత్తగా పరిశీలించకుండా, సాధ్యాసాధ్యాలను నిర్దుష్టంగా అంచనా వేయకుండా మెగా ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను ఎంత నిరాలోచనగా మంజూరు చేశాయో పంకజ్ సంకలన గ్రంథం, ఫ్రంట్‌లైన్‌లోని వ్యాసాలు విపులంగా వివరించాయి.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఈ హానికర వ్యవహారంలో గౌరవనీయ శాస్త్రవేత్తలు సైతం భాగస్వాములు కావడం కలవరం కలిగిస్తోంది. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ మాజీ డైరెక్టర్ ఒకరు 2018లో ఈ మెగా ప్రాజెక్టుకు ఆక్షేపణ తెలుపడాన్ని పంకజ్ తన వ్యాసంలో ప్రస్తావించారు. 'చాలా ఆందోళనకరమైన ప్రాజెక్టు అని, దాన్ని అమలుపరిస్తే ప్రపంచ సాగర జీవవైవిధ్యపు అరుదైన ప్రదేశాలు పూర్తిగా ధ్వంసమవుతాయని' ఆ శాస్త్రవేత్త అన్నారు. 'గ్రేట్ నికోబార్ జీవ వైవిధ్యాన్ని యథాతథంగా పరిరక్షించాలని, ఆ దీవి స్వతస్సిద్ధ పర్యావరణ వనరులను జాతీయ ఆస్తులుగా పరిరక్షించాలని ఆ శాస్త్రవేత్త సూచించారు. అయితే కొద్ది సంవత్సరాల అనంతరం ఒక ప్రభుత్వ కమిటీ చైర్మన్‌గా నియమితుడైన ఆ శాస్త్రవేత్త మాట మార్చి గ్రేట్ నికోబార్‌లో ఆ ప్రతిపాదిత మెగా ప్రాజెక్టును అమలుపరిచి తీరాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు! స్వతంత్ర వైఖరి ఉన్న యువ శాస్త్రవేత్తలు ఆ మెగా ప్రాజెక్ట్‌ను స్ఫూర్తిదాయకంగా వ్యతిరేకించారు. యువ పర్యావరణవేత్తలు రోహన్ అర్థర్, టిఆర్ శంకర రామన్‌లు ఫ్రంట్‌లైన్‌లో రాసిన ఒక వ్యాసంలో గ్రేట్ నికోబార్‌లోని సమృద్ధ జీవ వైవిధ్యాన్ని, అక్కడి ఆదివాసీ సమూహాలకు తమ ప్రాకృతిక పరిసరాలతో ఉన్న ప్రగాఢ అనుబంధాన్ని వివరించి, ప్రతిపాదిత ప్రాజెక్టుకు 'నష్టపరిహారంగా అభివృద్ధిపరిచే అడవులు', దెబ్బతిన్న ప్రవాళ భిత్తికల 'పునరుద్ధరణ' పథకాలు ప్రయోజకరమైనవి కాబోవని' స్పష్టం చేశారు. 'ప్రణాళికాబద్ధ పర్యావరణ విపత్తును వైజ్ఞానిక పరిశోధకులుగా మేము సమర్థించలేమని' వారు నిక్కచ్చిగా చెప్పారు. పంకజ్ సంకలన గ్రంథానికి ప్రముఖ పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ ముందు మాట రాశారు. 'పాలక వర్గాలు పర్యావరణ భద్రతను కాపాడేందుకు, సామాన్య ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు పూనుకోవనేది ప్రపంచ దేశాల అనుభవం. ప్రజా ఉద్యమాలు మాత్రమే ప్రభుత్వాలు అలా పర్యావరణ, ప్రజాహితకరంగా వ్యవహరించేలా చేస్తాయి' అని గాడ్గిల్ పేర్కొన్నారు.

గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్‌ను నౌకా లేదా వాణిజ్య మంత్రిత్వ శాఖ కాకుండా హోం మంత్రిత్వ శాఖ నిర్వహించడం గమనార్హం. ఇది చాలా ఆందోళనకరమైన విషయం కూడా. ప్రాజెక్ట్‌పై విమర్శలు, ఆక్షేపణలను ముందుగానే అణచివేసేందుకే ఇలా జరుగుతుందన్నది స్పష్టం. నిజానికి జర్నలిస్టులు ఇప్పుడు ఆ దీవిని సందర్శించడం అంతకంతకూ కష్టతరమవుతోంది. ఈ వ్యాస రచనకు ఆధారాలు అయిన క్షేత్ర పరిశోధనలు నిర్వహించిన రచయితలు, యువ పరిశోధకులు ఆ మెగా ప్రాజెక్ట్‌ను తప్పుపడుతూ, దాని సంభావ్య విపత్కర పర్యవసానాలకు పాలకులే బాధ్యులు అని నిష్కర్షగా చెప్పారు. ఇందుకు వారు మన ఉమ్మడి కృతజ్ఞతలకు పాత్రులు. వారు అదే సమయంలో మన 'జాతీయ మీడియా' సిగ్గుపడేలా చేశారు సుమా!

(వ్యాసకర్త చరిత్రకారుడు)

తూటాపై గెలిచిన పాట

పాటను అంతం చేయాలని కుట్ర పన్నిన నియంతృత్వ పాలకులు గద్దర్‌పై 1997 ఏప్రిల్ 6న తూటా పేల్చారు. కోట్లాది ప్రజల జీవనాదమైన పాట మరింతగా దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనించింది. తూటాను వెన్నులో దాచుకొని తెలుగు నేలలోనే కాదు, దేశమంతా తిరిగి జనం పాటై హోరెత్తింది. గద్దర్ ప్రత్యామ్నాయ సాంస్కృతికోద్యమ సేనాని మాత్రమే కాదు. గొప్ప సామాజిక రాజకీయ కార్యకర్త. ప్రజలను సకల దోపిడీ పీడనల నుంచి విముక్తి దిశగా నడిపించిన యుద్ధనౌక!

మనిషికి ఆలంబనమైన పాట మధ్యయుగాల్లో భూస్వామ్య ఫ్యూడల్ ప్రభువుల చేతుల్లో బందీయై ప్రజలకు దూరమైంది. కానీ ఆ తర్వాత కాలంలో పారిశ్రామిక విప్లవాల విజయంతో, ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యాల ఆవిర్భావంతో పాట కూడా ఫ్యూడల్ ప్రభువుల చెరవీడింది. జనం చెంతకు చేరింది. జన జీవితాలు ఇతివృత్తంగా పునరుజ్జీవం పొందింది. దేశ దేశాల్లో ఎంతోమంది కవి గాయకులు పుట్టుకొచ్చి ఆయా సమాజాలను తీవ్రంగా ప్రభావితం చేశారు. ఈ కోవలో అగ్రగణ్యుడు విక్టర్ జారా.

విక్టర్ లిడియో జారా మార్టినెజ్ చిలీ దేశంలో ఒక పేద కుటుంబంలో జన్మించాడు. చిలీ సమాజంలో ఎక్కడ చూసినా హింసా దౌర్జన్యాలు రాజ్యమేలుతున్న కాలంలో ప్రజల కన్నీళ్లు తుడిచేందుకు పాటగా గొంతెత్తాడు. ఉపాధ్యాయుడిగా, థియేటర్ దర్శకుడిగా, పాటల రచయితగా, గాయకుడిగా, ముఖ్యంగా సామాజిక ఉద్యమకారుడిగా, కమ్యూనిస్టు విప్లవకారుడిగా చిలీ సమాజాన్ని పీడన నుంచి విముక్తి చేసే ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నాడు. తన కలంతో, గళంతో చిలీ సమాజాన్ని మేల్కొలిపాడు. సమసమాజం దిశగా సామాజిక విప్లవంలో కీలక భూమిక పోషించాడు. వామపక్షానికి చెందిన అలెండీ ప్రభుత్వంలో సాంస్కృతిక సలహాదారుడిగా (1960–73) చిలీని ఉన్నతీకరించే బాధ్యత నిర్వర్తించాడు. ఆ పరిస్థితుల్లో కమ్యూనిజంపై కత్తిగట్టిన అమెరికా, మిలిటరీ అధికారి అగస్తో పినాచెట్‌తో చేయికలిపి కుట్ర పన్నింది. అలెండీ ప్రభుత్వంపై మిలిటరీ తిరుగుబాటు చేయించింది. ఆ నేపథ్యంలోనే అలెండీని ఆ దేశ పార్లమెంటులోనే హత్య చేశారు. తర్వాత విక్టర్ జారాను 1973 సెప్టెంబర్ 16న శాంటియాగోలోని శాంటిటొస్‌లో నడిరోడ్డుపై హత్య చేశారు. ప్రజలను చైతన్యవంతం చేసిన పాటపై తూటా పేల్చి కసి తీర్చుకున్నాడు నియంత పినాచెట్. ఆ తర్వాతి కాలంలో ప్రపంచ ప్రజలకు, ముఖ్యంగా ప్రజా కళాకారులకు, ఆదర్శంగా నిలిచాడు విక్టర్ జారా.

సరిగ్గా విక్టర్ జారా కన్నుమూసిన కాలంలోనే గద్దర్ రూపుదిద్దుకున్నాడు. 1949 జనవరి 31న మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలో గుమ్మడి విఠల్ రావుగా జన్మించిన గద్దర్ 1973 నాటికి హైదరాబాద్‌లో ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజీలో అడుగుపెట్టాడు. ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థి యువతను ఉర్రూతలూగించిన ఏంగ్రీ సిక్స్‌టీస్ కాలపు ప్రభావం, శ్రీకాకుళ నక్సల్బరీ వసంతకాల మేఘ ఘర్జనల మెరుపులు గద్దర్‌కు వెలుగుదారులు పరిచాయి. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటజ్వాలలు, సుబ్బారావు పాణిగ్రాహి జముకుల కథ సవ్వడులు, గుమ్మడి విఠల్‌రావును గద్దర్‌గా తీర్చిదిద్దాయి. 'ఆపుర బండోడో బండెంటా నేనొస్తా', 'రక్తంతో నడుపుతాను రిక్షానూ, నా రక్తమె నా రిక్షకు పెట్రోలూ' లాంటి పాటలతో మొదలైన గద్దర్ శకం, 'ఇంద్రవెల్లి కొండల్లో దండు పుట్టిందీ నేస్తమా రావా' అంటూ దండకారణ్యం మీదుగా, 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా, నా తెలంగాణమా' దాకా తెలుగు సమాజాన్నే కాదు మొత్తం భారత సమాజాన్ని తన వెంట నడిపించాడు గద్దర్. సమకాలీన ఆధునిక ప్రపంచ చరిత్రలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలనూ చూరగొన్న ఏకైక ప్రజా గాయకుడు గద్దర్. నేటి సామాజిక పరిస్థితుల మధ్య గద్దర్ లేని లోటు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. రోజు రోజుకూ పెట్రేగుతున్న కుల వివక్ష, కులహంకారదాడులు, ప్రజలపై ముఖ్యంగా ఆదివాసులపై జరుగుతున్న హింస సమాజాన్ని కలవరపరుస్తున్నాయి. గద్దర్ ఉంటే ఈ పరిస్థితుల్లో ఎలా స్పందించేవాడు, ఏం చేసేవాడు అన్నవి అందరినీ ఆలోచింపచేస్తున్నాయి. ఆచరణకు పురికొల్పుతున్నాయి. నేటి సంక్షుభిత సమాజంలో గద్దర్ ప్రాసంగికత అడుగడుగునా తెలిసివస్తున్నది.



నేటి సామాజిక పరిస్థితుల మధ్య గద్దర్ లేని లోటు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. రోజు రోజుకూ పెట్రేగుతున్న కులవివక్ష, కులహంకారదాడులు, ఆదివాసులపై జరుగుతున్న హింస సమాజాన్ని కలవరపరుస్తున్నాయి. గద్దర్ ఉంటే ఎలా స్పందించేవాడు, ఏం చేసేవాడు అన్నవి అందరినీ ఆలోచింపచేస్తున్నాయి.

● **జి.వి. సూర్యకిరణ్**
గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి

(ఏప్రిల్ 6: గద్దర్‌పై తుపాకీ కాల్పులు జరిగిన రోజు. 'పాటపై పాలకుల అణచివేత దినం'గా హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సా. 6గంటలకు సభ)

దళిత హక్కుల పోరాటయోధుడు

జగ్జీవన్‌రామ్ అంటరానివారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన దళిత చిహ్నం. బిహార్‌లో ఒక సామాన్య రైతు కుటుంబంలో 1908 ఏప్రిల్ 5న జగ్జీవన్‌రామ్ జన్మించారు. ఆయన తండ్రి శోభీరామ్, తల్లి వసంతి దేవి. ఆయన జన్మదినాన్ని భారతదేశం అంతటా 'సమతా దివస్'గా జరుపుకుంటారు. పాఠశాల విద్య కొనసాగిస్తున్నప్పుడు ఆయన మొదటిసారి వివక్షను ఎదుర్కొన్నారు. అలాగే విశ్వవిద్యాలయంలో కూడా జగ్జీవన్‌రామ్ వివక్షను ఎదుర్కొన్నారు. ఇది సమాజంలోని ఒక వర్గంపై జరుగుతున్న సామాజిక బహిష్కరణకు వ్యతిరేకంగా నిరసన తెలపడానికి ఆయనకి ప్రేరణనిచ్చింది. అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన తెలపడానికి షెడ్యూల్డ్ కులాలను ఆయన సంఘటితం చేశారు.



బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో జగ్జీవన్‌రామ్ ఉత్సాహంగా పాల్గొనేవారు. సామాజిక సమానత్వంపై అందరినీ చైతన్య పరిచేందుకు 1934లో ఆలిండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్, అఖిల్ భారతీయ రవిదాస్ మహాసభలకు పునాది వేశారు. అలాగే 1935 అక్టోబర్ 19న దళితులకు ఓటు హక్కు కోసం హమ్మండ్ కమిషన్ ముందు వాదనలు వినిపించారు. రాజ్యాంగ సభలో సభ్యుడిగా ఆయన పాత్ర ఎనలేనిది. దళితుల సామాజిక, రాజకీయ హక్కుల కోసం ఆయన వాదించారు. 1946లో జవహర్‌లాల్ నెహ్రూ ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రభుత్వ కేబినెట్‌లో అతి చిన్న వయసులో మంత్రి అయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశానికి తొలి కార్మికమంత్రిగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. తరువాత కమ్యూనికేషన్స్, రైల్వే, రవాణా, ఆహార, వ్యవసాయం, రక్షణ వంటి కీలక శాఖల బాధ్యతలు కూడా నిర్వహించారు. దేశంలో హరిత విప్లవం విజయవంతం చేయడంలో జగ్జీవన్‌రామ్ కీలకపాత్ర పోషించారు. అలాగే జనతా పార్టీ ప్రభుత్వంలో 1977 నుంచి 1979 వరకు ఉప ప్రధానమంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్(ఇందిరా) పార్టీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. 1936 నుంచి 1986 వరకు ఐదు దశాబ్దాలకు పైగా చట్టసభ సభ్యుడిగా కొనసాగారు. దేశంలో ఎక్కువ కాలం పని చేసిన కేబినెట్ మంత్రిగానూ ఆయన రికార్డు సృష్టించారు. దళిత హక్కుల కోసమే కాదు.. మానవతా కార్యక్రమాల్లోనూ ఆయన చురుకుగా పాల్గొనేవారు.

మహాత్మాగాంధీ అభిప్రాయాలతో జగ్జీవన్‌రామ్ ఎక్కువగా ఏకీభవించేవారు. అంటరానితనాన్ని నిర్మూలించడానికి గాంధీ చేసిన ప్రయత్నాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లో గాంధీజీ వెంట నడిచారు. అజాతశత్రువుగా భారత రాజకీయ, సామాజిక రంగాల్లో వెలుగొందిన జగ్జీవన్‌రామ్ తన 78వ ఏట కన్నుమూశారు. ఆయన నడిచిన బాట.. అనుసరించిన ఆదర్శాలు.. ఆయన జీవితం నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ సుంకరి రాజారామ్

(నేడు జగ్జీవన్‌రామ్ జయంతి)

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2024-25లో మైనింగ్ శాఖ లక్ష్యం, వసూళ్లు ఇలా..

జిల్లా	క్వారీలు	లక్ష్యం	వసూలు చేసింది
వరంగల్	51	రూ.22.72కోట్లు	రూ.11.49కోట్లు
హనుమకొండ	128	రూ.61.72కోట్లు	రూ.37.08కోట్లు
మహబూబాబాద్	63	రూ.36.81కోట్లు	రూ.33.15కోట్లు
జనగామ	39	రూ.12.15కోట్లు	రూ.6.55కోట్లు
ములుగు	53	రూ.51.37కోట్లు	రూ.49.18కోట్లు
భూపాలపల్లి	01	రూ.5.27కోట్లు	రూ.4.98కోట్లు
మొత్తం	335	రూ.190.02కోట్లు	రూ.142.43కోట్లు



మైనింగ్.. అక్రమాల్లో రింగ్!

కొందరు అధికారులు, అక్రమార్కుల కుమ్మక్కు

- రాయల్టీ, సీనరేజీ ఎగవేతతో ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో గండి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 335కి పైగా గ్రానైట్, కంకర క్వారీలు
- 2024-25లో మైనింగ్‌శాఖకు రూ.190.02కోట్ల ఆదాయం లక్ష్యం
- గడువు ముగిసినా ఇంకా 25శాతం పన్ను వసూళ్లకు బ్రేక్
- నాన్‌వర్కింగ్ పేరుతో పదుల సంఖ్యలో క్వారీ పన్నుల ఎగవేత
- అక్రమార్కులకు అండగా కొందరు మైనింగ్ అధికారులు
- కంకర క్వారీల విషయంలోనూ ఇదే పరిస్థితి

మైనింగ్ దందా.. అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ఈ శాఖలోని కొందరు అధికారులు అక్రమార్కులతో 'రింగ్' అవుతుండటంతో.. గ్రానైట్, కంకర, మట్టి తదితర ఖనిజ సంపదను దర్జాగా కొల్లకొడుతున్నారు. ఒక చోట లీజుకు తీసుకుని.. సమీపంలోనే మరో చోట తవ్వితీసి.. ఆ ఖనిజానికి రాయల్టీ, సీనరేజ్‌ని ఎగవేస్తూ రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. ఈ అక్రమ దందాతో పాటు సక్రమంగా చెల్లించాల్సిన పన్నులను కూడా ఎగవేస్తూ సర్కారు ఖజానాకి భారీగా గండి కొడుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మైనింగ్ శాఖకు రూ.190.02కోట్ల ఆదాయం లక్ష్యం కాగా, కేవలం 75శాతం వరకే వసూళ్లు చేశారు. ఈ క్రమంలో పన్నువసూళ్లలో కొందరు అధికారులే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని, ఇద్దరూ కుమ్మక్కై, సర్కారు అదాయానికి రూ.కోట్లలో గండి కొడుతున్నారనే చర్చ జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అక్రమ మైనింగ్‌తో కొందరు వ్యాపారులు సర్కారు ఖజానాకు గండికొడుతున్నారు. వారితో ఆశాఖలోని కొందరు అధికారులు విలఖాత్ అవుతున్నారని, ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన సీనరేజ్, రాయల్టీల సొమ్ముకు భారీగానే గండిపడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మైనింగ్ లీజుదారులు మైనర్ మినరల్ అయితే సీనరేజ్, మేజర్ మినరల్ అయితే రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి కొంత మొత్తం పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 335కు పైగా గ్రానైట్, కంకర క్వారీలకు మైనింగ్‌శాఖ నుంచి అనుమతులున్నాయి. వీటితో పాటు 25కు పైగా ఇసుక క్వారీలు నడుస్తున్నాయి. అయితే అనుమతి ఒక చోటయితే.. చుట్టుపక్కల ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మైనింగ్ చేస్తూ కోట్లు కొల్లకొడుతున్నారు. ఇటీవల ఐనవోలు మండలం వనమాల కానిపర్తి గ్రామ సమీపంలో 42ఎకరాల్లో గ్రానైట్ తవ్వకాల కోసం మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. అయితే ఈ 42 ఎకరాల్లో కాకుండా పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కలుపుకొని 93ఎకరాల్లో అక్రమంగా గ్రానైట్ తవ్వకాలు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో మిగతా 43ఎకరాల్లో తవ్వే గ్రానైట్‌కు సంబంధించి ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా ఎగవేతకు పాల్పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇదే మండలంలో మరో గ్రామంలో 4.20ఎకరాల్లో గ్రానైట్ తవ్వకాలు చేపట్టారు. తొలుత అది ప్రభుత్వ భూమిగా ఉన్నప్పటికీ.. ఆ తరువాత కాగితాలు మార్చేసి ప్రైవేటు భూమిగా మార్చి ప్రభుత్వానికి రూ.కోట్లలో పన్నులను ఎగవేస్తున్నారనే ఆరోపణలున్నాయి. మహబూబాబాద్ జిల్లాలోనే ఇలాంటి అక్రమ దందా జోరుగా సాగుతోంది. పంథని, రాంపూర్, ఎల్కతుర్తి, తదితర ప్రాంతాల్లో గ్రానైట్ కటింగ్ మిషన్లను ఏర్పాటు చేసి, అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో కోట్లాది రుపాయల గ్రానైట్ సంపద దారి తప్పుతోంది. అయితే ఈ దందాల వెనుక మైనింగ్ శాఖలోని కొందరు అధికారుల సహకారం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మైనింగ్ మాఫియాతో చేతులు కలిపి కోట్లాది రుపాయల గ్రానెట్‌ను అక్రమంగా అమ్ముతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ దందా మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో జోరుగా సాగుతోంది. ఇక కంకర క్వారీల్లోనూ ఇదే అక్రమ పద్ధతుల్లో సర్కారు ఆదాయానికి గండి కొడుతున్నారు. భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాల్లో ఇసుక

మిగతా 7వ పేజీలో...

ఏ గ్రానైట్‌కు ఎంతంటే..

కలర్ గ్రానైట్ ఒక క్యూబిక్ మీటర్‌కు రూ.3,948, అలాగే బ్లాక్ గ్రానైట్ అయితే ఒక క్యూబిక్ మీట ర్‌కు రూ.4,763 రాయల్టీ చెల్లించా ల్సి ఉంది. ఈ లెక్కన ఒక బ్లాక్ సుమారు 8నుంచి 10క్యూబిక్ మీటర్లు ఉంటుంది. కలర్ గ్రానైట్ అయితే రూ.31,584 నుంచి రూ.39,480 వరకు, బ్లాక్ గ్రానైట్ గ్రానెట్ అయితే రూ.38,104 నుంచి రూ.47,630 వరకు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రతీ రోజు ఒక్కో క్వారీలో 1నుంచి 5వరకు బ్లాక్‌లను తీస్తారు. ఈ లెక్కనే ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా లక్షలాది రుపాయల గ్రానెట్ దారిమళ్లుతుందనే వాదన వినిపిస్తుంది.

పరిశ్రమలు స్థాపిస్తే లక్షలాది ఉద్యోగాలు వస్తాయి

- పదేళ్లలో యువతను బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది..
- నైపుణ్యం పెంచుకుంటే ఉద్యోగాలు తన్నుకు వస్తాయి..
- కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధికి ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయి..
- నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

7



జాబ్‌మేళాలో యువతికి నియామకపత్రం అందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కోసమే రైతు సత్యాగ్రహ దీక్ష
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతులను నట్టేట ముంచిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ధ్వజ మెత్తారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కు వద్ద బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి హాజరై దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు బీమా, రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారని అన్నా రు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రప్ర భుత్వాన్ని ప్రశ్నించేందుకే రైతు సత్యాగ్రహ దీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఇప్పటికైనా అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.2లక్షల రుణమాఫీ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 60లక్షల మంది రైతులు ఉంటే.. 25లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసి మొత్తం చేసినట్లు గొప్పలు చెబుతున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గుజ్జుల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, మాజీ ఎమెల్యే వన్నాల శ్రీరాములు, నాయకులు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరామ్, జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జగన్మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జైలు నుంచి విడుదలయ్యే వారిపై దృష్టి సారించాలి

పోలీసు అధికారులకు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ సూచన



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జైలు నుంచి విడుదలయ్యే నిందితులపై ప్రత్యేక దృష్టి సారించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీస్ అధికారులకు సూచించారు. ఫిబ్రవరికి సంబంధించిన నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గంజాయి కేసుల్లో రవాణాకు పాల్పడే వ్యక్తులతో పాటు భాగస్వాములైన ప్రతీ ఒక్కరిని అరెస్టు చేయాలని సూచించారు. రౌడీషీటర్లను ఠాణాలకు పిలిపించడమే కాకుండా స్థానికుల ద్వారా రౌడీషీటర్ల గురించి ఆరా తీయాలన్నారు. నేరాల జరిగే ప్రాంతాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ పోలీసులతో పాటు పోలీస్‌స్టేషన్ల అధికారులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదులపై తప్పనిసరిగా కేసులు నమోదు చేయాలని, ముఖ్యంగా ప్రజావాణి నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనగామ ఏఎస్పీ చైతన్య, ఏఎస్పీ మనాన్ భట్, తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- జేఎన్‌లో విద్యార్థినులకు కరాటేలో శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్ ద్వారా మహిళలు, బాలికలకు ఆత్మరక్షణ చేకూరుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలోని టెన్నిస్ కోర్టులో యూఎస్‌ఏలో స్థిరపడ్డ వరంగల్‌కు చెందిన ప్రముఖ కరాటే గ్రాండ్‌మాస్టర్ గూడూరు సుధాకర్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలికలకు ఆత్మరక్షణ మెళకువల(సెల్ఫ్ డిఫెన్స్)పై ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలపై జరుగుతున్న నేరాలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలల్లో కరాటేలో శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కరాటేలో మెళకువలు నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణ పొందవచ్చన్నారు.

విశిష్ట అతిథి కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. కరాటేలో రాణించడం మహిళలకు ఎంతో అవసరమన్నారు. త్వరలో జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణాశిబిరంలో విద్యార్థులు తప్పకుండా పాల్గొనాలని కోరారు. కరాటే గ్రాండ్ మాస్టర్ గూడూరు సుధాకర్ (బ్రూస్) మాట్లాడుతూ.. ఓరుగల్లుపై ప్రత్యేక అభిమానంతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆలోచన మేరకు ఇక్కడి వచ్చి, విద్యార్థినులకు కరాటేలో మెళకువల నేర్పించడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో మహిళలపై పెరుగుతున్న దాడులను అరికట్టాలంటే ఆత్మ రక్షణ అవసరమని, అది కరాటే ద్వారా సాధ్యపడుతుందన్నారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులకు కరాటేలో సుధాకర్. తన శిష్య బృందంతో మెళకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, గంథ్రాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, డీవైఎస్‌ఓ అశోక్. డీఎస్‌ఏ కోచ్‌లు కొత్త ప్రశాంత్, రమేష్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ఎం.డి. అఫ్జల్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- 7 నుంచి 15 వరకు ఫాతిమా హైస్కూల్లో టెన్త్ స్పాట్ క్యాంపు
- కేంద్రానికి చేరుకున్న 2,27000 జవాబు పత్రాలు
- విధుల్లో పాల్గొననున్న 1600 మంది పంతుళ్లు

7

కోర్టుకు బాంబు బెదిరింపు

- గుర్తు తెలియని వ్యక్తి ఈ మెయిల్‌తో అప్రమత్తం
- హనుమకొండ జిల్లా జడ్జి ఆదేశాలతో బాంబు స్క్వాడ్ తనిఖీలు
- తప్పుడు సమాచారం అని తేల్చిన పోలీసులు



జిల్లా కోర్టులో తనిఖీలు నిర్వహిస్తున్న బాంబు స్క్వాడ్

వరంగల్ లీగల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కోర్టులో బాంబు పెట్టినట్లు సమాచారం రావడంతో న్యాయమూర్తులు, న్యాయవాదులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం హనుమకొండ జిల్లా జడ్జి సీహెచ్.రమేష్‌బాబుకు గుర్తు తెలియని అగంతకుడు ఈ మెయిల్ ద్వారా సమాచారం అందించాడు. బాంబు విషయాన్ని జిల్లా జడ్జి వెంటనే సుబేదారి సీఐ పి.సత్యనారాయణ రెడ్డికి తెలిపారు. వెంటనే సీఐ బాంబు స్క్వాడ్‌కు సమాచారం అందించి పోలీసు సిబ్బందితో కోర్టు ప్రాంగణం చేరుకొని అక్కడ ఉన్న పరిసరాలను పరిశీలించారు. కోర్టు పరిసరాలను బాంబు స్క్వాడ్, జాగిలాలతో అణువణువు బాంబు కోసం గాలించారు. కోర్టు హాల్‌ను, జడ్జి చాంబర్లను అలాగే న్యాయవాదుల బార్ అసోసియేషన్ హాల్స్‌ను, కోర్టు సెక్షన్లను పోలీసులు తనిఖీ చేశారు. సుమారు రెండు గంటల పాటు తనిఖీలు కొనసాగడంతో అక్కడ ఉన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురయ్యారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. మధ్యాహ్నం 2 గంటల వరకు తనిఖీలు నిర్వహించగా బాంబు ఆనవాళ్లు కనిపించక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, జిల్లా జడ్జికి వచ్చిన ఈ మెయిల్‌పై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

చట్టాలను ఉల్లంఘిస్తున్న సర్కారు

రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

బాలసముద్రం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ, అటవీ చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ధ్వజమెత్తారు. జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన సుమారు 400 ఎకరాల అటవి భూమిని విధ్వంసం చేస్తున్న రాష్ట్రప్రభుత్వంపై నిరసన తెలిపేందుకు ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వినయభాస్కర్ మాట్లాడుతూ.. చెట్లను, జీవుల ఆవాసాలను నీటి వనరులను ఛిద్రం చేయడం దారుణమని అన్నారు. సామాజిక బాధ్యతతో జీవవైవిధ్య పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మనిషి తన అస్తిత్వం కోసం ప్రకృతిని నాశనం చేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పౌరసమాజం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్తలు పిట్టల రవిబాబు, రతన్‌సింగ్, నిఖిల్, అరవింద్‌ఆర్య, పరికిపండ్ల వేణు, శ్యామ్, కమలాకర్, విద్యార్థి నాయకులు శరత్, రాకేశ్ యాదవ్, బైరపాక ప్రశాంత్, ప్రశాంత్‌చారి, వీరస్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న దాస్యం వినయ్‌భాస్కర్, నాయకులు



సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎఫ్‌పీవో అధ్యక్షుడు, సభ్యులు

మాజీ ఎమ్మెల్యే పెద్దికి సన్మానం

దుగ్గొండి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపేటకు చెందిన చిల్లీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ అధ్యక్షుడు నరహరి రాజ్‌కుమార్‌రెడ్డితో పాటు సభ్యులు శుక్రవారం హనుమకొండలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని కలిసి సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ నెల 2న తిమ్మంపేటకు చెందిన చిల్లీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌కు జియోగ్రఫికల్ ఇండెక్స్ ట్యాగ్ (జీఐ) గుర్తింపు సర్టిఫికెట్ వచ్చింది. 2019లో అప్పటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన సూచన మేరకు నియోజకవర్గంలో ఫార్మర్ ప్రొడక్ట్ ఆర్గనైజేషన్‌లు (ఎఫ్‌పీవో)లు ఏర్పాటు చేశారు. తిమ్మంపేటలో చిల్లీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. సంఘానికి ఇండియన్ పేటెంట్ ఆఫీసు వారు చపాట మిర్చి జీఐ ట్యాగ్ సర్టిఫికేట్ అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సొదారపు శోభన్‌బాబు, బొడె ఇంద్రకర్ణాకర్‌రెడ్డి, ఒద్దుల కర్ణాకర్‌రెడ్డి, ఈదుల అశోక్, పొదిల రాజేందర్, జెటబోయిన అశోక్, కొమాండ్ల రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాలు.. ఆరోగ్య ప్రదాయినులు



చిరుధాన్యాల ఉత్పత్తి, విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమేష్ గురూజీ

హనుమకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పోషక విలువలతో కూడిన ఆహారమే ఆనందకర జీవన విధానానికి తోడ్పడుతుందని, ప్రతి ఒక్కరూ జంక్ ఫుడ్ తీసుకొని జబ్బుల బారిన పడకుండా జాగ్రత్తగా జీవనాన్ని కొనసాగించాలని చింతగట్టు మహర్షి గోశాల స్థాపకుడు సర్జన రమేష్ గురూజీ అన్నారు. శుక్రవారం హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలో రికార్డ్ మిల్లెట్ హబ్ చిరుధాన్యాల ఉత్పత్తి, విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిరుధాన్యాలు ఆరోగ్యానికి వర ధాన్యాలని, ప్రతీ ఒక్కరూ వీటిని తమ ఆహారంలో భాగంగా చేసుకుంటే వ్యాధులు దరి చేరవని తెలిపారు. మిల్లెట్ కుకింగ్ ఎక్స్‌పర్ట్ కుసుమ కవిత మిల్లెట్ కల్టివేటర్ కుసుమ సురేష్ దంపతులు మాట్లాడుతూ.. పది మందికి మంచి ఆహారాన్ని అందించాలన్న తపనతో కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. చిన్న పిల్లల్లో అవగాహన కల్పించడానికి, చిరుధాన్యాలతో చిన్నారులకు చిరుతిళ్ల కార్యక్రమాన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిల్లెట్ ప్రమోదర్ నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ విక్రయశాలలో సుమారు 150 రకాల చిరుధాన్యాల ఉత్పత్తులు లభ్యమవుతాయని తెలిపారు. ఎక్సైజ్‌కాలనీ అసోసియేషన్ బాధ్యులతో పాటు హర్షిత, శ్రీవత్సవ్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- జాతీయ సమ్మెను విజయవంతం చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న నిర్వహించతలపెట్టిన జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశంలో వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుంటే.. తెలంగాణలో లేబర్ కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వం అనధికారికంగా అమలు చేస్తోందని మండిపడ్డారు. 8గంటల పనికి బదులు 12గంటలు చేయడమేకాక, తక్కువ వేతనాలతో ఈఎస్ఐ, పీఎఫ్ లేకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. పోలీసుల నిర్బంధంతో అణచివేయాలని చూస్తోందని వెంకటేష్ అన్నారు.

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న సామాజిక న్యాయ వారోత్సవాలను ప్రతీ ఒక్కరు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా మే1న ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని వాడవాడలా పండు గలాగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, మెట్టు రవి, పెండ్యాల రవి, ఎన్. రజిత, శ్వేత, శ్రీవాణి, జమున, సమ్మక్క, కళావతి, యాస బాబు, మహేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

పంచాయతీ నిధులను కాజేసిన కార్యదర్శి

గూడెప్పాడ్ గ్రామ పంచాయతీలో మాయాజాలం

ఆత్మకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నిధులు, పన్నుల ద్వారా వచ్చే డబ్బులను గ్రామ పంచాయతీ అభివృద్ధికి కేటాయించి, ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించాల్సిన పంచాయతీ కార్యదర్శి.. నిధులను తన సొంతానికి వాడుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. శుక్రవారం గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్ ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు ఇంటి పన్నులు, నల్లా పన్నులు వసూలు చేసిన డబ్బులను 18 జూలై 2024న రూ.31,865, 48,494 రెండు విడతలుగా గ్రామపంచాయతీ సిబ్బంది అకౌంట్స్‌లో జమ చేయించుకున్నారని గ్రామస్థులు అరోపిస్తున్నారు. వాటిని 24 జూలై 2024న తనకు ఫోన్ పే రూ.80,359 చేయించుకున్నారు. ఇంటి, నల్లా పన్నులు వసూలు చేసిన నిధులను బినామీ బిల్లులతో స్వాహాచేస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారుల అండదండలతో కొన్నేళ్ల నుంచి జరుగుతున్న ఈ అవినీతి బాగోతంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తే అవినీతి గుట్టురట్టు అవుతుందని గూడెప్పాడ్ గ్రామస్థులు అంటు న్నారు. కాగా, గూడెప్పాడ్ జీపీ నిధులు దుర్వినియోగం కాలేదని, వాటిని పరిశీలిస్తున్నామని ఆత్మకూ రు ఎంపీవో విమల వెల్లడించారు. జీపీ నిధులు దుర్వినియోగం చేస్తే సహించేదిలేదన్నారు. ఈ విషయంపై ఆరా తీస్తామన్నారు. అయితే గ్రామపంచాయతీ డబ్బులను ఫోన్‌పే చేయించుకున్న పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్‌పై కలెక్టరు వెంటనే విచారణ చేయాలని మాజీ ఎంపీటీసీ బీరం రజనీకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

బావిలో నుంచి పిల్లిని తీయబోయి..

నీటమునిగి వ్యక్తి మృతి



యాదగిరి (ఫైల్)

నెక్కొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి అవరణలోని వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన పిల్లిని తీయడానికి బావిలోకి దిగిన నెక్కొండకు చెందిన గీతా కార్మికుడు కక్కెర్ల యాదగిరి (59) మృతి చెందాడు. ఈ విషాదకరమైన సంఘటన శుక్రవారం నెక్కొండలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరి చిన్న కూతురు రమ్య అద్దెకు ఉంటున్న ఇంటి అవరణలోని తాగునీటి బావిలో రెండు రోజుల కిందట పిల్లి పడి మరణించింది. బావినుంచి దుర్వాసన వస్తుండడంతో ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో యాదగిరి ఇంటి సమీపంలోని వ్యక్తిని బావి ఒడ్డున ఉండమని, పిల్లిని తీయడానికి బావిలోకి తాడు సహాయంతో దిగాడు. ఈ క్రమంలో తాడు తెడగడంతో బావిలో పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలై యాదగిరి నీట మునిగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. బావిలో నీరు ఎక్కువగా ఉం డడంతో శవాన్ని తీయడం స్థానికులకు సాధ్యపడక పోవడంతో నర్సంపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి బయటకు తీశారు. మృతుడి భార్య నీలమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టాని కి తరలించారు. యాదగిరికి వివాహమైన ముగ్గురు కుమార్తెలు హేమలత, సుకన్య, రమ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



అవుల మల్లేష్ మృతదేహం

మడికొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మడికొండ ఎస్సై పెగడ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్‌కు చెందిన అవుల మల్లేష్ (30) రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని మంగళ సీడ్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇండస్ట్రియల్ నుంచి బైక్‌పై ఓఆర్ఆర్ మీదుగా ఇంటి (ధర్మసాగర్)కి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో ఎలుకుర్తి క్రాస్‌రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో మల్లేష్ తల, మెడ, కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తెల్లవారుజామున 3 గంటలకు మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పంచనామా చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7400	5300
మక్కలు	2181	1521
కందులు	6852	3022
పెసళ్లు	7450	3022
పల్లికాయ (సూక)	6100	5200
పల్లికాయ (పచ్చిది)	4000	4575
పసుపు (కాడి)	13399	10534
పసుపు (గోల)	13169	9700
తేజ మిర్చి	12900	9500
వండర్ హాట్	14000	10000
యూఎస్ 341	11200	9000
దీపిక	13000	10000
దేశీ	26500	18000
సింగిల్‌పట్టి	23000	18500
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించాలి

కేంద్ర మంత్రికి ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి

హనుమకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించాలని, ఇందులో అవసరమైన డాక్టర్లను, వైద్య సిబ్బందిని నియమించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి రోలిసింగ్‌ను కోరారు. శుక్రవారం ఢిల్లీలో ఆమెను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందచేశారు. ఇటీవల వరంగల్‌కు సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ మంజూరైనప్పటికీ వైద్య అధికారులు, పారామెడికల్ సిబ్బంది నియామకం చేపట్టకపోవడంతో అది ప్రారంభం కాలేదని తెలిపారు. సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను త్వరగా ప్రారంభించేందుకు వైద్య సిబ్బంది నియామకాన్ని చేపట్టాలని ఎంపీ కావ్య కోరారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో సుమారు 12వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు, ఉద్యోగ విరమణ పొందినవారు ఉన్నారని, సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వృద్ధ పెన్షనర్లకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు, రోజువారీ వైద్యసహాయం వారికి అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం వరంగల్‌లో సీజీహెచ్ఎస్ కేంద్రం లేకపోవడంతో సుమారు 350 కిలోమీటర్లకుపైగా ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి రోలిసింగ్ సానుకూలంగా స్పందించినట్టు డాక్టర్ కావ్య తెలిపారు.



రోలిసింగ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ కడియం కావ్య

ఎక్సైజ్ శాఖపై ఉన్నతాధికారుల ఆరా..!

ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ నిఘా

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ వసూళ్ల పర్వమంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై ఉన్నతాధికారులు ఆరా తీసినట్లుగా తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరిండెంట్ డి.అరుణ్ కుమార్ స్వయంగా వర్ధన్నపేట ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేసి వివరణ ఇవ్వాలని మౌఖికంగా ఆదేశించినట్లు సమాచారం. బెల్టు షాపుల నుంచి వసూళ్లు, వాహనాల వేలంలో అవినీతి, అక్రమాలు చేస్తున్న విషయంపై పూర్తి వివరాలు కావాలని కోరగా, నివేదిక అందిస్తామని చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఎక్సైజ్ అధికారుల మామూళ్లపై ఎస్‌బీ(స్పెషల్ బ్రాంచ్), ఇంటెలిజెన్స్ అధికారుల సైతం నిఘా పెంచారు. గ్రామాల వారీగా వసూళ్ల చేసిన బెల్టు షాపుల నిర్వా హకుల పేర్లను తెలుసుకుని ఉన్నతాధికారులు నివేదించనున్నట్లు తెలుస్తోంది.

డిగ్రీ పరీక్ష ఫీజుల చెల్లింపు గడువు 11

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేయూ డిగ్రీ కోర్సుల 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల పరీక్షల ఫీజులను ఏప్రిల్ 11 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవచ్చని కేయూ పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ పి.వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజులు చెల్లించిన అభ్యర్థులకు పరీక్షలు ఏప్రిల్, మేలో నిర్వహిస్తామని వెల్లడిలంచారు. ఇతర వివరాలకు సంబంధిత కళాశాలలో సంప్రదించాలని వెల్లడించారు.

టీజీఆర్జేసీకి దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కోఆర్డి నేటర్ కె.ఇందుమతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మార్చిలో టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ నెల 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. http://tgrjc.cgg. gov.in వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసు కోవచ్చునని పూర్తి వివరాలకు సమాచార బులెటిన్‌ను చూడాలని ఆమె కోరారు.

అధ్యాపకుల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాలలో రాజనీతిశాస్త్రం, సోషియాలజీ, లా సబ్జెక్టులు బోధించేందుకు పేపర్‌వైజ్ రెమ్యూనరేషన్‌తో పనిచేసేందుకు అర్హత, ఆసక్తి కల్గిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిమ్మ సుదర్శన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషియాలజీ-1, రాజనీతిశాస్త్రంలో 1, న్యాయశాస్త్రంలో 6 ఖాళీలున్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ డిగ్రీతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి అవకాశం ఉంటుందని తెలిపారు. పేపర్‌వైజ్‌గా రూ.20వేలు జీతం చెల్లిస్తామని పేర్కొన్నారు. అర్హత, అసక్తి కల్గిన వారు ఏప్రిల్ 8వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తులను అందచేయాలని పేర్కొన్నారు. అలాగే మెయిల్‌లోనూ దరఖాస్తులు పంపుకోవాలని కోరారు. అధ్యాపకుల నియామకాలు పేపర్‌వైజ్‌గా తాత్కాలికమేనని స్పష్టం చేశారు.

రాయపర్తిలో ఎస్బీఐకి తాళం

చోరీకి గురైన బంగారం ఇవ్వకపోవడంతో బాధితుల ఆగ్రహం



బ్యాంకుకు తాళం వేసి ఆందోళన చేస్తున్న బాధితులు

రాయపర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకుకు తాళం వేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. రాయపర్తి ఎస్‌బీఐలో కిందటేడు నవంబరు 18న జరిగిన దొంగతనంలో బ్యాంకులోని బంగారాన్ని చోరీ చేశారు. చోరీ జరిగి 6నెలల గడుస్తున్నప్పటికీ బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బంగారం తాకట్టు పెట్టిన బాధితులకు స్పష్టమైన సమాధానం చెప్పకుండా అధికారులు కాలం వెల్లదీస్తున్నారని ఆరోపిస్తూ తాళం వేశారు. మార్చి 5న చెల్లిస్తామని చెప్పారని, వస్తే మళ్లీ వాయిదా వేశారని తెలిపారు. మళ్లీ ఈ నెల 4 తేదీన ఇస్తామని రీజనల్ మేనేజర్ నచ్చచెప్పి పంపించారని, శుక్రవారం వస్తే 7 తేదీన రమ్మని చెప్పడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తమకు న్యాయం చేసే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చి చెప్పారు.

టీటీసీ వేసవి శిక్షణ


17 నుంచి ప్రవేశాలు ▸ మే 1 నుంచి శిక్షణ ప్రారంభం

హనుమకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్, నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్‌తో జాటు హనుమకొండ జిల్లాలో మే 1 నుంచి జూన్ 11వ తేదీ వరకు 42 రోజుల పాటు టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ వేసవి శిక్షణ కోర్సును నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ పొందేగోరే అభ్యర్థుల వయసు 2025 ఏప్రిల్ 17వ తేదీ నాటికి 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలి. సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ పాస్ అయి ఉండాలి. లేదా ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయం లేదా స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రేనింగ్ (ఎస్‌టీటీఈటీ) హైదరాబాద్, లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ వీవింగ్ వంటి జాతీయ విద్యా సంస్థలు లేదా స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎస్‌బీటీఈటీ) లేదా ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగం జారీ చేసిన సంబంధిత లోయర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) సర్టిఫికెట్‌తో పాటు తత్సమానమైన పరీక్ష ఉత్తీర్ణత పొంది ఉండి ఉండాలి. లేదా తెలుగు విశ్వవిద్యాలయం జారీ చేసిన మ్యూజిక్ (గాత్రం) సర్టిఫికెట్లు లేదా తత్సమాన సర్టిఫిట్లు కలిగి ఉండాలి. తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు ప్రవేశ దరఖాస్తు ఫారాన్ని అధికారిక వెబ్‌సైట్ అయిన www.bse.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. దరఖాస్తుల దాఖలుకు, మరిన్ని వివరాలకు ఈనెల 17 నుంచి జిల్లా విద్యాశాఖాధికారిని సంప్రదించవచ్చు. అభ్యర్థులు ఇతర రాష్ట్రాలకు చెందినవారు లేదా ఇతర రాష్ట్రాల బోర్డులు, ఇన్‌స్టిట్యూట్లు జారీ చేసిన టెక్నికల్ సర్టిఫికెట్లు కలిగి ఉన్నవారు ముందుగానే ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ అనుమతి పొందాలి. సంబంధిత తహసీల్దార్ జారీచేసిన నివాస ధ్రువీకరణ పత్రాన్ని ప్రవేశ దరఖాస్తుకు జత చేస్తూ దాఖలు చేయాలి. ప్రవేశాలు ఈనెల 17 నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయి. శిక్షణ మే 1 నుంచి ప్రారంభమవుతుందని డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.


ఓపీలో తెల్ల కాగితాలు కరువు

ఎంజీఎం ఆస్పత్రిలో రోగుల అవస్థలు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎంలో సేవలు దినదినం క్షీణించిపోతున్నాయి. వైద్యం మాట దేవుడెరుగు.. కనీసం ఓపీ చిట్టీలు ఇచ్చేందుకు తెల్ల కాగితాలు లేవని రోగులు వాపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కౌంటర్‌లోని సిబ్బంది బదులు ఇస్తున్నారు. ఫలితంగా చేతితో రాసి ఇవ్వడం వల్ల గంటలకొద్దీ రోగులు వరుసలో నిలబడాల్సి వస్తోంది. అదేవిధంగా అవుట్ పేషంట్ అడ్మిట్ కార్డు కౌంటర్‌లో ప్రింటర్లు పని చేయడం లేదు. ఎంజీఎంలోని అన్ని విభాగాల్లో ప్రింటర్ల పరిస్థితి ఇదే విధంగా ఉందని తెలుస్తోంది. ఆరోగ్యశ్రీ ఎన్‌రోల్‌మెంట్ కోసం కూడా రోగులు గంటలకొద్దీ నిల్చోబెడుతున్నారు. కేవలం ప్రింటర్లు పని చేయకపోవడంవల్ల ఈ దుస్థితి ఏర్పడుతోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎం ఆస్పత్రిపై ఎన్ని కథనాలు వచ్చినా ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ రోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



చిట్టీలు రాస్తున్న దృశ్యం



పని చేయని ప్రింటర్

లెక్కలు అడిగినందుకు కుల బహిష్కరణ

- కమలాపూర్ మత్స్య సహకార సంఘం బాధితులు
- ఎవరినీ బహిష్కరించలేదని కొత్త అధ్యక్షుడి ప్రకటన

కమలాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కమలాపూర్ మత్స్యపారిశ్రామిక సహకార సంఘానికి సంబంధించిన లెక్కలను చూపమని అడిగినందుకు తమను కులబహిష్కరణ చేశారని బండి రాజు, బండి రాజు(మొగిళి) గురువారం సాయంత్రం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను తెలుపుతూ బాధితులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తమ మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి సంబంధించి గత అధ్యక్షుడు సొసైటీ సొమ్ము నుంచి రూ.16.40లక్షలను సొంతానికి వాడుకున్నాడని ఆరోపించారు. దాంతో తాము 2022-23 వార్షిక లెక్కలను చెప్పాలని ప్రశ్నించామన్నారు. 2024లో తాము ప్రశ్నించగా.. అప్పట్లోనే తమ గెల (బండి)కు సంబంధించిన 24 మంది సభ్యులను బహిష్కరించారని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక ఆ సొసైటీకి ఈ ఏడాదికి సంబంధించి ఇటీవల మౌటం మురళీకృష్ణను కొత్త అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అయితే కులబహిష్కరణ వివాదం గురించి స్పందించిన కొత్త అధ్యక్షుడు మౌటం మురళీకృష్ణ.. కమలాపూర్ మత్స్యపారిశ్రామిక సహకార సంఘంలో 1000 మంది సభ్యులున్నారని, అందులో ఎవరినీ కులబహిష్కరణ చేయలేదని స్పష్టం చేస్తూ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

కుల బహిష్కరణపై నివేదిక ఇవ్వండి

హనుమకొండ కలెక్టర్‌కు బీసీ కమిషన్ ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కమలాపూర్ మత్స్య సొసైటీలో జరిగిన కుల బహిష్కరణ సంఘటనపై తెలంగాణ బీసీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఆ మత్స్య సహకా ర సంఘంలో జరిగిన అవకతవకలు, 24 మందిని కుల బహిష్కరణ చేయడం లాంటి సంఘటనలపై పది రోజుల్లో నివేదిక సమర్పించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్యను బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ఆదేశించారు. సదరు సంఘంలో జరిగిన అవకతవకల్లో నిజానిజాలు నిగ్గు తేల్చాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు.

మహిమాన్వితుడు పంచముఖ ఆంజనేయుడు



కోనాయిమాకుల సమీపంలోని పంచముఖ ఆంజనేయ క్షేత్రం



ఆలయంలో కొలువైన పంచముఖ అభయాంజనేయస్వామి

గీసుగొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : తొమ్మిదడుగుల ఎత్తు, ఐదు ముఖాలు, పది చేతులతో.. మహిమాన్వితుడిగా భక్తకోటికి అభయమిస్తున్నాడు గీసుగొండ మండలం కోనాయిమాకుల సమీపంలో వరంగల్- నర్సంపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి. భక్తులకు కొంగు బంగారమై విరాజిల్లుతున్న ఈ ఆలయంలోని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తే సర్వదోషాలు తొలగుతాయని భక్తుల నమ్మకం. నల్లరాతి ఏకశిలతో చేసిన ఈ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని 2002లో ప్రతిష్ఠించారు. హుస్సేన్‌సాగర్‌లో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని మలిచిన ప్రముఖ శిల్పి గణపతి స్థపతి ఏడాది పాటు తన శిష్య బృందంతో శ్రమించి విగ్రహాన్ని తయారు చేశారు. ఈ ఆలయాన్ని మూడు సంవత్సరాల పాటు సీతా లక్ష్మణ్‌సా పర్యవేక్షణలో నిర్మించారు. ఇక్కడి స్వామి వారికి హయగ్రీవ, వరాహ, లక్ష్మీనరసింహ, గరుత్మంత, కపిల ముఖాలు ఉండి దైవత్వం ఉట్టిపడేలా ఉంటుంది. పంచముఖ స్వామికి పది చేతులు ఉండగా ఎడమ వైపు ఉండే ఐదు చేతుల్లో సంజీవని పర్వతం, డాలు, కపాలదండం, ముష్టితాముద్రావృక్షం, రామాయణ పుస్తకాలు ఉండగా కుడి వైపు ఉండే ఐదు చేతుల్లో సర్పం, ఖడ్గం, గద, నాగలి, మరచెంబు ఆయుధాలు ఉండి దేదీప్యమానమై వెలుగొందుతూ అభయాలిచ్చే అభయాంజనేయుడిగా భక్తుల నుంచి మంగళహారతులు అందుకుంటున్నాడు. మహిరావణుని సంహరించేందుకు ఆంజనేయస్వామి పంచముఖ అవతారం ఎత్తినట్లు పురాణ కథల్లో ప్రచారంలో ఉంది. స్వామివారి పంచముఖాలు పంచ భూతాలకు ప్రతీకలని వేద పండితులు చెపుతారు. ఈ హనుమాన్ క్షేత్రం దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్ద పంచముఖ విగ్రహంగా పేరుగాంచింది. మొదటి పెద్ద పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం తమిళనాడులోని సేలంలో ఉంది. అయితే ఇక్కడి సువిశాల స్థలంలో ఉన్న ఈ ఆలయం భక్తులకు మానసికోల్లాసాన్ని, ఆధ్యాత్మిక భావాన్ని కలిగిస్తుండగా.. ఇక్కడ సీతారామలక్ష్మణ ఆలయం కూడా ఉండటంతో సీతారామాంజనేయ దైవ క్షేత్రంగా విరాజిల్లుతోంది. వరంగల్ మహానగరానికి 8కి.మీల దూరంలో ఉన్న ఈ ఆలయానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ ఆలయాన్ని ధర్మపురి మఠాధిపతి సచ్చిదానంద సరస్వతిస్వామి, హనుమాన్ ఉపాసకురాలు జయశ్రీమాత, సుందర చైతన్యానందస్వామి తదితర ప్రముఖ పీఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు సందర్శించారు. ప్రతీ సంవత్సరం హనుమాన్ దీక్షల కోసం వేలాది మంది భక్తులు తరలివచ్చి మాలధారణలు ధరించి మళ్లీ ఇక్కడే మాల విరమణలు చేస్తారు. దీంతో ఆలయం హనుమాన్ భక్తులతో కిక్కిరిసి పోతుంది. ఇదే క్రమంలో ఈ ఏడాది కూడా హనుమాన్‌దీక్షలు ప్రారంభయ్యాయి. ఈ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేయటం వల్ల నవగ్రహ దోషాలు దూరమవుతాయని, ఆకాంక్షలు నెరవేరుతాయని, హనుమాన్ దీక్షలు చేపట్టే భక్తులకు శని దోషాలు తొలగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి అయ్యప్ప శర్మ తెలిపారు. ప్రతీ శనివారం ఆంజనేయ స్వామిని దర్శించుకొని, సుందరకాండమును పఠిస్తే ఇంకా మంచిదంటున్నారు. ఇక ఆలయ కమిటీ చైర్మన్ సీతా ఆనంద్‌సా మాట్లాడుతూ హనుమాన్ మాలధారులు, స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పేర్లు నమోదు చేసుకున్న భక్తులకు వారి గోత్రనామాలతో అర్చనలు చేయిస్తామన్నారు.



సీతారామలక్ష్మణులు

తొమ్మిదడుగుల ఎత్తు, ఐదు ముఖాలు, పది చేతులతో భక్తులకు అభయం
దక్షిణాదిలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న హనుమాన్ క్షేత్రం
భక్తులు, మాలధారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

హనుమాన్ దీక్షలు ప్రారంభం

ఇప్పటికే హనుమాన్ దీక్షలు ప్రారంభమయ్యాయని ఆనంద్‌సా సోదరులు తెలిపారు. ఈ నెల 12 వరకు 41 రోజులు మండల దీక్షలు, 28 నుంచి మే 2 వరకు 21 రోజుల అర్ధమండల దీక్షలు, మే 8 నుంచి 12 వరకు 11 రోజుల దీక్షలు వేసుకోవచ్చని వారు తెలిపారు. మే 17న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మౌనవ్రతం చేపట్టవచ్చన్నారు.

'ప్రాణదాత' సంతోష్

- 15 ఏళ్లలో 25 సార్లు రక్తదానం
- ఆదర్శంగా నిలుస్తున్న మానుకోట యువకుడు


GOVT ... DESH
MGM HOSPITAL, WARANGAL.
BLOOD BANK
No. 05
BLOOD DONATION CERTIFICATE
This is to certify that
Mr./Ms. A. Santosh
S/o Venkanna
donated voluntarily one unit of blood
on 09-08-10 at ... Engineering College
you have given a precious gift of your blood to an unknown individual.
I Sincerely thank you for your noble and humanitarian gesture.

సంతోష్ బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్ (ఫైల్)

మహబూబాబాద్‌టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని అంటారు. ఈ క్రమంలో చాలామంది రక్తదానం చేయడానికి ముందుకొస్తుంటారు. కొందరు ఏడాదికోసారి మాత్రమే ఇచ్చేందుకు ఆసక్తి చూపుతారు. ఇక ఇంకా భయపడే వారూ ఉన్నారు. కానీ మహబూబాబాద్ పట్టణానికి చెందిన అయిలి సంతోష్ మాత్రం రక్తం అవసరమైన రోగి అంటే చాలు వెంటనే అక్కడికి వెళ్లిపోయి రక్తం ఇస్తాడు. ఇలా సంతోష్ ఆరు నెలలకోసారి రక్తదానం చేస్తున్నాడు. ఇప్పటి వరకు 15 సంవత్సరాల్లో 25సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలుస్తున్నాడు. మరో విషయం ఏంటంటే సంతోష్ బ్లడ్ గ్రూప్-ఏబీ నెగిటివ్. ఇది సాధారణంగా దొరికే గ్రూప్ కాదు. ఆ బ్లడ్ గ్రూప్ వారు తక్కువగా ఉంటారు. ఆ గ్రూప్ రక్తం అవసరమైన వరు సకాలంలో ఆ గ్రూప్ రక్తం దొరక్క ఇబ్బందులు పడుతుంటారు. ఈ క్రమంలోనే 2009లో సంతోష్ వరంగల్‌లో బీటెక్ చదువుతున్న సమయంలో ఎంజీఎంలో ఓ నిండు గర్భిణికి డెలివరీ సమయంలో ఏబీ నెగిటివ్ గ్రూప్ రక్తం అవసరం పడింది. కానీ బ్లడ్ బ్యాంకుల్లో కూడా నిల్వలేకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. ఓ స్నేహితుడి ద్వారా సమాచారం తెలుసుకున్న సంతోష్ వెంటనే ఎంజీఎంకు వెళ్లి రక్తదానం చేశాడు. అది అతడు తొలిసారి రక్తదానం చేసిన ఘటన. ఆ తర్వాత సికింద్రాబాద్‌లో ఓ చిన్నారికి గుండె ఆపరేషన్ సమయంలో ఏబీ నెగిటీవ్ గ్రూప్ బ్లడ్ అవసరం కాగా అప్పుడు కూడా రక్తమిచ్చి ఓ చిన్నారికి ప్రాణదాతగా నిలిచాడు. ఇలా ఏబీ నెగిటివ్ రక్తం కోసం ఎంతో మంది ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించిన సంతోష్ అవసరమైనప్పుడే కాకుండా తాను ఆరునెలల కొకసారి రక్తదానం చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. అప్పటి నుంచి ప్రతీ ఆరు నెలల కొకసారి బ్లడ్ బ్యాంకుకు వెళ్లి రక్తదానం చేస్తున్నారు. ఇలా 2009 నుంచి ఇప్పటి వరకు 25 సార్లు రక్తదానం చేశాడు.

త్వరలో బ్లడ్ డోనర్ యాప్ ఏర్పాటు

రాష్ట్ర వ్యాప్తంగా బ్లడ్ డోనేషన్ సేవలందించేందుకు త్వరలో బ్లడ్ డోనర్ యాప్ ఏర్పాటుకు సంతోష్ సన్నాహాలు చేస్తున్నాడు. ప్రత్యేకంగా యాప్‌ను క్రియేట్ చేస్తే అందులో రక్తదానం చేసే వారు తమ పేరు, గ్రామం, సెల్ నెంబరు, బ్లడ్ గ్రూప్ తదితర నమోదు చేయొచ్చని, తద్వారా అత్యవసర సమయాల్లో ఏ గ్రూప్ బ్లడ్ అవసరపడితే ఆ బ్లడ్ గ్రూప్ వారికి సమాచారం అందించి రక్తాన్ని సేకరించే అవకాశం ఉంటుందని చెబుతున్నాడు. అలాగే వారి చిరునామా కూడా అందులో నమోదు చేయడంతో సమీప గ్రామాలు, పట్టణాల్లో ఉన్న వారికి ఫోన్ చేస్తే త్వరగా వచ్చి రక్తదానం చేసే అవకాశం ఉంటుందని, దీంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడుకోవచ్చన్నాడు.



రక్తదానం చేస్తున్న సంతోష్ (ఫైల్)

మైనింగ్.. అక్రమాల్లో రింగ్!

(5వ పేజీ తరువాయి)

అక్రమంగా తరలిస్తు పన్నులు ఎగవే స్తున్నారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారుల సహకారంతో విచ్చలవిడిగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని చోట్ల అనుమతి తీసుకున్నదానికంటే అధికంగా అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలాల్లో మూడు చోట్ల ఇసుక క్వారీల్లో పరిమితిని దాటి తవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం.

మైనింగ్ ఖజానాకు అంతంతే

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మైనింగ్ శాఖ 2024-25 ఆర్థిక సంవత్సరంలో వంద శాతం అదాయాన్ని రాబట్టలేకపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 335 మైనింగ్ క్వారీలకు అనుమతులున్నాయి. వీటి నుంచి రూ.190.02కోట్ల అదాయాన్ని రాబట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే మార్చి 31వ తేదీ వరకు కేవలం రూ.142.43కోట్లే వసూలు చేశారు. అంటే సుమారు 75శాతం వరకు వసూలయ్యాయి. మిగతా 25శాతం అదాయాన్ని రాబట్టడంలో మైనింగ్ అధికారులు చేతులెత్తేశారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా వరంగల్ జిల్లాలో మొత్తం 51 క్వారీలు ఉండగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.22.72కోట్ల అదాయం లక్ష్యంగా పెట్టుకోగా, కేవలం రూ.11.49కోట్లు మాత్రమే వసూలు చేశారు. అంటే కేవలం 50శాతమే లక్ష్యాన్ని చేరుకున్నారు. అలాగే హనుమకొండ జిల్లాలో 128క్వారీలు ఉండగా, వీటిలో 100క్వారీల్లో మాత్రమే తవ్వకాలు జరుగుతున్నాయి. మరో 28 క్వారీలు నాన్ వర్కింగ్ పేరుతో పన్నులు చెల్లించడం లేదని సమాచారం. విగిలిన వాటి నుంచి రూ.61.72కోట్ల అదాయాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, కేవలం రూ.37.08కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇక జనగామ జిల్లాలో 39క్వారీలు ఉండగా, గతేడాది రూ.12.15కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా రూ.6.55కోట్లు మాత్రమే వసూలు చేయటం మైనింగ్‌శాఖ అధికారులు పనితీరుకు నిదర్శనంగా చెబుతున్నారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మైనింగ్ శాఖ అధికారులు ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌ను చేరుకోవడంతో విఫలమయ్యారనే టాక్ వినబడుతుంది.

అధికారుల కనుసన్నల్లోనే అక్రమార్కుల దందా..

మైనింగ్ శాఖలోని కొందరు అధికారుల కనుసన్నుల్లోనే అక్రమ మైనింగ్ సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో చాలా వరకు క్వారీలు వాటికి కేటాయించిన భూమి పరిధిని దాటి అక్రమ మైనింగ్ చేస్తున్నా అధికారులు మౌనంగా సహకరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో చాలా వరకు అనుమతులు లేకుండా క్వారీలను నిర్వహిస్తున్నారు. కొన్ని కంకర క్వారీలు నడుస్తున్నప్పటికి నాన్ వర్కింగ్ బోర్డు పెట్టి పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారు. రాజకీయ నాయకుల అండతో పాటు అధికారుల సహకారంతో అక్రమ మైనింగ్ దందాతో కోట్లాది రుపాయల సొమ్మును కొల్లకోడుతున్నారనే ప్రచారం జరుగుతుంది. మహబూబాబాద్‌లో ఓ మైనింగ్ అధికారికే బినామీ పేర్లతో గ్రానైట్ దందా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తానికి అక్రమ దందా అంతా కొంతమంది అధికారుల కనుసన్నుల్లోనే సాగుతుందనే ప్రచారం జరుగుతుంది. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించి, అక్రమ మైనింగ్‌తో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.

మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- 7 నుంచి 15 వరకు ఫాతిమా హైస్కూల్లో టెన్త్ స్పాట్ క్యాంపు
- కేంద్రానికి చేరుకున్న 2,27,000 జవాబు పత్రాలు
- విధుల్లో పాల్గొననున్న 1,600 మంది టీచర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈ నెల 7 నుంచి 15 వరకు జరగనున్న టెన్త్ స్పాట్ క్యాంపులో ప్రభుత్వ పరీక్షల అదనపు కమిషనర్, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్ బి.భువనేశ్వరి నేతృత్వంలో విద్యాశాఖ సిబ్బంది ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. కాజీపేటలోని ఫాతిమా హైస్కూల్లో నిర్వహిస్తున్న జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించనున్న ఉపాధ్యాయులకు అన్ని వసతులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్పాట్ క్యాంపులో ఈ ఏడాది 2,27 000 జవాబు పత్రాలు మూల్యాంకనం కానున్నాయి. స్పాట్ క్యాంపులో వివిధ హోదాల్లో 1600 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించనున్నారు. గత నెల 25 నుంచి కోడింగ్ సైతం ప్రారంభమైంది. ఈనెల 6తో కోడింగ్ ముగియనుండగా, 7 నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది.

2.27 లక్షల జవాబు పత్రాలు

టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో ఈ ఏడాది 2, 27000 జవాబు పత్రాలు మూల్యాంకనం చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అన్ని సబ్జెక్టుల జవాబు పత్రాలు స్పాట్ క్యాంపునకు చేరుకున్నాయి. కాగా, గత నెల 25 నుంచే జవాబు పత్రాల కోడింగ్ ప్రారంభమైంది. గత నెల 21 నుంచి టెన్త్ వార్షిక పరీక్షలు ప్రారంభం కాగా, స్పాట్ కేంద్రానికి జవాబు పత్రాలు రాగా కోడింగ్ ప్రారంభించారు. జవాబు పత్రాల కోడింగ్ ఈ నెల 6తో ముగియనుండటంతో 7 నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది. తొమ్మిది రోజుల పాటు నిర్విరామంగా కొనసాగి 15తో ముగియనుంది.

పాల్గొననున్న 1600 మంది ఉపాధ్యాయులు

ఈ ఏడాది నిర్వహిస్తున్న టెన్త్ స్పాట్ క్యాంపులో వివిధ హోదాల్లో 1600 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించనున్నారు. 951 మంది ఏఈలు, 164 మంది సీఈలు, 450 మంది స్పెషల్ అసిస్టెంట్లు, ఇద్దరు కోడింగ్ అధికారులు, 8 మంది అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లు, 8 మంది అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, 14 మంది ఏసీవోల స్పెషల్ అసిస్టెంట్లు, 10 మంది పార్ట్-3లో విధులు నిర్వర్తించనున్నారు. డీఈవో వాసంతి క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరిస్తుండగా, ఏసీజీఈ బి.భువనేశ్వరి అసిసెంట్ క్యాంప్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించనున్నారు.



టెన్త్ స్పాట్ నిర్వహించే ఫాతిమా హైస్కూల్

సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం : బి. భువనేశ్వరి, ఏసీజీఈ

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రమైన ఫాతిమా హైస్కూల్లో ఏర్పాట్లకు చర్యలు చేపట్టాం. విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తాగు నీటి వసతి, మూల్యాంకనం చేసే గదుల్లో ఫ్యాన్లు ఇతరత్ర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈనెల 7 నుంచి నిరంతరాయంగా తొమ్మిది రోజుల పాటు జరిగే మూల్యాంకనంలో నిర్ధేశిత సమయంలో మూల్యాంకన లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

పరిశ్రమలు స్థాపిస్తే లక్షలాది ఉద్యోగాలు

- నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- పరకాలలో జాబ్‌మేళా సందడి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, వేదికపై ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

పరకాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు స్థాపిస్తూ వాటికి కావాల్సిన పెట్టుబడులు పెడితే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపుతో వెళ్తుంటే అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం పరకాల పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాలులో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. వివిధ కంపెనీల్లో నియమితులైన కొంతమంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రజల కు మేలు చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు యువతను నిర్లక్ష్యం చేసి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేరుస్తోందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల హామీలో భాగంగా నిరుద్యోగ యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు కల్పించడంలో భాగంగా పరకాలలో ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేశారన్నారు. విద్యార్హతలను బట్టి ప్రతీ ఒక్కరికి ఉద్యోగం కల్పించడమే లక్ష్యంగా పెద్ద పెద్ద కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. చిన్న ఉద్యోగం అనేది కాకుండా ఆరు నెలల నుంచి ఏడాది పాటు ఉద్యోగంలో నైపుణ్యం పెంచుకోగలిగితే రాను రాను మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఒక ప్రభుత్వ ఉద్యోగానికి పది మంది పోటీ పడుతున్నారని, రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటు చేస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు ఇవ్వొచ్చని పేర్కొన్నారు. సీఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో నైపుణ్యం పెంపొందించే కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 14 ఏళ్లుగా గ్రూప్ 1 ఉద్యోగాలు వేసింది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో 57వేల ఉద్యోగాలు అందించామని తెలిపారు. రానున్నది డిజిటల్ యుగమని యువత కాలంతోపాటు పరుగులు తీయాలని సూచించారు. కాలేజీలకు అంతర్జాతీయ బ్యాంకులను అనుసంధానం చేస్తూ పదివేల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 5 వేల మందికి ఉద్యో గాలు ఇప్పించడం కోసం 53 కంపెనీలను తీసుకువచ్చామని పేర్కొన్నారు. జాబ్‌మేళా ఆర్నెళ్లకోసారి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ నెల 26న భూపాలపల్లిలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. పరకాలలో ఉద్యోగాలు రాని వారు భూపాలపల్లిలో జరిగే జాబ్‌మేళాలలో పాల్గొనవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, ఆర్డీవో నారాయణ, కమిషనర్ వెంకటేష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు



అకాల న(క)ష్టం

- ములుగు జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం
- వరి, మామిడి రైతులకు అపార నష్టం
- తడిసిన మిర్చి, పొగాకు పంటలు

ములుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నోటికాడి బుక్క నేలపాలైంది.. వారంరోజుల్లో ఇంటికి చేరాల్సిన వడ్లు తడిసిముద్దయ్యాయి.. ఆశలు పెట్టుకున్న మామిడి తోటలు, ఆదుకుంటుందనుకున్న మిర్చి పంట దెబ్బతింది. దీంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. గురువారం సాయంత్రం ములుగు జిల్లాలో అకాల వర్షం కురిసింది. మంగపేట, గోవిందరావుపేట మండలాల్లో వడగండ్లు పడ్డాయి. గోవిందరావుపేట మండలంలోని చంద్రుతండా, అమృతండా, కర్లపల్లి, లక్ష్మీపురం గ్రామాలలో కోతకు వచ్చిన సుమారు 400ఎకరాల వరిపంట నేలవాలింది. వడ్లు రాలిపోయాయి. కల్లాల్లో అరబోసిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. వానకు ఈదురుగాలులు తోడవ్వడంతో వరిపంట పూర్తిగా దెబ్బతిన్నది. వడగండ్ల ధాటికి మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. ఉరుములు, మెరుపుల భయంతో వణికిపోయిన రైతులు శుక్రవారం తెల్లవారి చేలవద్దకు వెళ్లగా నేలవాలి ధ్వంసమైన పంటలను చూసుకొని వలవలా ఏడ్చారు. రెక్కల కష్టం, వేలాది రూపాయల పెట్టుబడి వర్షార్పణం కావడంతో వేదన చెందారు. శుక్రవారం మధ్యాహ్నం కూడా పస్రా పరిసర ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. మంగపేట మండలంలో వరి, మిర్చి పంట దెబ్బతిన్నది. కల్లాల్లో ఆరబోసిన మిరపకాయలు తడిసిపోయాయి. కమలాపురం వద్ద 30ఎకరాలలో పొగాకు పంట తడిసి ముద్దయ్యింది. ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో మిర్చి స్వల్పంగా తడిసింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం గోవిందరావుపేట మండలంలో పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని, నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామన్నారు. జరిగిన నష్టంపై తక్షణమే సర్వే మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రులతో మాట్లాడి తక్షణసాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



గోవిందరావుపేట మండలం కర్లపల్లిలో నేలవాలిన వరి



మంగపేటలో తడిసిన పొగాకును చూపుతున్న రైతు

బాధిత రైతులకు పరిహారం అందిస్తాం

- అధికారులు నష్టం అంచనా నివేదికలు అందజేయాలి
- వర్షానికి ధ్వంసమైన పంటల పరిశీలనలో మంత్రి సీతక్క

గోవిందరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో నష్టపోయిన జిల్లాలోని ప్రతీ రైతుకు నష్టపరిహారం అందజేసి అండగా ఉంటామని, ఇందుకోసం సంబంధిత అధికారులు నష్టం అంచనా నివేదికలను అందజేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క అన్నారు. శుక్రవారం ఆమె అధికారులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి గోవిందరావు మండలం అమృతండా, లక్ష్మీపూర్, కర్లపల్లి, చంద్రుతండా గ్రామాల్లో పర్యటించి అకాల వర్షంతో ధ్వంసమైన పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆకాల వడగండ్ల వానకు చేతికొచ్చిన వరి ధాన్యం రాలిపోయి నీటిపాలైందని, వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఆమె వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఫోన్‌చేసి పంట నష్టాన్ని వివరించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యం చెందొద్దని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, టీపీసీసీ సభ్యుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, కార్మికశాఖ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, మండలపార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



శిక్షణ ముగింపులో మాట్లాడుతున్న ఎస్సీఈఆర్టీ పరిశీలకుడు మతీన్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ నుంచి రాష్ట్ర పరిశీలకులు సయ్యద్ మతీన్ హాజరై శిక్షణ వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సుజన్‌తేజ, డీఎస్‌వో శ్రీనివాస్, రవీందర్, శ్రీనివాస్, శంకరయ్య, కృష్ణారెడ్డి, పరమేశ్వర్, కరుణాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

బత్తిని చంద్రమౌళి గౌడ్
పింగిళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్



ముఖాముఖి

ఆంధ్రజ్యోతి: ఎలాంటి విద్యను మీ కళాశాలలో అందిస్తున్నారు?

ప్రిన్సిపాల్: అనుభవం, అర్హులైన అధ్యాపకులతో విద్యనందిస్తున్నాం. ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుంది.

ఆంధ్రజ్యోతి: కళాశాలలో ఏయే కోర్సులు ఉన్నాయి? ఎంత మంది విద్యార్థులున్నారు?

ప్రిన్సిపాల్: బీఎస్సీలో ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్, న్యూట్రిషన్, బయోటెక్నాలజీతో పాటు డిగ్రీలో అన్ని కోర్సులు, పీజీలోనూ అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 1,485 మంది విద్యార్థులు కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

ప్రిన్సిపాల్: తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైటింగ్, నీటి వసతి, మరుగుదొడ్ల వసతి ఉంది.

ఆంధ్రజ్యోతి: జాబ్ మేళాలు ఏమైనా నిర్వహించారా?

ప్రిన్సిపాల్: ఈ యేడు నాలుగు జాబ్ మేళాలు నిర్వహించాం. జెన్‌ప్యాక్ట్‌లో ఆరుగురు, అంతకుముందు వివిధ కంపెనీలు నిర్వహించిన జాబ్‌మేళాలో కళాశాల నుంచి 116 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు ఎలాంటి భోజనం అందిస్తున్నారు?

ప్రిన్సిపాల్: కళాశాలలో హాస్టల్ వసతి ఉంది. న్యూట్రిషన్ డైట్ ప్రకారం విద్యార్థులకు మెనూ అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పర్యావరణ పరిరక్షణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ప్రిన్సిపాల్: కళాశాలలో మొక్కలను నాటుతూ చెట్లను సంరక్షిస్తున్నాం. ఎప్పటికప్పుడు పరిసరాల పరిశుభ్రతను చేపడుతున్నాం.

- వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి)

హైదరాబాద్ తరహాలో డంపింగ్ యార్డ్ అభివృద్ధి

- మేయర్ గుండు సుధారాణి
- రాంకీ ప్రతినిధులు, కమిషనర్‌తో కలిసి సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో జరుగుతున్న పనుల మాదిరిగానే వరంగల్ నగరంలోని రాంపూర్ డంపింగ్ యార్డును అభివృద్ధి చేయనున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలో వరంగల్ బల్దియా కమిషనర్‌తో పాటు హైదరాబాద్ రాంకీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా రాంకీ ప్రతినిధులు రాంపూర్ డంపింగ్ యార్డులో క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం బల్దియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో గుండు సుధారాణి మాట్లాడారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీలో చెత్తతో అద్భుతాలు సృష్టిస్తున్నారని, చెత్త నుంచి విద్యుత్, గ్యాస్ తయారు చేస్తున్న విధానం చాలా బాగుందని అన్నారు. వరంగల్‌లో కూడా త్వరలో ఈపద్ధతిని అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఇక్కడి అధికారులకు, ప్రజలకు అవగాహన అవసరం అన్నారు. చెత్తను శుద్ధి చేయడం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు.

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వారం రోజుల్లో డీపీఆర్ (డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్టు)లను రాంకీ ప్రతినిధులకు అందించామన్నారు. రానున్న రోజుల్లో వరంగల్ నగరంలో చెత్త నుంచి అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈలో మహేందర్, రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

7న నాగారంలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

హసన్‌పర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నాగారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 7న విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ వేణుగోపాలచారి తెలిపారు. ఈ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, లోవోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరి మొదలైన వాటికి సంబంధించి విద్యుత్ వినియోగదారులు లిఖితపూర్వకంగా తమ ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు. ఈ ఫిర్యాదులు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్వీకరిస్తారని తెలిపారు.

కోటను సందర్శించిన సీపీ



ఖుష్‌మహల్ వద్ద కుటుంబీకులతో సీపీ

ఖిలావరంగల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రాంతం ఖిలావరంగల్‌ను పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ కుటుంబసభ్యులతో కలిసి సందర్శించారు. శుక్రవారం సాయంత్రం మధ్యకోటలోని కీర్తితోరణాలు, శిల్పాల ఆవరణతో పాటు ఖుష్‌మహల్, సింగారపుబావి, ఏక శిలగుట్ట, రాతి, మట్టికోటను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం పర్యాటక ప్రాంతాల చిత్రపటాన్ని అందజేశారు.

ఘనంగా అరూరి రమేష్ జన్మదిన వేడుకలు



మడికొండలో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్

మడికొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మడికొండ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ జన్మదిన వేడుకలను శుక్రవారం బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గద్దం మహేందర్, జిల్లా నాయకులు బొల్లికొండ వినోద్‌కుమార్, కొలిపాక కుమార్‌బాబు, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు బుర్ర రాజన్‌బాబు, సీనియర్ నాయకులు పెట్టెం సాంబయ్య, బీజేవైఎం నాయకులు తక్కళ్ళపల్లి నిఖిల్‌రావు, చట్ల అజయ్, మాచర్ల రంజిత్, గద్దం కిరణ్, బరిగల పినోకర్, వలబోజు నాగార్జున పాల్గొన్నారు.

నేడు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

- హాజరు కానున్న మంత్రులు, అధికారులు

వడ్డెపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఉదయం 9గంటలకు హనుమకొండ గోకుల్‌నగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి ఎ.శ్రీలత తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క), బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు హాజరవుతారని తెలిపారు.

- కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ నేతృత్వంలో ఏప్రిల్ 5న ఉదయం 10 గంటలకు దూరవిద్య కేంద్రం ఆవరణలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామని కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజు శుక్రవారం తెలిపారు.

టీజీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురుకుల విద్యాలయ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని టీజీఆర్‌జేసీ హసన్‌పర్తి ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ కె.ఇందుమతి ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మార్చి 10వ తరగతి పరీక్షకు హాజరైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనేందుకు 2025 ఏప్రిల్ 23 వరకు తుది గడువు ఉందని తెలిపారు. ఇతర వివరాలకు 040-24734899, 98665 59727 నెంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

మూల్యాంకనంలో బోర్డు నిబంధనలు పాటించాలి



మూల్యాంకన కేంద్రంలో సూచనలిస్తున్న బోర్డు పరిశీలకుడు యాదగిరి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనంలో బోర్డు నిబంధనలు పాటిస్తూ మూల్యాంకన విధులు నిర్వర్తించాలని బోర్డు పరిశీలకుడు యాదగిరి సూచించారు. శుక్రవారం వరంగల్ ఎల్బీ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ మూల్యాంకన కేంద్రాన్ని ఆయన సందర్శించి అధ్యాపకులకు పలు సూచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపు ఆఫీసర్ డాక్టర్ జి.శ్రీధర్ సుమన్, ఏసీవోలు కె.మాధవరావు, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

కేయూ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిద్దాం..

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



వర్సిటీలో నెలకొన్న సమస్యలను వింటున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ సమస్యలపై విద్యార్థుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి చర్చించి పరిష్కారిద్దామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చెప్పారు.శుక్రవారం హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్‌లో కేయూ విద్యార్థి జేఏసీ నేతలు, విద్యార్థి సంఘాల నేతలతో నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. విద్యార్థుల సమస్యలను సావధానంగా విన్నారు. వర్సిటీలో నెలకొన్న సమస్యలను విద్యార్థి నేతలు వివరించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లు, పార్టుటైమ్ నియామకాల చేపట్టాలని నాయిని దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పశ్చిమ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ రానుందని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో నెలకొల్పితే ఉద్యోగుల పిల్లలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. వర్సిటీభూములు కబ్జా కాకుండా స్కూల్ నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు, వర్సిటీ సమస్యలపై స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసే ఏర్పాటు చేస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజుగౌడ్, డాక్టర్ గజ్జెల మల్లేశ్, విద్యార్థి జేఏసీ నేతలు డాక్టర్ చల్లా శ్రీనివాస్, డాక్టర్ బండి శ్రీనివాస్, డాక్టర్ సాధు రాజేశ్, డాక్టర్ మంద వీరాస్వామి, డాక్టర్ దేవోజీ నాయక్, కన్నం సునిల్, మట్టెడ కుమార్, కార్తీక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టుటైమ్ నోటిఫికేషన్ ఇప్పిస్తా..

కాకతీయ యూనివర్సిటీలో పార్టుటైమ్ అధ్యాపకులను నియమించేందుకు తనవంతుగా ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారు. పార్టుటైమ్ అధ్యాపకుల ఆశావహులు 8వ తేదీన మంగళవారం హైదరాబాద్‌కు వస్తే నేరుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించి ఫైనాన్స్ క్లియరెన్స్‌తో పార్టుటైమ్ నోటిఫికేషన్ ఇప్పించేలా ప్రయత్నిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ పార్టుటైమ్ ఆశావహులు డాక్టర్ పి.చందర్‌రావు, డాక్టర్ ఎం.మోహన్‌రెడ్డి, ఎమ్డీ పాషా, బండారి సురేశ్, బానోతు వీరన్న, డాక్టర్ వడ్డెపల్లి మధు, డాక్టర్ హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడికి లక్ష తులసీదళ అర్చన



సీతారాములకు తులసీదళ అర్చన

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక వేయి స్తంభాల రుద్రేశ్వరాలయంలో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు, వసంత వనరాత్రి వేడుకలు శుక్రవారం 6వ రోజుకు చేరుకున్నాయి. పాంచరాత్ర ఆగమానుసారం పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీరామ సహస్రనామ అర్చన, స్తోత్ర పారాయణంతో విజయవాడ నుంచి తెప్పించిన లక్ష తులసీ దళాలతో శుక్రవారం మహాలక్ష్మికి ప్రీతికరంగా సీతమ్మవారిపేట నివేదిస్తూ సీతారామచంద్రస్వామికి నేత్రపర్వంగా తులసీదళ అర్చన నిర్వహించారు. స్వామి వారిని కోదండరాముడిగా అలంకరింపజేసి దూప, దీప నైవేద్యాలు సమర్పించి చక్కర పొంగలి నైవేద్యంతో నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో నిత్య సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల సమయంలో మహిళా భక్తులు సీతారామచంద్రస్వామిలను సేవిస్తూ భజనలతోపాటు లక్ష్మీసహస్ర నామ పారాయణం నిర్వహించారు. ఆదివారం కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు సిద్ధమైన శ్రీరాముడి ఎదుర్కోళ్ల ఉత్సవం శనివారం సంప్రదాయంగా నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు.

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

బాలసముద్రం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి కమిటీలు వేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్ నుంచి బయల్దేరిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బస్సు యాత్ర హనుమకొండ పబ్లిక్ గార్డెన్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా నక్కలగుట్టలోని కాళోజీ జంక్షన్ వరకు చేరుకుంది. అనంతరం కాళోజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతీ ఉద్యమకారుడికి 250 చదరపు గజాల ఇంటి స్థలం, జార్ఖండ్ తరహాలో ఉద్యమకారుడికి నెలకు రూ.25వేల చొప్పున పెన్షన్, జీవన భృతి కోసం రూ.10 లక్షల సబ్సిడీతో కూడిన రుణం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి ఓడపల్లి శ్యాంకృష్ణ, హనుమకొండ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి అనుముల రమేష్, జిల్లా నాయకులు బాల్నే శ్రీనివాస్, కొంగరి రాజు, రాజేంద్రప్రసాద్, ఎమ్డీ రఫీ, జమ్ముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

వడ్డెపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మైనారిటీస్ గురుకుల పాఠశాలలోని ఇంగ్లీష్ మీడియంలో 2025-26 విద్యా సంవత్సరానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి దాసరి మురళీధర్‌రెడ్డి తెలిపారు. 5, 6, 7, 8 తరగతులలో మైనారిటీ బ్యాక్‌లాగ్ ఖాళీలతోపాటు ఇంటర్మీడియట్ కళాశాలలో చేరగోరే విద్యార్థులు ఈనెల 30లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు హనుమకొండ సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

హిందూ సేవా సమితి విజయ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హిందూ సేవా సమితి సభ్యులు

కాజీపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమిని పురస్కరించుకుని హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయయాత్ర నిర్వహిస్తున్నట్లు హిందూ సేవా సమితి అధ్యక్షుడు నాగపురి వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కాజీపేట మీడియా పాయింట్‌లో విజయయాత్ర పోస్టర్ ఆవిష్కరించి యాత్రవివరాలు తెలిపారు. 12 ఫీట్ల శ్రీరాముడి విగ్రహంతో యాత్ర ఉంటుందని ఈ యాత్ర ఈ నెల 6న సాయంత్రం 4 గంటలకు కడిపికొండ బ్రిడ్జి నుంచి ప్రారంభమై సుబేదారి హనుమకొండ మీదుగా పోచమ్మమైదాన్ దుర్గేశ్వరాలయంలో పూర్తవుతుందని తెలిపారు. రామభక్తులు, అయ్యప్ప భక్తులు, హనుమాన్ భక్తులు వేలాదిగా తరలి వచ్చి యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో బీజేపీ నాయకుడు నార్లగిరి రామలింగం, కాయిత రాజ్‌కుమార్, రాష్ట్రీయ హిందూ సేన రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ , హిందూ సేనసమితి కార్యకర్తలు వెంకట్ రెడ్డి, గోగికర్ క్రాంతి రాజా యాదవ్, నవీన్, వసంత్, గద్దం భరత్, నిఖిల్ రవి, నవీన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ విధుల్లోకి ఎంజీఎం ఆర్ఎంవో

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి ఇన్‌చార్జి ఆర్ఎంవో-1 డాక్టర్ అంబి శ్రీనివాస్ కాకతీయ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. ఎంజీఎం ఆర్ఎంవో-3గా ఉన్న డాక్టర్ అంబి శ్రీనివాస్‌కు సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా బాధ్యతలు అప్పగించారు. వారం తిరగకముందే శ్రీనివాస్ కేఎంసీలోకి వెళ్లిపోయారు. దీంతో మళ్లీ ఎంజీఎంకు ఆర్ఎంవోల కొరత ఏర్పడింది. ఇప్పటికే గాడితప్పిన పాలనలో ఉన్న ఎంజీఎం ఆస్పత్రికి రెగ్యులర్ అధికారులు లేకపోవడం పెద్ద శాపంగా మారింది.

వైద్య విద్యార్థుల క్రీడలకు ప్రాధాన్యం



ఉపకులపతి డాక్టర్ నందకుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యార్థుల క్రీడలకు ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ కేటాయింపులు చేస్తానని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పీవీ నందకుమార్‌రెడ్డి తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఉపకులపతిని వైద్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ల బృందం ప్రతినిధులు శుక్రవారం కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు సందీప్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మ్యాథ్స్, సైన్స్ క్విజ్



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ పథకం ద్వారా డీఎస్‌వో శ్రీనివాస స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్, సైన్స్ క్విజ్ పోటీలు శుక్రవారం ముగిశాయి. హనుమకొండలోని లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈపోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంవో శ్రీనివాస్ విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ జగన్నాథం, ఉపాధ్యాయులు భాస్కర్, మల్లికార్జున్, రమేష్, రామనాథం, వాసు, సంపతి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాజీపేట పీఎస్ పరిధిలో జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎస్.ఫాతిమా చిన్నప్ప రెండు రోజుల జైలుశిక్ష విధించారు. అనంతరం వారిని పరకాల సబ్‌జైలుకు తరలించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ నాగబాబు తెలిపారు. అలాగే మరో 15 మందికి రూ.23,200 జరిమానా విధించారన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న పాల్సన్ రాజ్

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రెవరెండ్ పాల్సన్ రాజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని క్రీస్తుజ్యోతి హాస్పిటల్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు, స్కానింగ్‌లు, గుండె పరీక్షలు నిర్వహించారు. సుమారు 600 మంది వరకు ప్రజలు పాల్గొని పలు రకాల పరీక్షలు నిర్వహించుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రదీప్, డాక్టర్ సత్యం, న్యూరో వైద్యురాలు దివ్య, వైద్యులు బ్యూల, నవీన్, రఘు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

24న యూటీఎఫ్ పీపీటీ టెస్ట్



పీపీటీ టెస్ట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 24న పీపుల్స్ ప్రోగ్రెస్ టెస్ట్(పీపీటీ) నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండలోని సంఘం కార్యాలయంలో టెస్ట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కంచారు. 5, 6, 7 తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఈ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు 9948782101, 7013925656 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, మల్లిక్, సదానందం, రాజారామ్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 5 ఏప్రిల్ 2025

నోరూరించే పనస రుచులు!



పనస తొనలను ఇష్టంగా తినని వారు ఉండరు. ఇవి వేసవి తాపాన్ని హరిస్తాయి. వడదెబ్బ నుంచి కాపాడతాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందించే పనసతో రుచికరమైన వంటకాలు కూడా చేసుకోవచ్చు. వాటిలో కొన్ని విభిన్న రుచులను మీకోసం అందిస్తున్నాం...

వంటిల్లు

పనసకాయ దమ్ బిర్యానీ

కావాల్సిన పదార్థాలు

• లేత పనసకాయ- అర కేజీ, బాస్మతీ బియ్యం- అర కేజీ, బంగాళ దుంపలు- రెండు, టమాటాలు- నాలుగు, ఉల్లిపాయలు- రెండు, పచ్చి మిర్చి- ఎనిమిది, పెరుగు- రెండు కప్పులు, పసుపు- పావు చెంచా, లవంగాలు- ఆరు, యాలకులు- రెండు, జాపత్రి- ఒక పెద్ద ముక్క, దాల్చిన చెక్క- రెండు చిన్న ముక్కలు, మరాఠీ మొగ్గ- ఒకటి, అనాస పువ్వు- ఒకటి, బిర్యానీ ఆకులు- రెండు, రాతిపువ్వు- కొద్దిగా, షాజీరా- కొద్దిగా, అల్లం వెల్లుల్లి పేస్టు- రెండున్నర చెంచాలు, నూనె- అయిదు చెంచాలు, నెయ్యి- అయిదు చెంచాలు, ఉప్పు- రెండున్నర చెంచాలు, ధనియాల పొడి- ఒక చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, గరం మసాలా పొడి- ఒక చెంచా, కుంకుమ పువ్వు- అర చెంచా, పుదీనా- రెండు రెమ్మలు, కొత్తిమీర- ఒక కట్ట, కారం- మూడు చెంచాలు, నిమ్మకాయ- సగం చెక్క, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

• బాస్మతీ బియ్యాన్ని కడిగి నీళ్లు పోసి నానబెట్టాలి. ఆలుగడ్డలను పెద్ద ముక్కలుగా కోయాలి. టమాటాలను సన్నగా తరగాలి. ఉల్లిపాయలు, పచ్చి మిర్చిలను చీలికల మాదిరి కోయాలి. కొత్తిమీరను కూడా శుభ్రంగా కడిగి సన్నగా తరగాలి. కుంకుమపువ్వును రెండు చెంచాల పాలలో నానబెట్టాలి. ముప్పావు వంతు ఉల్లిపాయ చీలికలను నూనెలో ఎర్రగా వేపి ఉంచుకోవాలి.

• చేతులకు ఆముదం లేదా కొబ్బరినూనె రాసుకోవాలి. చాకుతో పనసకాయ తొక్కు తీయాలి. కాయను నీళ్లతో



కడిగి పెద్ద ముక్కలుగా కోసి గింజలు తీయాలి.

• వెడల్పాటి గిన్నెలో పనసకాయ ముక్కలు, ఆలుగడ్డ ముక్కలు, టమాటా ముక్కలు, పచ్చి మిర్చి చీలికలు, ఉల్లిపాయ చీలికలు కొన్ని, పెరుగు, రెండు చెంచాల అల్లం వెల్లుల్లి పేస్టు, పసుపు, ఒకటిన్నర చెంచా ఉప్పు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా పొడి, పుదీనా ఆకులు, కారం, నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని దగ్గరకు ఒత్తిపెట్టి రెండు గంటలు నాననివ్వాలి.

• స్టవ్ మీద పెద్ద గిన్నె పెట్టి నిండుగా నీళ్లు పోసి లవంగాలు, యాలకులు, జాపత్రి, దాల్చిన చెక్క, అనాస పువ్వు, మరాఠీ మొగ్గ, బిర్యానీ ఆకులు, రాతి పువ్వు, షాజీరా, అర చెంచా అల్లం వెల్లుల్లి పేస్టు, ఒక చెంచా నూనె, ఒక చెంచా నెయ్యి, ఒక చెంచా ఉప్పు వేసి బాగా మరగనివ్వాలి. అరగంట తరవాత ఇందులో నానబెట్టిన బాస్మతీ బియ్యం వేసి మెల్లగా కలపాలి. పెద్ద మంట మీద ఉడకనివ్వాలి.

• మరో స్టవ్ మీద మందపాటి పెద్ద గిన్నె పెట్టి అందులో నాలుగు చెంచాల నూనె, నాలుగు చెంచాల నెయ్యి వేసి అవి వేడెక్కాక నానబెట్టిన పనసకాయ ముక్కల మిశ్రమం వేసి బాగా కలిపి మూత పెట్టి చిన్న మంట మీద మూడు నిమషాలు మగ్గనివ్వాలి. తరవాత మూత తీసి ఈ మిశ్రమం మీద సగానికి పైగా ఉడికిన బాస్మతీ బియ్యాన్ని స్టయినర్ సహాయంతో తీసుకుని ఒక పొరలా పరచాలి. దీని మీద వేయించిన ఉల్లిపాయ చీలికలు, కొత్తిమీర తరుగు చల్లి మూత పెట్టి మూడు నిమిషాలు మగ్గించాలి. తరవాత మూత తీసి ముప్పావు వంతు ఉడికిన బాస్మతీ బియ్యాన్ని పొరలా పరచాలి. దీని మీద కూడా వేయించిన ఉల్లిపాయ చీలికలు వేసి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత పూర్తిగా ఉడికిన బాస్మతీ అన్నాన్ని పైన పొరలా వేసి మరుగుతున్న నీళ్ల మూడు గంటెలు పోయాలి. దీనిపైన మరికొన్ని వేయించిన ఉల్లిపాయ చీలికలు, కొత్తిమీర తరుగు చల్లి వెంటనే కుంకుమ పువ్వు నానబెట్టిన పాలు చిలకరించాలి. మూతపెట్టి ఆవిరి బయటికి వెళ్లకుండా నీళ్లలో తడిపిన వస్త్రాన్ని కప్పి ముప్పావు గంటసేపు మగ్గించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి మూత తీసి అక్కడక్కడా చెంచాతో రంధ్రాలు చేసి వాటిలో బిరియానీ నీళ్ల చుక్కలు, గులాబీ నీళ్ల చుక్కలు వేయాలి. అయిదు నిమిషాల తరవాత వేరే గిన్నె లోకి బోర్లించి వేడిగా సర్వ్ చేసుకోవచ్చు.

జాగ్రత్తలు

- **బిర్యానీ వండడానికి మందంగా ఉన్న గిన్నెను మాత్రమే ఉపయోగించాలి. లేదంటే అడుగు భాగం మాడిపోతుంది.**
- **బిర్యానీని ఓ పక్కనుంచి తీస్తూ వడ్డించాలి. అప్పుడే పనసకాయ ముక్కలు, కలర్ రైస్, వైట్ రైస్ పొరలుగా కనిపిస్తాయి.**
- **పనసకాయను కోసిన తరవాత లోపలి భాగం గట్టిగా అనిపిస్తే దాన్ని తీసివేయడం మంచిది.**

పనస తొనల హల్వా



కావాల్సిన పదార్థాలు

• పనస తొనలు- ఒక కప్పు, బెల్లం- పావు కప్పు, నెయ్యి- రెండు చెంచాలు, పచ్చి కోవా- రెండు చెంచాలు, యాలకుల పొడి- చిటికెడు, బాదం- ఎనిమిది, జీడిపప్పు- పది, పిస్తా- పన్నెండు

తయారీ విధానం

• గింజలు తీసేసిన పనస తొనలను మిక్సీలో వేసి మెత్తని పేస్టులా చేయాలి.

• స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో అర కప్పు నీళ్లు పోసి బెల్లం వేసి కరిగించాలి. తరవాత ఈ బెల్లం నీళ్లను ఒక గిన్నెలోకి వడబోయాలి.

• స్టవ్ మీద పాన్ పెట్టి నెయ్యి వేసి వేడిచేయాలి. ఇందులో బాదం, జీడిపప్పు, పిస్తా వేసి దోరగా వేపి ఒక పళ్లెంలోకి తీయాలి. తరవాత పాన్‌లో పనస తొనల పేస్టు వేసి బాగా కలపాలి. పచ్చివాసన పోయేవరకూ వేగనివ్వాలి. తరవాత బెల్లం నీళ్లు పోసి కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమం పాన్ నుంచి విడిపోతున్నప్పుడు పచ్చికోవా, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత వేయించిన బాదం, జీడిపప్పు, పిస్తా వేసి కలిపి దించాలి. ఈ హల్వాని వేడిగా లేదంటే చల్లగా కూడా సర్వ్ చేసుకోవచ్చు.

జాగ్రత్తలు

- **ఈ హల్వాని చిన్న మంట మీదనే తయారు చేసుకోవాలి.**
- **పనస తొనలు తియ్యగానే ఉంటాయి కాబట్టి అంతగా తీపి తినని వాళ్లు ఒక చెంచా బెల్లం తగ్గించి వేసుకోవచ్చు.**
- **ఒక చెంచా కార్న్‌ఫ్లోర్‌ని పావు కప్పు నీళ్లలో కలిపి ఈ మిశ్రమాన్ని పచ్చికోవాకు బదులు వేసుకోవచ్చు.**

పనస చిప్స్



కావాల్సిన పదార్థాలు

• పనస తొనలు- 12, పల్లీలు- అర కప్పు, కరివేపాకు- రెండు రెమ్మలు, పసుపు- చిటికెడు, ఉప్పు- తగినంత, కారం- కొద్దిగా, నూనె- తగినంత

తయారీ విధానం

• పనస తొనల నుంచి గింజలు వేరుచేయాలి. తొనలను సన్నని చీలికల మాదిరి కోసి కొద్దిసేపు ఆరబెట్టాలి.

• స్టవ్ మీద మూకుడు పెట్టి డీప్ ఫ్రైకి కావాల్సినంత నూనె పోసి వేడి చేయాలి. ఇందులో పల్లీలు, కరివేపాకు వేసి దోరగా వేయించి గిన్నెలోకి తీయాలి. తరవాత నూనెలో చిటికెడు పసుపు, ఉప్పు వేయాలి. వెంటనే పనస చీలికలు కూడా వేసి అవి బంగారు రంగులోకి మారి గలగలలాడే వరకు వేయించి ఓ పళ్లెంలోకి తీయాలి. వీటిలో వేయించిన పల్లీలు, కరివేపాకు, ఉప్పు, కారం కలిపి సర్వ్ చేయాలి.

జాగ్రత్తలు

- **పచ్చి పనసకాయ తొనలు తీసుకుంటే చిప్స్ రుచిగా ఉంటాయి.**
- **పల్లీలు, కరివేపాకులను జల్లి మూకుడులో వేసి వేడినూనెలో ముంచితే అవి మాడకుండా వేగుతాయి.**

యవ్వనంగా కనిపించాలంటే...

మేకప్



మేకప్‌తో వయసును కొంతమేరకే కప్పిపుచ్చగలం. అందుకోసం తెలివైన మెలకువలు పాటించాలి. లేదంటే వయసు దాచలేకపోగా, వృద్ధాప్య ఛాయలు స్పష్టంగా బహిర్గతమయ్యే ప్రమాదం ఉంటుంది. మేకప్ మాటున ముడతలను దాచడం కోసం ఇవిగో ఈ చిట్కాలు ప్రయోగించండి. కనురెప్పలు, దవడలు, మెడ.. ఇలా కొన్ని చోట్ల చర్మం సాగిపోయి వృద్ధాప్య ఛాయలు బయల్పడుతూ ఉంటాయి. ఇలాంటప్పుడు...

- **సిలికాన్ ప్రైమర్:** మేకప్‌కు ముందు సిలికాన్ ప్రైమర్ పూసుకోవాలి. దీంతో చర్మం పైని సన్నని గీతలు చర్మంలో కలిసిపోతాయి. టింటెడ్ ప్రైమర్ ఎంచుకుంటే చర్మ రంధ్రాలను కూడా దాచేయవచ్చు. ఇందుకోసం ముఖం, మెడ మీది ముదురు రంగు ప్రదేశాల్లో ప్రైమర్ పూసి, తడి స్పాంజ్‌తో అద్దుకోవాలి. అలాగే కన్‌సీలర్‌ను నేరుగా ఉపయోగించకుండా, అంతకంటే ముందు కలర్ కరెక్టర్‌ను కూడా ఉపయోగించవచ్చు.
- **మాయిశ్చరైజర్:** మెడ మీద ముడతలు ఏర్పడకుండా ఉండాలంటే, తప్పనిసరిగా మెడకూ మాయిశ్చరైజర్ పూసుకుంటూ ఉండాలి. అప్పుడే మెడ మీద గీతలు, మచ్చలు, ముడతలు ఏర్పడకుండా ఉంటాయి.
- **ఫౌండేషన్:** లిక్విడ్ లేదా క్రీమ్ ఎలాంటి ఫౌండేషన్‌ను ఎంచుకున్నా, ముఖం, మెడ మీద సమానంగా పరుచుకునేలా తడిపిన స్పాంజీతో అద్దుకోవాలి. అలాగే, ఫౌండేషన్‌ను పరిమితంగానే పూసుకోవాలి. లేదంటే ముడతల్లో ఇరుక్కుపోయి, వృద్ధాప్య ఛాయలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి.
- **బ్లష్:** చెక్కిళ్ల మీద అద్దుకునే బ్లష్‌ను కొద్ది పరిమాణంలో మెడ మీద అద్దుకోవడం వల్ల, ముఖం, మెడా రెండూ సమంగా కనిపించే అవకాశం ఉంటుంది.
- **విటమిన్ సి సీరమ్:** విటమిన్ సితో కూడిన సీరమ్ లేదా మాయిశ్చరైజర్ ఉపయోగించడం వల్ల అతినీలలోహిత కిరణాల నుంచి మెడ చర్మానికి రక్షణ దక్కుతుంది.
- **హైలైటర్:** మెడ మీద నుంచి ఇతరుల చూపులను పక్కకు తప్పించి, చెక్కిళ్ల మీద నిలపడం కోసం హైలైటర్ అద్దుకోవాలి. అయితే ఇందుకోసం లిక్విడ్ హైలైటర్‌ను ఉపయోగించాలి.
- **పౌడర్:** మెడతో పాటు ముంజేతులకు కూడా ఫౌండేషన్ అద్దుకుని, ముఖం, మెడలతో సరిపోలేలా చూసుకోవాలి. తర్వాత పౌడర్ అద్దుకుని, అదనపు పౌడర్‌ను టిష్యూ పేపర్‌తో తొలగించాలి.

దివ్య ఔషధం... మునగాకు

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

మనం ఆరోగ్యంగా ఉండటం కోసం ప్రకృతి అనేక రకాల ఔషధాలను ఆహార రూపంలో అందించింది. అలాంటి వాటిలో మునగ చెట్టు కూడా ఒకటి. ఈ చెట్టుకు కాసే మునక్కాయలను పులుసు, కూర, సాంబారు వంటి వాటిలో వాడుతూ ఉంటారు. ఈ కాయల కన్నా మునగ ఆకులకు అనేక విశిష్టతలు ఉన్నాయి. మునగాకుల్లో ప్రొటీన్ సమృద్ధిగా లభిస్తుంది. ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఐరన్, పొటాషియం కూడా ఎక్కువే. దీనివల్ల ప్రతి రోజూ మునగాకు తినేవారిలో రోగనిరోధకశక్తి మెండుగా ఉంటుంది. అయితే ముదురు ఆకుల కన్నా లేత ఆకులోనే పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. లేత ఆకులను ఎండబెట్టి పౌడర్‌గా చేసి కూడా వాడుకోవచ్చు. దీనివల్ల పోషక విలువలు తగ్గవు. ఈ ఆకుల గురించి 'భోజన కుతూహలం' గ్రంథంలో సవివరమైన వర్ణన ఉంది. మునగాకు లక్షణాలను గమనిస్తే...

- ఈ ఆకులు వాతాన్ని హరిస్తాయి. ఊపిరితిత్తుల్లో పేరుకుపోయే కఫాన్ని తొలగిస్తాయి. క్రమం తప్పకుండా తింటే కఫం ఏర్పడకుండా నివారిస్తాయి.
- కీళ్ల నొప్పులను, వాపులను తగ్గిస్తుంది. కీళ్లవాతంతో బాధపడేవారికి ఇది చాలా ఉపయోగకరం.
- ఇది జీర్ణశక్తిని పెంపొందించటమే కాకుండా.. కడుపులో ఉన్న నులి పురుగులను చంపుతుంది. విరోచనం సాఫీగా అయ్యేలా చేస్తుంది. కడుపు నొప్పి, అజీర్తి సమస్యలు ఉన్నవారు 15 రోజులు తింటే, ఆ సమస్యలు తొలగిపోతాయి.
- మునగాకులో పురుష బీజకణాలను పెంచే శక్తి ఉంది. లైంగిక పటుత్వాన్ని కూడా మెరుగుపరుస్తుంది. అందుకే మన దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రతి రోజూ మునగాకును వంటల్లో తప్పనిసరిగా వాడతారు.



- మూత్రపిండాల సమస్య ఉన్నవారికి మునగాకు మంచి ఫలితాలు ఇస్తుంది. మూత్రపిండాల పనితీరు మెరుగుపడుతుంది.
- మునగాకుతో చేసే వంటకాలు తింటే శరీరంలోని నీరు లాగేస్తుంది.
- మునగాకును తినటంవల్ల గుండె పనితీరు బాగుపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీనివల్ల గుండె పనితీరు మెరుగుపడటమే కాకుండా స్థూలకాయ నివారణ సులభమవుతుంది.

మునగాకు కేవలం మనకే కాదు... మన పర్యావరణానికి కూడా ఎంతో ఉపకరిస్తుంది. అలాంటి ప్రయోజనాలేమిటో చూద్దాం..

- మునగాకు పొడిని నీటిలో కలిపితే సూక్ష్మజీవులు నశిస్తాయి. నీరు శుభ్రం అవుతుంది.
- మునగాకును సేంద్రియ ఎరువుగా కూడా ఉపయోగించవచ్చు.
- ఈ ఆకులను పశువుల దాణాలో కలిపితే పాల ఉత్పత్తి పెరుగుతుంది. కోళ్ల మేతలో కలిపితే గుడ్ల ఉత్పత్తి పెరిగే అవకాశముంది.
- ఈమధ్యకాలంలో మునగాకుతో ఎనర్జీ డ్రింక్స్ కూడా తయారు చేస్తున్నారు.

• గంగరాజు అరుణాదేవి

మీది నిజమైన ఆకలేనా..?



టీవీలోనో, బయట రెస్టారెంట్‌లోనో... రకరకాల ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. చూడగానే మన ఆలోచనలు తినటం వైపు మళ్లుతాయి. ఇలా చూడగానే పదే పదే ఆహారాన్ని తినాలనిపించటాన్ని మానసిక నిపుణులు 'ఫుడ్ నాయిస్' అంటారు. మన మెదడులో ఆహారానికి సంబంధించిన ఆలోచనలు చేసే రణగొణ ధ్వని ఇది. దీనివల్ల బరువు తగ్గాలనుకున్నవారు తగ్గరు. పెరగాలని లేకపోయినా బరువు పెరుగుతారు. ఈ ఫుడ్ నాయిస్‌ను ఎదుర్కోవటానికి మానసిక నిపుణులు కొన్ని చిట్కాలు సూచిస్తున్నారు.

- కొన్నిసార్లు శరీరంలోని బ్లడ్ షుగర్ విలువలు పెరుగుతూ... పడిపోతూ ఉంటాయి. దీనికి కారణం సమతుల ఆహారం తినకపోవటం. అలాంటి సమయంలో మన మెదడు ఆహారం గురించే ఆలోచిస్తూ ఉంటుంది. అందువల్ల ప్రతి రోజూ ప్రొటీన్, ఫైబర్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తినాలి.
- ఉదయాన్నే ఎక్కువ ప్రొటీన్ ఉన్న అల్పాహారం తినాలి. చీజ్, గుడ్లు, ప్రొటీన్ షేక్‌లు బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకోవటంవల్ల రోజంతా శరీరంలో బ్లడ్ షుగర్ విలువలు తగ్గవు. అందువల్ల ఉదయాన్నే ఈ తరహా బ్రేక్‌ఫాస్ట్ చేయటం మంచిది.
- కొందరు ఆకలి వేసిన వెంటనే చిప్స్ వంటివి తింటారు. దీనివల్ల ఆకలి తగ్గిన భావన కలుగుతుంది. వాస్తవానికి ఇది తాత్కాలికమే. కొద్ది సేపు అయిన వెంటనే మళ్లీ ఆకలి వేస్తుంది. ఆలోచనలన్నీ ఆహారం చుట్టూ తిరుగుతూ ఉంటాయి. అందువల్ల ఆకలి అనిపించినప్పుడు కార్బోహైడ్రేట్స్, కొవ్వు లేదా ప్రొటీన్ ఉన్న ఆహారాన్నే తినాలి. ప్రమాదకరమైన రసాయనాలు కలిపిన ప్రాసెస్డ్ ఫుడ్ తినకూడదు.
- మన పేగుల్లో ఆరోగ్యవంతమైన బ్యాక్టీరియా ఉంటుంది. ఇది ఎక్కువగా లేకపోతే ఆకలి వేస్తున్నట్లు అనిపిస్తుంది. అందువల్ల ఈ బ్యాక్టీరియాను పెంపొందించే పెరుగు వంటివాటిని ఎక్కువగా తీసుకోవాలి.
- మెగ్నీషియం తక్కువ అయితే ఎక్కువగా చక్కెర తినాలనిపిస్తుంది. అందువల్ల మెగ్నీషియం ఎక్కువగా లభించే ఆహారాన్ని తీసుకోవటం మంచిది.

అభిరుచి

నాకు నేనే బాస్

కపూర్‌లు... ఖాన్‌లు... ఖన్నాలు... బాలీవుడ్‌లో వారసుల జోరు ఇవాళ్టిది కాదు. అగ్ర తారల పిల్లలు తల్లిదండ్రులను అనుసరించడం దశాబ్దాలుగా చూస్తున్నాం. కానీ కృష్ణా ష్రాఫ్ సగటు సినీ వారసులకు భిన్నం. నాన్న జాకీ ష్రాఫ్... అన్న టైగర్ ష్రాఫ్... ఇద్దరూ వెండితెర వేల్పులే. అయినా 32 ఏళ్ల కృష్ణా మాత్రం వారిలా నటనలోకి రావాలని అనుకోలేదు. తనకంటూ ఒక అభిరుచి... దాని కోసం శ్రమించి సాధించే పట్టుదల... ఇవే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి.

"అందరు నటుల పిల్లల్లా నేను కూడా నాన్న వేసిన మార్గంలో నడవవచ్చు. కానీ అలా చేస్తే ఇక నాకంటూ చెప్పుకోవడానికి, కొత్తగా సాధించడానికి ఏముంటుంది? మొదటి నుంచీ నాకు సవాళ్లంటే ఇష్టం. వాటిని అధిగమించి అందుకున్న విజయంలో సంతోషం, సంతృప్తి ఉంటాయి. జాకీ ష్రాఫ్ కూతురుగానో, టైగర్ ష్రాఫ్ సోదరిగానో నన్ను గుర్తు పెట్టుకొంటానంటే... అందుకు నేను ఇష్టపడను. నన్ను నన్నుగా గుర్తించాలని కోరుకొంటాను. నటన నా ఒంటికి పడదనుకున్నాను. పారిశ్రామికవేత్తగా ఎదగాలనుకున్నాను. ఆ క్రమంలోనే మా అమ్మ ఆయేషాతో కలిసి 'ఎంఎంఏ మ్యాట్రిక్స్' (మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ స్టూడియో) నెలకొల్పాను. మా కుటుంబానికి చిత్ర పరిశ్రమలో, ప్రజల్లో ఉన్న ఆదరణ నా వ్యాపారానికి బాగా కలిసొచ్చింది. కొత్తగా నా గురించి, నా స్టూడియో గురించి చెప్పుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. అదీకాకుండా... ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకోబోయే వరకు నాకు నచ్చింది నేను చేసుకొనే స్వేచ్ఛ ఇంట్లో నాకు ఉంది. ఇలాంటి స్వేచ్ఛ అందరికీ లభించదు కదా.

అమ్మానాన్నలు గర్వపడేలా...

ఏం చేసినా ఇంట్లోవాళ్లు ఎదురు చెప్పరు. నిజమే... అలాగని వారు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగపరచకుండా సరైన దారిలో నడవాల్సిన బాధ్యత నాపై ఉంటుంది కదా. అందుకే నన్ను చూసి అమ్మానాన్నలు గర్వపడేలా ఎదగాలనుకున్నాను. ఆ ఆలోచనతోనే 'ఎంఎంఏ' ప్రారంభించాను. ఇది మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో పాటు ఫిట్‌నెస్ లక్ష్యాలను అందుకొనేందుకు ఉద్దేశించింది. ఇక్కడ నాకు నేనే బాస్. వేరొకరికి జవాబుదారీ కాదు. స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవచ్చు. దీంతోపాటు పలు రియాలిటీ షోస్‌లో కూడా పాల్గొన్నాను. ఎందుకంటే అక్కడ నిజమైన సవాళ్లు ఎదురవుతాయి. సవాళ్లు, సమస్యలు వచ్చినప్పుడే కదా... మన నైపుణ్యం, మన సామర్థ్యం ఏంటో మనకు తెలిసేది.

అలా చెప్పుకోవడమే ఇష్టం

నేను ఒక డాక్యుమెంటరీ తీశాను.. ట్రాన్స్‌జెండర్స్ స్థితిగతుల మీద. కాలేజీ రోజుల్లో బాస్కెట్‌బాల్ ఆడేదాన్ని. యువ క్రీడాకారులకు కొంతకాలం బాస్కెట్‌బాల్ కోచింగ్ కూడా ఇచ్చాను. ఇక ఫిట్‌నెస్ అనేది నా జీవితంలో ఒక భాగం. ఇన్‌స్టాగ్రామ్‌లో తరచూ నా వర్కవుట్ వీడియోలు పోస్టు చేస్తుంటాను. అదేదో ప్రచారం కోసం కాదు... నన్ను చూసి కొందరైనా స్ఫూర్తి పొంది, వ్యాయామాలను తమ దినచర్యల్లో చేర్చుకోకపోతారా అనే ఆశ. ఫ్యాషన్ ట్రెండ్స్‌ను అనుసరించడమే కాదు... సరికొత్త వస్త్ర శ్రేణులను పరిచయం చేయడంలోనూ ముందుంటాను. ఫిట్‌నెస్‌తో పాటు నా ఫ్యాషన్ ట్రెండ్స్ వీడియోలు కూడా సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తుంటాను. అయితే వీటన్నిటి కంటే నన్ను ఒక పారిశ్రామికవేత్తగానే అందరూ గుర్తుపెట్టుకోవాలన్నది నా కోరిక. అలా చెప్పుకోవడానికే నేను ఇష్టపడతాను. మా కుటుంబ వారసత్వానికి భిన్నంగా... ఒక పారిశ్రామికవేత్తగా నాదైన మార్గాన్ని నేను నిర్మించుకున్నాను. ఫిట్‌నెస్ ప్రపంచంలో నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలనేది నా తాపత్రయం.



వద్దనుకొని వచ్చేశా...

నాన్న, అన్నయ్య హీరోలు. అమ్మ నిర్మాత. సినీ కుటుంబానికి చెందిన అమ్మాయిగా చిన్నప్పటి నుంచీ నా మీద కూడా విపరీతమైన ఒత్తిడి ఉండేది. పరిశ్రమలోని వారు, అభిమానులకు అంతుపట్టని విషయం ఏంటంటే... అసలు నేనెందుకు నటనలోకి రాలేదని! ఇలా అన్ని వైపుల నుంచి ఒత్తిడి, ఆకాంక్షల కారణంగా ఒక దశలో నేను కూడా పరిశ్రమ వైపే వెళ్లక తప్పదని అనుకున్నాను. దాంతో దుబాయ్ వెళ్లి అక్కడి 'ఎస్ఏఈ ఇనిస్టిట్యూట్'లో ఫిలిమ్ ప్రొడక్షన్‌లో డిగ్రీ పూర్తి చేశాను. భారత్‌కు తిరిగి వచ్చాక అన్నయ్య చిత్రాలు రెండు మూడింటికి అసిస్టెంట్‌గా పని చేశాను. ఆ సమయంలోనే అర్థమైంది.. నేను కోరుకున్నది ఇది కాదని. ఇక అక్కడి నుంచి సమయం వృథా చేయదలుచుకోలేదు. పరిశ్ర వద్దనుకుని వచ్చేశాను."



ఫిట్‌నెస్ మీద దృష్టి

అప్పట్లో బొద్దుగా, కాస్త బరువుగా ఉండేదాన్ని. జిమ్‌కు వెళ్లడానికే ఎంతో ఆలోచించేదాన్ని. నాన్నతో కలిసి ఎప్పుడన్నా బయటకు వెళ్లినప్పుడు నా ఫొటోలు తీసి, పత్రికల్లో ప్రచురించి, నా ఆకారం గురించి రాసేవారు. చిన్న వయసులో ఇవి నన్ను ఎంతో బాధించేవి. క్రమంగా ఆ విమర్శలను సానుకూలంగా తీసుకోవడం మొదలుపెట్టాను. అందుకే సినీ రంగం వద్దనుకుని వచ్చేశాక... ముందు నన్ను నేను మార్చుకోవాలని అనుకున్నాను. ఫిట్‌నెస్ మీద దృష్టి పెట్టాను. కొద్ది రోజుల్లోనే నాజూగ్గా మారాను. నిత్యం వ్యాయామాలవల్ల శరీరం సరైన ఆకృతిని సంతరించుకుంది. రోజంతా ఎంతో ఉత్సాహంగా, ఏదో శక్తి నాలో ఆవహించినట్టుగా ఉండేది. ఏకాగ్రత కుదిరేది. దానివల్ల ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది. అలా చివరకు ఫిట్‌నెస్‌కు సంబంధించిన కంపెనీనే నెలకొల్పాను. ఇప్పుడు నేను గర్వంగా చెప్పుకోగలను... ఒక విజయవంతమైన వ్యాపారవేత్తనని. ఇది నా కష్టం, పట్టుదలతో సాధించిన విజయం. నాన్న డబ్బు కానీ, ఆయన స్టార్‌డమ్ కానీ నాకు ఇంతటి సంతృప్తిని, సంతోషాన్ని ఇవ్వలేవు.

సోషల్ మీడియాలో పెట్టిన కొన్ని ఫొటోలు, వీడియోలు తమ విచారణలో నకిలీవిగా తేలినట్లు సైబర్ క్రైం వర్గాలు తెలిపాయి.



1. యంత్రాలతో చెట్ల తొలగింపు ప్రక్రియ జరుగుతుండగా నెమళ్లు, ఇతర వన్యప్రాణులు భయంతో పారిపోతున్నట్లుగా సోషల్ మీడియాలో పెట్టిన ఫొటో నకిలీదని తేలిందని, ఆ ఫొటో 99 శాతం ఏఐతో తయారు చేసిందని వెల్లడించారు.



2. బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ జింక ఫొటోను పోస్ట్ చేసి, అది కంచ గచ్చిబౌలి భూముల్లో యంత్రాలకు బలైపోయిందంటూ పేర్కొన్నారు. ఆ ఫొటో కూడా నకిలీదని సైబర్ క్రైం అధికారుల విచారణలో తేలింది. అందులో జింక కాళ్లు కట్టేసి ఉన్నాయని, అది ఎక్కడో వేటాడిన జింక అని పేర్కొన్నారు. దానికి, కంచ గచ్చిబౌలి భూములకూ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అదే ఫొటోను పొరపాటున పోస్ట్ చేశానని, క్షమించాలంటూ జర్నలిస్ట్ సుమిత్ ఝా 'ఎక్స్'లో చేసిన పోస్ట్‌ను కూడా విడుదల చేశారు.



3. ఓ ఇన్‌స్టాగ్రామ్ యూజర్ 'సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ' అంటూ వీడియోను పోస్ట్ చేశారు. అది పాత వీడియో అని, జీవవైవిధ్యం గురించి చెప్పేందుకే పోస్ట్ చేసినట్లు ఇన్‌స్టా యూజరే తెలిపారు. అయితే, అందులో ఉన్నది విశాఖపట్నంలోని కంబాలకొండ వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం నుంచి బయటకు వచ్చిన జింక అని సైబర్ క్రైం అధికారులు తేల్చారు. దానికి సంబంధించి విశాఖపట్నంలో ఓ ఇంటి ముందు మార్చి 14న మరో ఇన్‌స్టా యూజర్ పెట్టిన ఫొటోలోని అదే జింక ఫొటోను విడుదల చేశారు.

నకిలీ ఫొటోలు, వీడియోలపై సీఎం రేవంత్ ఆగ్రహం

- కంచగచ్చిబౌలి వివాదంలో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న వారిపై కేసులు పెట్టండి
- పోలీసు ఉన్నతాధికారులకు సీఎం ఆదేశం
- సూత్రధారులను గుర్తించే పనిలో సైబర్ క్రైం పోలీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల వివాదానికి సంబంధించి సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న నకిలీ ఫొటోలు, వీడియోలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూముల కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే విద్యార్థుల ఆందోళనలతో పాటు వన్యప్రాణులను వెళ్లగొడుతున్నారంటూ మార్ఫింగ్ చేసిన వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో విచ్చలవిడిగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా నకిలీ ఫొటోలు, వీడియోలను పోస్ట్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను సీఎం ఆదేశించినట్లు సమాచారం. ఈ క్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు నకిలీ ఫొటోలు సృష్టిస్తున్న వారిని గుర్తించే పనిలో పడ్డారు. కొందరు వ్యక్తులు వీటిని తయారు చేయడం, సర్క్యులేట్ చేయడమే పనిగా పెట్టుకున్నారని, పాత్రధారులతో పాటు సూత్రధారులను గుర్తించాలని సీఎం ఆదేశించడంతో పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. జేసీబీలతో పని జరుగుతున్నప్పుడు నెమళ్లు, జింకలు ప్రాణ భయంతో పరుగు తీస్తున్నాయంటూ వచ్చిన ఫొటో, వీడియో మార్ఫింగ్ చేసినవేనని పోలీసులు చెబుతున్నారు. ఇక, ఆందోళనకు దిగిన హెచ్‌సీయూ విద్యార్థులను పోలీసులు



అరెస్టు చేస్తున్న క్రమంలో కూడా పలు ఫేక్ వీడియోలను సోషల్ మీడియాలో తిప్పారని పేర్కొంటున్నారు. ప్రతిపక్ష పార్టీల వారితో పాటు కొన్ని శక్తులు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడం కోసం ఈ అంశాన్ని వాడుకుంటున్నాయంటున్నారు. ఇలాంటి వారిపై సైబర్ క్రైం బృందాలు నిఘా పెట్టాయి.

కంచ గచ్చిబౌలి నివేదికపై కసరత్తు

ఉదయం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సీఎస్ సమావేశం

- సాయంత్రం భట్టి, మంత్రి పొంగులేటి భేటీ
- ఇది త్రిసభ్య కమిటీ తొలి సమావేశం
- సుప్రీంకు సమర్పించాల్సిన నివేదికపై చర్చ
- అడ్వకేట్ జనరల్, న్యాయ నిపుణుల సలహాలు తీసుకోవాలని యోచన

హైదరాబాద్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి విషయంలో సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సుప్రీంకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ నివేదిక తయారీకి ఉపక్రమించింది. ఇందులో భాగంగా సచివాలయంలో శుక్రవారం రెండు కీలక సమావేశాలు జరిగాయి. ఉదయం 11 గంటలకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రెవెన్యూ, అటవీ శాఖ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. కంచ గచ్చిబౌలి భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం గురువారం ఏర్పాటుచేసిన త్రిసభ్య కమిటీలో భట్టి, పొంగులేటితోపాటు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సభ్యులుగా ఉన్నారు. భట్టి, పొంగులేటి భేటీ కావడంతో త్రిసభ్య కమిటీ తొలి సమావేశం జరిగినట్టు అయింది. కాగా, కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి సుప్రీం కోర్టు, హైకోర్టు లేవనెత్తిన వివిధ అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించారు. ఈ నెల 16వ తేదీ లోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని లేదంటే వ్యక్తిగతంగా బాధ్యులవుతారని సుప్రీం కోర్టు సీఎస్‌ను ఆదేశించింది. దీంతో శుక్రవారం నాటి సమావేశాల్లో సుప్రీంకు అందజేయాల్సిన నివేదికలో పొందుపర్చాల్సిన అంశాలపై చర్చించారు. ఇప్పుడే పూర్తి స్థాయి అవగాహనకు రాకపోయినా.. తదుపరి జరిగే త్రిసభ్య కమిటీ సమావేశాల్లో ఆయా అంశాలపై మరింత చర్చించాలని నిర్ణయించారు. ఇక, భూమికి సంబంధించి పూర్తి వివరాలను అందుబాటులో ఉంచాలని భట్టి అధికారులను ఆదేశించారు. ఇక, త్రిసభ్య కమిటీ త్వరలోనే విద్యార్థి సంఘాలు, పర్యావరణవేత్తలు, ప్రభుత్వ మద్దతుదారులతో సమావేశం కానుంది. శనివారమే సమావేశమయ్యే అవకాశాలు లేకపోలేదు. త్రిసభ్య కమిటీలోని భట్టి విక్రమార్క శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం భద్రాచలం వెళ్లనున్నారని సమాచారం. దీంతో శ్రీరామ నవమి తర్వాత సమావేశాలు నిర్వహిస్తారని తెలుస్తోంది. అయితే, ఈ నెల 16లోపు సుప్రీం కోర్టుకు నివేదికను సమర్పించాల్సి ఉండడంతో సానుకూల అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలని భట్టి విక్రమార్క సీఎస్‌కు సూచించినట్లు తెలిసింది. భూమి ప్రభుత్వానిదేనని, దానికి సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయని న్యాయస్థానానికి నివేదించాలని యోచించారు. ఈ విషయంలో అడ్వకేట్ జనరల్, ఇతర సీనియర్ న్యాయ నిపుణుల సలహాలను తీసుకోవాలని నిర్ణయించారు. భూసంబంధ వ్యవహారాల్లో నిపుణులైనవారిని కూడా సమావేశాలకు పిలవనున్నట్లు తెలిసింది. ఏమైనా.. నివేదిక తయారీకి ప్రభుత్వం మాత్రం తీవ్ర కసరత్తు చేస్తోంది.

కంచ గచ్చిబౌలిలోకి నో ఎంట్రీ

- 400 ఎకరాల ప్రాంతంలోకి బయటి వ్యక్తుల ప్రవేశంపై నిషేధం
- 144 సెక్షన్ అమలు.. 16వ తేదీ వరకు పోలీసు ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రాంతంలో బయటి వ్యక్తుల ప్రవేశంపై పోలీసులు నిషేధం విధించారు. అంతేకాక, ఆ ప్రాంతంలో ఈ నెల 16వ తేదీ వరకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (గతంలో ఐపీసీ 144వ సెక్షన్) అమలు చేస్తున్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఈ చర్యలు తీసుకున్నట్టు మాదాపూర్ జోన్ డీసీపీ డా. జి.వినీత్ శుక్రవారం ప్రకటించారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమికి సంబంధించిన సుప్రీం కోర్టు, హైకోర్టుల్లో కేసులు విచారణలో ఉన్న నేపథ్యంలో కేంద్ర సాధికార కమిటీ ఆదేశాలను, శాంతిభద్రతల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రజల రోజువారీ జీవనానికి, భద్రతకు ప్రమాదం జరగకుండా ఉండేందుకే ఈ ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ ఆంక్షలను ఉల్లంఘించిన వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 16వ తేదీ వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి తమకు సహకరించాలని మాదాపూర్ డీసీపీ కోరారు.

అడ్డగోలుగా అమ్ముకుంటే ఊరుకోం:ఈటల



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కంచ గచ్చిబౌలి భూములను అడ్డగోలుగా రియల్ ఎస్టేట్ బ్రోకర్ మాదిరి అమ్ముకునే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలుచేయలేక చతికిల పడ్డారని విమర్శించారు. ప్రభుత్వ భూముల్లో ఫ్యాక్టరీలు, సంస్థలు పెట్టి ఉద్యోగావకాశాలు కల్పించాలి తప్ప వాటిని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం అమ్ముకుంటారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎంగా రేవంత్ కొత్త కావచ్చుని, కానీ వాళ్ల పార్టీ కొత్త కాదని.. ఇలాంటి హామీలు ఇచ్చే ముందు ఆలోచించుకోవాలని ఈటల సూచించారు. కాగా పలువురు కేంద్రమంత్రులతో తన భేటీల వివరాలను ఎంపీ ఈటల వెల్లడించారు. తన మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గంలో ఆర్‌యూబీ, ఆర్వోబీలను నిర్మించాలని రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మరోవైపు సుచిత్ర రైల్వేస్టేషన్‌కు రక్షణశాఖ భూముల నుంచి రోడ్డు ఏర్పాటు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరినట్లు చెప్పారు.

ఆ భూమి రేవంత్‌ది కాదు.. ప్రభుత్వానిది: నారాయణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూమి సీఎం రేవంత్ రెడ్డి సొంతం కాదని, ప్రభుత్వ భూమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ధరలు పెరగడంతో అందరి కన్ను హెచ్‌సీయూ భూములపై పడిందన్నారు. ఇంతకుముందు కేర్ ఆస్పత్రికి భూమిలిచ్చే ప్రయత్నం జరిగితేనే తాము ఒప్పుకోలేదని తెలిపారు. విద్యా సంస్థల భూముల విక్రయం భవిష్యత్తు తరాలపై గొడ్డలిపెట్టు వంటిదేనని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూములు హెచ్‌సీయూ యూనివర్సిటీకే దక్కేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. విద్యార్థులపై పెట్టిన కేసులు ఉప సంహరించుకోవాలని కోరారు.

జీవో 129ను సవరించకుంటే ఉద్యమమే

- టీవీఆర్వోల జేఏసీ సమావేశంలో హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జీవో 129ను సవరించకుంటే ఉద్యమం తప్పదని తెలంగాణ వీఆర్వోల జేఏసీ హెచ్చరించింది. తొలగించిన వీఆర్వోలను విధుల్లోకి తీసుకోవాలని జేఏసీ కోరింది. నాంపల్లిలోని టీఎన్జీవోఎస్ భవన్‌లో తెలంగాణ వీఆర్వోల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. టీవీఆర్వోల జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీష్ మాట్లాడుతూ.. 129 జీవో ద్వారా జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఈ నెల 16 తేదీలోగా గూగుల్ ఫామ్ నింపి కలెక్టర్‌కు సమర్పించాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ అనుభవంతో పనిచేస్తున్న వీఆర్వోలని గత ప్రభుత్వం ఒక్కసారిగా తొలగించి తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల, పింఛనర్ల జేఏసీ చైర్మన్ మారం జగదీష్ మాట్లాడుతూ తొలగించిన వీఆర్వోల ఆవేదన తెలిపేందుకు రాజధానిలో బహిరంగసభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

చిత్రజ్యోతి


SINCE 1965

ఆగస్టులో మామ



రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కూలీ'. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 14న కూలీ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా తెలిపింది. ఈ సందర్భంగా విజిల్ వేస్తున్న రజనీకాంత్ పోస్టర్‌ను యూనిట్ షేర్ చేసింది. బంగారం అక్రమ రవాణా నేపథ్యంలో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్, ఉపేంద్ర, నాగార్జున కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్, హృతిక్‌రోషన్ నటించిన 'వార్ 2' చిత్రం కూడా ఆగస్టు 14న విడుదలవుతోంది.

మేలో లెవెన్




నవీన్‌చంద్ర కథానాయకుడిగా మర్డర్ మిస్టరీ కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రం 'లెవెన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. మే 16న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. ఈ సందర్భంగా పోలీసాఫీసర్ పాత్రలో ఉన్న నవీన్‌చంద్ర లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. నవీన్‌చంద్రకు జోడీగా రేయాహరి నటించారు. డి. ఇమ్మాన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: కార్తీక్ అశోకన్.

మంచి చిత్రాలతో మీ ముందుకొస్తా

- సంపూర్ణేశ్‌బాబు



'తెలుగుచిత్ర పరిశ్రమలో నటుడిగా 11 ఏళ్ల కెరీర్ నాది. ఎంతోమందికి రాని అవకాశం నాకు లభించినందుకు సంతోషంగా ఉంది. తెలుగు ప్రేక్షకులు నన్ను ఆదరించడం నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నాను' అని సంపూర్ణేశ్‌బాబు అన్నారు. ఆయన హీరోగా నటించిన 'సోదరా' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంపూర్ణేశ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ 'ఒక చిన్న పల్లెటూరి వచ్చిన నరసింహాచారి అనే వ్యక్తి ఈ రోజు సంపూర్ణేశ్‌బాబుగా మీ ముందున్నాడు అంటే దానికి కారణం 'హృదయ కాలేయం' చిత్రం. ఇకపై ప్రేక్షకులు మెచ్చే మంచి చిత్రాలు చేయాలనుకుంటున్నాను. త్వరలో 'సోదరా' చిత్రంతో మీ ముందుకు వస్తున్నాను. మరో రెండు సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి' అని చెప్పారు.



అక్టోబర్‌లో అల్లుడు

కమర్షియల్ సినిమాలు చేస్తూనే, నటనా ప్రాధాన్య పాత్రలతో మెప్పించే ప్రయత్నం చేస్తున్నారు ధనుష్. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇడ్లీ కడై' (ఇడ్లీ కొట్టు). నిత్యామీనన్ కథానాయిక. ఆకాశ్ భాస్కర్ నిర్మిస్తున్నారు. సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్, షాలిని పాండే కీలకపాత్రలు పోషిస్తున్నారు. ముందు ప్రకటించిన విధంగా ఈ చిత్రం ఈనెల 10న విడుదలవ్వాల్సి ఉంది. అయితే ఇప్పుడు కొత్త తేదీకి మారింది. అక్టోబర్ 1న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ధనుష్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వేడుకల్లో స్టెప్పులేస్తున్న ధనుష్ లుక్‌ను చిత్రబృందం షేర్ చేసింది. ఈ చిత్రంలో గ్రామీణ యువకుడి పాత్రలో ధనుష్ కనిపించనున్నారు.

చంద్రుడిపై అవతార్ యుద్ధం



ప్రపంచ సినీ ప్రేక్షకుల మెప్పు పొందిన హాలీవుడ్ చిత్రం 'అవతార్'. ఇప్పటికే విడుదలైన రెండు భాగాలు బాక్సాఫీసు దగ్గర ఘన విజయం అందుకున్నాయి. త్వరలో మూడో భాగం 'అవతార్: ది ఫైర్ అండ్ యాష్' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుందని దర్శకుడు జేమ్స్ కామెరూన్ చెప్పారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన 'అవతార్ 3' విశేషాలను మీడియాతో పంచుకున్నారు. మూడో భాగంలో కథానాయకుడు జేక్, ఆయన కుటుంబం కొత్త ప్రతినాయకులతో పోరాడతారని చెప్పారు. గతంలో పండోరా గ్రహంపైన, సముద్రంలో వారు చేసిన పోరాటాలు ప్రేక్షకులను మెప్పించగా, ఈ సారి చంద్రుడిపై జరిగే యుద్ధాన్ని చూపించబోతున్నామన్నారు. ఈ సిరీస్‌లోని గత చిత్రాలతో పోల్చితే మూడో భాగం ప్రేక్షకులను అమితంగా అలరిస్తుందని తెలిపారు. డిసెంబర్ 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఒక్కసారిగా మొదలైంది



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో రూపొందుతున్న కామెడీ థ్రిల్లర్ 'చౌర్యపాఠం'. దర్శకుడు నక్కిన త్రినాథరావు నిర్మిస్తున్నారు. నిఖిల్ గొల్లమారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇంద్రరామ్, పాయల్ రాధాకృష్ణ జంటగా నటిస్తున్నారు. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'ఒక్కసారిగా మొదలైంది కలవరం' అంటూ సాగే గీతాన్ని శుక్రవారం వరుణ్‌తేజ్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. డావ్‌జాండ్ స్వరకల్పనలో అనురాగ్ కులకర్ణి ఆలపించారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. రాజీవ్ కనకాల, అలీ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ, సినిమాటోగ్రఫీ: కార్తీక్ ఘట్టమనేని, ఎడిటర్: ఉత్తర

తెరపై చెరగని దేశభక్తి సంతకం





బాలీవుడ్ ఐకాన్.. భరత మాత ప్రేమికుడు.. మనోజ్ కుమార్ (87) ఇకలేరు. దేశభక్తి, సామాజిక సమస్యలను ప్రధాన ఇతివృత్తంగా చేసుకొని సినిమాలు తీసిన ప్రముఖ బాలీవుడ్ నటుడు, దర్శకుడు మనోజ్ కుమార్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ముంబైలోని కోకిలాబెన్ ధీరూబాయ్ అంబానీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. దేశభక్తి ప్రధానాంశంగా ఉండే సినిమాలకు ఆయన ప్రసిద్ధి చెందడంతో ఆయనను 'భరత్ కుమార్' అని పిలిచేవారు. ఆయన నటించిన అధిక శాతం సినిమాల్లోనూ ఆయన పేరు భరత్‌కుమారే కావడం గమనార్హం. దేశభక్తి నేపథ్యంలో ఆయన చేసినన్ని సినిమాలు ఎవరూ చేయలేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. 1960, 70వ దశకాల్లో ఆయన చేసిన సినిమాలు వెండితెరను ఏలాయి.



దిలీప్ కుమార్ స్ఫూర్తితో



1937లో హరికృష్ణ గిరి గోస్వామి పేరుతో పంజాబీ హిందూ కుటుంబంలో అవిభక్త పాకిస్థాన్‌లో జన్మించారు ఆయన. బాలీవుడ్ దిగ్గజ నటుడు దిలీప్‌కుమార్ మీద ఉన్న అమితమైన అభిమానం ఆయనను సినిమాలవైపు నడిపించింది. 'షబ్నమ్' సినిమాలో దిలీప్‌కుమార్ పాత్ర పేరు మనోజ్‌కుమార్. ఆ పేరునే తన స్ర్కీన్‌నేమ్‌గా పెట్టుకున్నారు. 1957లో 'ఫ్యాషన్' అనే చిత్రంతో నటుడిగా కెరీర్‌ను మొదలుపెట్టారు ఆయన. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించినా అంతగా గుర్తింపు రాలేదు. 1961లో విడుదలైన 'కాంచ్ కీ గుడియా' చిత్రంలో తొలిసారి లీడ్ రోల్‌లో నటించారు. 1962లో విడుదలైన 'హరియాలీ ఔర్ రాస్తా' సినిమా ఆయనకు నటుడిగా మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది.

'షాహిద్'తో మొదలు

మనోజ్‌కుమార్ దేశభక్తి ప్రధానంగా చేసిన చిత్రాలలో మొదటి చిత్రం 'షాహిద్'. 1965లో విడుదలైంది. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి మన్ననలు పొందింది. ఆ తర్వాత 1967లో విడుదలైన 'ఉప్‌కార్' అనే సినిమాతో ఆయన దర్శకుడిగా మారారు. ఈ సినిమాలో రైతుగా, సైనికుడిగా రెండు పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. 'పురబ్ ఔర్ పశ్చిమ్', 'రోటి కపడా మకాన్', 'క్రాంతి' వంటి సందేశాత్మక చిత్రాలతో మరింత స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్నారు. ఆయన చేసిన పలు సినిమాలు ఇతర భాషల్లో రీమేకై ప్రజాదారణ పొందాయి. తెలుగులో టాప్ స్టార్స్ అయిన ఎన్టీఆర్ (ఒకే కుటుంబం), కృష్ణ (పాడిపంటలు), శోభన్‌బాబు (జీవన పోరాటం) ఆయన సినిమాలను రీమేక్ చేయడం విశేషం. 1972లో తండ్రీ కొడుకుల అనుబంధం ఆధారంగా తెరకెక్కిన 'షోర్' చిత్రం ఆయన దర్శకత్వం వహించిన చిత్రాల్లో అత్యుత్తమైనదని చాలామంది అభిప్రాయపడతారు. ఆయన నటించిన, దర్శకత్వం వహించిన చిత్రాలన్నింటిలోనూ ప్రేక్షకులను విశేషంగా అలరించిన హిట్ సాంగ్స్ ఉండడం విశేషం. 'ఓ కౌన్ థీ' చిత్రంలోని పాపులర్ మెలోడీ 'లగ్ జా గలే' పాటను ఇటీవలే విడుదలైన సల్మాన్‌ఖాన్ 'సికందర్'లోనూ రీమిక్స్ చేశారు.

బాల్యంలో సినిమా కష్టాలు

అగ్ర శ్రేణి నటుడు, దర్శకుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన మనోజ్‌కుమార్‌కు చలన చిత్ర రంగ ప్రవేశం, గుర్తింపు అంత సులభంగా దక్కలేదు. దేశ విభజన జరిగిన సమయంలో ఎన్నో కష్టాలను ప్రత్యక్షంగా ఎదుర్కొన్నారు ఆయన. తన కుటుంబంతో కలసి తొమ్మిదేళ్ల వయసులో ఢిల్లీ శివార్లలో శరణార్థ శిబిరాల్లో గడిపారు. ఆ సమయంలో చూసిన సంఘటనలే ఆయనలో బలంగా నాటుకుపోయి ఆ తర్వాత దేశ భక్తి నేపథ్యంలో సినిమాలు చేయడానికి ప్రేరణనిచ్చాయి.



నటుడిగా, దర్శకుడిగా, స్ర్కీన్‌ప్లే రచయితగా ఓ వెలుగు వెలిగిన ఆయన్ను ఎన్నో పురస్కారాలు వరించాయి. 1992లో కేంద్ర ప్రభుత్వం ఆయన్ను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. 2015లో దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని అందుకున్నారు. సినిమాల నుంచి విరామం తీసుకున్నాక బీజేపీలో చేరిన ఆయన.. ఎటువంటి పదవీ లేకుండానే కొనసాగారు.

తరతరాలకూ ఆదర్శం

మనోజ్‌కుమార్ మృతిపట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. "బాలీవుడ్ ఐకాన్ మనోజ్‌కుమార్ మరణం బాధాకరం. దేశభక్తి ప్రధానంగా ఆయన చేసిన సినిమాలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి" అని ఎక్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. "వెండితెరపై ఆయన పోషించిన పాత్రలు ఎప్పటికీ మన మనసుల్లో నిలిచిపోతాయి" అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. "జాతీయ భావాలు గల మహోన్నత వ్యక్తి మనోజ్ కుమార్. దేశ భక్తి నేపథ్యంలో ఆయన చేసిన పలు సినిమాలు ఎంతో స్ఫూర్తిని అందిస్తాయి. 'ఉప్‌కార్' సినిమాను ఇప్పుడు చూసినా, ఆనాటి 'జై జవాన్ జై కిసాన్' నినాద నేపథ్యాన్ని, ప్రభావాన్ని గుర్తుకుతెస్తాయి" అని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఆయన మృతి బాలీవుడ్‌కు తీరని లోటు అని.. దర్శకులు మధుర్ బండార్కర్, జోయా అక్తర్, వివేక్ అగ్నిహోత్రి, హన్సల్ మెహతా, హీరోలు ఆమిర్ ఖాన్, సల్మాన్‌ఖాన్, అక్షయ్‌కుమార్, అజయ్ దేవగణ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. నేటి ఉదయం ముంబైలో మనోజ్ కుమార్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మార్కెట్ ట్రంఫట్!

వాణిజ్య యుద్ధం, మాంద్యం భయాలతో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

- సెన్సెక్స్ 930 పాయింట్లు పతనం
- 76,000 స్థాయిని కోల్పోయిన సూచీ
- 23,000 దిగువకు జారిన నిఫ్టీ
- దాదాపు రూ.10 లక్షల సంపద నష్టం

ముంబై: ట్రంప్ సుంకాలు అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధానికి దారి తీయవచ్చని, అమెరికాను ఆర్థిక మాంద్యంలోకి నెట్టవచ్చన్న భయాందోళనలతో ప్రపంచ దేశాల స్టాక్ మార్కెట్లు భారీ పతనాన్ని చవిచూశాయి. భారత ఈక్విటీ సూచీలూ ఇందుకు అతీతమేమీ కాదు. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 1,054.81 పాయింట్ల మేర క్షీణించి 75,240.55 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 930.67 పాయింట్ల (1.22 శాతం) నష్టంతో 75,364.69 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 345.65 పాయింట్లు (1.49 శాతం) కోల్పోయి 22,904.45 వద్దకు జారుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ, ఇన్ఫోసిస్ వంటి మార్కెట్ దిగ్గజాలతో పాటు ఐటీ, మెటల్, ఫార్మా రంగ షేర్లలో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున అమ్మకాలకు పాల్పడటం సూచీల భారీ నష్టాలకు కారణమైంది. ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9.98 లక్షల కోట్లు తగ్గి రూ.403.34 లక్షల కోట్లకు (4.73 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఈ వారంలో సెన్సెక్స్ 2,050.23 పాయింట్లు (2.64 శాతం), నిఫ్టీ 614.8 పాయింట్లు (2.61 శాతం) కోల్పోయాయి.

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోయాయి. టాటా స్టీల్ 8.59 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టాటా మోటార్స్ 6.15 శాతం పతనమైంది. ఎల్ అండ్ టీ, అదానీ పోర్ట్స్ 4 శాతానికి పైగా.. ఇండస్ఇండ్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ 3 శాతానికి పైగా తగ్గాయి.
- ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి షేర్లలో మధ్యాహ్నం నుంచి అమ్మకాలు పోటెత్తాయి. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 3.08 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 3.43 శాతం క్షీణించాయి. రంగాల వారీ సూచీలన్నీ నేలచూపు చూశాయి. అత్యధికంగా మెటల్ 6.34 శాతం నష్టపోగా.. క్యాపిటల్ గూడ్స్, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీస్, ఇండస్ట్రియల్స్, ఎనర్జీ, రియల్టీ, ఐటీ సూచీలు 3 శాతానికి పైగా తగ్గాయి.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు క్షీణించి రూ.85.44 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడుల తరలింపు మన కరెన్సీకి గండికొట్టాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా తగ్గాయి. బ్రెంట్ రకం క్రూడాయిల్ పీపా ధర ఒకదశలో 6.62 శాతం తగ్గి 65.50 డాలర్లకు దిగివచ్చింది. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితి నేపథ్యంలో ఇంధన గిరాకీ తగ్గవచ్చన్న అంచనాలు ఇందుకు కారణమయ్యాయి.
- మన విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 5 నెలల గరిష్ఠ స్థాయికి పెరిగాయి. మార్చి 28తో ముగిసిన వారం నాటికి ఫారెక్స్ నిల్వలు మరో 659.6 కోట్ల డాలర్ల మేర పెరిగి మొత్తం 66,539.6 కోట్ల డాలర్లకు చేరాయని ఆర్‌బీఐ వెల్లడించింది. నిల్వలు పెరుగుతుండటం వరుసగా ఇది నాలుగోవారం.



ఫార్మా షేర్లు కుదేలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. వారి దేశంలోకి దిగుమతయ్యే ఔషధాల పైనా గతంలో ఎన్నడూ లేని విధంగా సుంకాలను త్వరలోనే విధిస్తామని తాజాగా ప్రకటించారు. ఈ నెల 2న సుంకాలు ప్రకటించిన సందర్భంలో ఔషధాలు, సెమీకండక్టర్లకు వినహాయింపునిచ్చిన పెద్దన్న.. ఆకస్మికంగా యూటర్న్ తీసుకోవడం ఈ రెండు ఇండస్ట్రీల వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఈ వార్త నేపథ్యంలో ఫార్మా రంగ షేర్లు భారీగా నష్టపోయాయి. మార్క్సాన్స్ ఫార్మా షేరు 11.18 శాతం నష్టపోగా.. లారస్ ల్యాబ్స్ 7.40 శాతం, గ్రాన్యూల్స్ ఇండియా 7.01 శాతం, శిల్పా మెడికేర్ 6.56 శాతం, ఇప్కా ల్యాబ్స్ 6.53 శాతం, అరబిందో ఫార్మా 5.96 శాతం, లుపిన్ 5.85 శాతం తగ్గాయి. గ్లాండ్ ఫార్మా 5.51 శాతం, అజంతా ఫార్మా 5.40 శాతం, సిప్లా 5.32 శాతం, బయోకాన్ 5.09 శాతం, వోక్‌హార్ట్ 5 శాతం క్షీణించాయి. దివీస్ లేబొరేటరీస్ 4.70 శాతం, నాట్కో ఫార్మా 4.75 శాతం, డాక్టర్ రెడ్డీస్ 3.60 శాతం, సన్‌ఫార్మా 3.43 శాతం పడ్డాయి. బీఎస్ఈలోని హెల్త్‌కేర్ ఇండెక్స్ 3.20 శాతం క్షీణించింది.

కొత్త రూ.10.. రూ.500 నోట్లు

నూతన గవర్నర్ సంజయ్ సంతకంతో విడుదల

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కొత్తగా రూ.10, రూ.500 నోట్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. నూతన గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో ఈ కరెన్సీ నోట్లను త్వరలో విడుదల చేయబోతున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మహాత్మ గాంధీ సిరీస్‌లోనే వాటి డిజైన్ ఉంటుందని తెలిపింది. గతంలో విడుదల చేసిన రూ.10, రూ.500 నోట్లు యధావిధిగా చెల్లుబాటు అవుతాయని పేర్కొంది. గవర్నర్ మల్హోత్రా సంతకంతో కూడిన నూతన రూ.100, రూ.200 నోట్లను విడుదల చేయనున్నట్లు ఆర్‌బీఐ గత నెలలో ప్రకటించిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా ఇప్పుడు రూ.10, రూ.500 నోట్లను కూడా విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది.

నూతన ఎగ్జిమ్ నిబంధనలు

ప్రకటించిన ఆర్‌బీఐ

ముంబై: వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా)-1999 పరిధిలో ఎగుమతి, దిగుమతి లావాదేవీలకు సంబంధించి సవరించిన ముసాయిదా నిబంధనలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రతిపాదించింది. ఈ సవరించిన ముసాయిదా నిబంధనల ప్రకారం ఎగుమతిదారుకు గడువు తేదీ ముగిసిన రెండేళ్ల తర్వాత కూడా బకాయి సొమ్ము అందకపోయినా, అలా తాను అందుకోవాల్సిన సంచిత బకాయి రూ.25 కోట్లు దాటినా సంబంధిత ఎగుమతిదారుడు అడ్వాన్స్‌గా పూర్తి సొమ్ము చెల్లింపు లేదా వెనక్కి తీసుకోవడానికి వీలు లేని లెటర్ ఆఫ్ క్రెడిట్ హామీ పొందిన తర్వాత మాత్రమే మరిన్ని ఎగుమతులను ఆమోదించవచ్చు. అలాగే బంగారం, వెండి దిగుమతుల విషయంలో అధీకృత డీలర్ అడ్వాన్స్ చెల్లింపులు చేయడానికి ఇక ఏ మాత్రం అనుమతించరు. మరింతగా వ్యాపార సౌలభ్యం కల్పించడం లక్ష్యంగానే ఈ ముసాయిదా నిబంధనలు విడుదల చేసినట్టు ఆర్‌బీఐ తెలిపింది.

భారీగా తగ్గిన బంగారం, వెండి

- 10 గ్రాములపై రూ.1,350 తగ్గుదలతో రూ.93,000కు దిగివచ్చిన పసిడి
- కిలో వెండి రూ.5,000 డౌన్

అంతర్జాతీయ మార్కెట్లో 3,045 డాలర్లకు ఔన్స్ గోల్డ్

న్యూఢిల్లీ: పసిడి ధరలు ఆల్ టైమ్ రికార్డు స్థాయి నుంచి గణనీయంగా తగ్గాయి. శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర రూ.1,350 తగ్గుదలతో రూ.93,000కు దిగివచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం సైతం అదే స్థాయిలో తగ్గి రూ.92,550 ధర పలికింది. దాంతో గోల్డ్ ధరల 5 రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. వెండి విషయానికొస్తే, కిలోపై ఏకంగా రూ.5000 తగ్గి రూ.95,500కు జారుకుంది. వెండికి గత నాలుగు నెలల్లో ఇదే అతిపెద్ద తగ్గుదల. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు బాగా తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు (జూన్ డెలివరీ) ధర ఒక దశలో 2.60 శాతం క్షీణించి 3,042 డాలర్లకు పడిపోయింది. సిల్వర్ 6.75 శాతం పతనమై 29.83 డాలర్లకు దిగివచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) — 5వ తేదీ

హైదరాబాద్	400	విజయవాడ	430
వరంగల్	402	గోదావరి	425
చిత్తూరు	470	విశాఖపట్నం	440
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	92
కర్నూలు	120	నెల్లూరు	97
విశాఖపట్నం	114	అనంతపురం	97
గోదావరి	130		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	91,640 ▼	84,000 ▼	1,08,000 ▼
విజయవాడ	93,600 ▼	88,000 ▲	95,000 ▼
విశాఖపట్నం	89,330 ▲	81,890 ▲	91,600 ▼
రాజమండ్రి	91,640 ▲	84,000 ▲	95,600 ▼
ప్రొద్దుటూరు	92,900 ▼	85,400 ▼	96,000 ▼
ముంబై	91,014 ▲	83,369 ▲	92,910 ▼

2030 నాటికి 100 కొత్త విమానాలు

క్యాథే పసిఫిక్ రీజినల్ మేనేజర్ రాకేశ్ రాయికర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): క్యాథే పసిఫిక్ విమానయాన సంస్థ 100 కొత్త తరం విమానాలు సమకూర్చుకుంటోంది. రాబోయే ఐదు సంవత్సరాల కాలానికి తాము నిర్దేశించుకున్న 10 వేల కోట్ల హాంకాంగ్ డాలర్ల (ప్రస్తుత మారకపు విలువలో 1,286 కోట్ల అమెరికన్ డాలర్లు) పెట్టుబడిలో ఈ విమానాల కొనుగోలు కూడా ఒక భాగమని కంపెనీ రీజినల్ జీఎం రాకేశ్ రాయికర్ తెలిపారు. ఇటీవల దేశంలో యాపిల్ ఉత్పత్తులు ప్రారంభం కావడంతో పాటు ఫార్మా ఎగుమతుల మద్దతుతో ఈ ఏడాది దక్షిణ భారతం నుంచి కార్గో వృద్ధి 25% ఉంటుందని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. గత ఏడాది తాము వివిధ గమ్యాలకు తరలించిన కార్గోలో 43% చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలదేనని ఆయన తెలిపారు. తెలంగాణలో ఫాక్స్‌కాన్ తయారీ కేంద్రం ఏర్పాటవుతున్న నేపథ్యంలో ఇక్కడి నుంచి కార్గో రవాణా మరింతగా పెరుగుతుందని భావిస్తున్నట్టు కంపెనీ కార్గో విభాగం రీజినల్ హెడ్ రాజేష్ మీనన్ అన్నారు.

తాము కొత్తగా సమకూర్చుకుంటున్న 100 విమానాల డెలివరీ 2027లో ప్రారంభమై 2030 నాటికి పూర్తవుతుందని రాయికర్ చెప్పారు. హైదరాబాద్ నుంచి హాంకాంగ్‌కు తాము ప్రస్తుతం వారంలో మూడు సర్వీసులు నడుపుతున్నామని, సెప్టెంబరు 1 నుంచి వీటి సంఖ్య 5కి పెంచుతామని రాయికర్ వెల్లడించారు.

రూ.1,200 కోట్లతో విస్తరణ

ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ ఎండీ ప్రమోద్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ (ఎంఎస్ఏఎఫ్) రూ.1,200 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. శుక్రవారం నాడిక్కడ మార్కెట్లోకి ఎంఎస్ లైఫ్ 600+ సీఆర్ఎస్ (కరోజన్ రెసిస్టెన్స్ స్టీల్) టీఎంటీ బార్స్‌ను కంపెనీ ఎండీ ప్రమోద్ కుమార్ అగర్వాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా అగర్వాల్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కంపెనీకి చెందిన ప్లాంట్లలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు వచ్చే 2-3 ఏళ్ల కాలంలో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కంపెనీకి తెలంగాణలోని తూప్రాన్, ఏపీలోని నాయుడుపేట, మంత్రాలయంలో ప్లాంట్లున్నాయి. ఈ ప్లాంట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 60 లక్షల టన్నులుండగా ప్రతిపాదిత పెట్టుబడులతో 1.2 కోట్ల టన్నులకు చేరుకుంటుందని అగర్వాల్ తెలిపారు. అలాగే ఈ విస్తరణ ద్వారా 5,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

మా ఆత్మస్థైర్యాన్ని నీరుగార్చొద్దు

పీయూష్ గోయెల్‌కు స్టార్టప్స్ అధినేతల వినతి

న్యూఢిల్లీ: భారత స్టార్టప్ వ్యవస్థలో విలువ, ఇన్నోవేషన్ లోపించాయంటూ కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ చేసిన వ్యాఖ్యలను పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముక్తకంఠంతో ఖండించారు. తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయవద్దని, తమ సామర్థ్యాలు సంపూర్ణంగా ఉపయోగించుకునేలా వెన్నుతట్టి ప్రోత్సహించాలని ఆయనకు సూచించారు. వారిలో క్విక్ కామర్స్ కంపెనీ జెప్టో సీఈఓ అదిత్ పలీచా, జోహో వ్యవస్థాపకుల్లో ఒకరైన శ్రీధర్ వెంబు ఉన్నారు. స్టార్టప్ మహాకుంభ్‌లో గురువారం గోయెల్ చేసిన వ్యాఖ్యలపై పెద్దఎత్తున దుమారం రేగుతోంది. ఉద్యోగాలు, ఎఫ్‌డీఐ వంటి విభాగాలకు తమ కంపెనీ అందిస్తున్న వాటా "భారత ఇన్నోవేషన్ వ్యవస్థలోనే ఒక అద్భుతం" అని పలీచా వ్యాఖ్యానించారు. లక్ష్య సాధన దిశగా చురుగ్గా కృషి చేస్తున్న బృందాలను వెనక్కి లాగడం మానుకుని విభిన్న రంగాల్లో "స్థానిక చాంపియన్ల"ను సృష్టించేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించాలని కోరారు.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు

చెన్నై x ఢిల్లీ — మ.3.30 నుంచి — వేదిక: చెన్నై

పంజాబ్ x రాజస్థాన్ — రా.7.30 నుంచి — వేదిక: చండీగఢ్

విజయాన్ని లాగేశారు

సత్తా చాటిన లఖ్‌నవూ బౌలర్లు

- ముంబై పరాజయం
- మార్ష్ మెరుపు ఇన్నింగ్స్
- సూర్య పోరాటం వృథా



1 ఐపీఎల్‌లో 5 వికెట్లు తీసిన తొలి కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా. అలాగే అతడి టీ20 కెరీర్‌లోనూ ఈ ఫీట్ సాధించడం ఇదే మొదటిసారి.



లఖ్‌నవూ: సొంత గడ్డపై లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సత్తా చాటుకుంది. బ్యాటింగ్‌లో ఓపెనర్ మిచెల్ మార్ష్ (31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 60) మెరుపు ఆట తీరు కనబర్చగా.. అటు గెలుపు ఖాయమే అనుకున్న వేళ ముంబై ఇండియన్స్‌ను ఆఖర్లో లఖ్‌నవూ బౌలర్లు దెబ్బతీశారు. దీంతో శుక్రవారం ఉత్కంఠ సాగిన ఈ మ్యాచ్‌లో పంత్ సేన 12 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే ఐపీఎల్‌లో ముంబైతో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో లఖ్‌నవూకిది ఆరో విజయం కావడం విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 8 వికెట్లకు 203 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (38 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 53) అర్ధసెంచరీ సాధించగా, ఆయుష్ బదోని (19 బంతుల్లో 4 ఫోర్లతో 30), మిల్లర్ (14 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 27) సహకరించారు. హార్దిక్‌కు ఐదు వికెట్లు లభించాయి. ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసి ఓడింది. సూర్యకుమార్ (43 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 67), నమన్ ధిర్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 46) పోరాడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా దిగ్వేష్ రాఠి నిలిచాడు.

నమన్-సూర్య పోరాడినా..

భారీ ఛేదనలో ముంబై తొలి మూడు ఓవర్లలోనే ఓపెనర్లు జాక్స్ (5), రికెల్టన్ (10) వికెట్లను కోల్పోయింది. అప్పటికి స్కోరు 17 పరుగులే. ఈ దశలో వన్‌డౌన్ బ్యాటర్ నమన్ ధిర్-సూర్యకుమార్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా నమన్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఎల్ఎస్‌జీ బౌలర్లపై ఎదురుదాడి ఆరంభించాడు. ఎలాంటి ఒత్తిడి లేకుండా బౌండరీలు బాదేస్తూ స్కోరును చకచకా పెంచాడు. నాలుగో ఓవర్‌లో 6,6,4,4తో 21 రన్స్ రాబట్టాడు. అతడి ధాటికి పవర్‌ప్లేలో స్కోరు 64/2తో ఛేదన దిశగా సాగింది. అటు సూర్య సహకారం అందించడంతో దాదాపు 11 రన్‌రేట్‌తో ఇన్నింగ్స్ సాగింది. అయితే స్పిన్నర్ దిగ్వేష్ తొమ్మిదో ఓవర్‌లో మూడు పరుగులే ఇచ్చి నమన్‌ను బౌల్డ్ చేయగా మూడో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం సూర్య బాధ్యతను తీసుకుని అడపాదడపా బౌండరీలు సాధించాడు. మరో ఎండ్‌లో లఖ్‌నవూ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో తిలక్ వర్మ (25) భారీ షాట్లు ఆడలేకపోయాడు. అటు రన్‌రేట్ కూడా పెరగసాగింది. ఈ స్థితిలో 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన సూర్యను పేసర్ అవేశ్ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 66 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. అటు ముంబై అవకాశాలు కూడా సన్నగిల్లాయి. 12 బంతుల్లో 29 రన్స్ కావాల్సిన స్థితిలో 19వ ఓవర్‌లో శార్దూల్ ఏడు పరుగులే ఇచ్చి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అలాగే ఐదో బంతికి తిలక్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో శాంట్నర్ (2 నాటౌట్) క్రీజులోకి వచ్చాడు. ఇక సమీకరణం చివరి ఆరు బంతుల్లో 22 పరుగులకు మారింది. అవేశ్ తొలి బంతిని హార్దిక్ (28 నాటౌట్) సిక్సర్‌గా మలిచినా 9 పరుగులే రావడంతో ముంబై చేసేదేమీ లేకపోయింది.

మార్ష్ తుఫాన్ ఇన్నింగ్స్:

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూకు ఓపెనర్ మార్ష్ రూపంలో మెరుపు ఆరంభం లభించింది. బాదడమే లక్ష్యంగా సాగిన అతడి ఎదురుదాడికి పవర్‌ప్లేలోనే 69 పరుగులు సమకూరాయి. ఇందులో మార్ష్ ఒక్కడివే 60 పరుగులు కావడం విశేషం. మరో ఓపెనర్ మార్‌క్రమ్ ఈ దశలో ఆరు బంతులే ఆడాడు. వాస్తవానికి మార్ష్ తొలి ఓవర్‌లోనే అవుట్ కావాలి. అతడి బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతిని కీపర్ రికెల్టన్ అందుకున్నా ఎవరూ అప్పీల్ చేయలేదు. అశ్వని కుమార్ వేసిన ఆరో ఓవర్‌లో మార్ష్ 6,4,4,4తో 23 పరుగులు రాబట్టాడు. 27 బంతుల్లోనే ఈ సీజన్‌లో మూడో హాఫ్ సెంచరీని కూడా పూర్తి చేశాడు. అయితే తర్వాతి ఓవర్‌లోనే స్పిన్నర్ విఘ్నేష్ అతడిని పెవిలియన్‌కు చేర్చడంతో తొలి వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే హార్దిక్ వరుస ఓవర్లలో ప్రమాదకర పూరన్ (12), కెప్టెన్ పంత్ (2)ను అవుట్ చేయడంతో ముంబైలో జోష్ కనిపించింది. కానీ ఈ దశలో మార్‌క్రమ్ బ్యాట్ ఝుళిపించగా, అతడికి బదోని సహకారం అందించాడు. హార్దిక్, విఘ్నేష్ ఓవర్లలో మార్‌క్రమ్ భారీ సిక్సర్లతో అలరించాడు. అటు బదోని 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో 15 రన్స్ సమకూర్చాడు. నాలుగో వికెట్‌కు 51 పరుగులు జత చేరాక బదోనిని అశ్వని అవుట్ చేశాడు. ఇక 34 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన మార్‌క్రమ్‌ను హార్దిక్ దెబ్బతీశాడు. అబ్దుల్ సమద్ (4) విఫలం కాగా..చివరి ఓవర్‌లో మిల్లర్ (14 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్‌తో 27) 6,4 బాది స్కోరును 200 దాటించాడు. అయితే మిల్లర్‌తో పాటు ఆకాశ్‌దీప్(0)ను అవుట్ చేసి హార్దిక్ 5 వికెట్లను పూర్తి చేశాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	2	2	0	0	4	1.485
ఢిల్లీ	2	2	0	0	4	1.320
బెంగళూరు	3	2	1	0	4	1.149
గుజరాత్	3	2	1	0	4	0.807
కోల్‌కతా	4	2	2	0	4	0.070
లఖ్‌నవూ	4	2	2	0	4	0.048
ముంబై	4	1	3	0	2	0.108
చెన్నై	3	1	2	0	2	-0.771
రాజస్థాన్	3	1	2	0	2	-1.112
హైదరాబాద్	4	1	3	0	2	-1.612

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్
దిగ్వేష్ రాఠి (1/21)

నెట్స్‌లో రోహిత్‌కు గాయం



లఖ్‌నవూ: నెట్స్‌లో సాధన చేస్తుండగా మోకాలికి గాయమవడంతో ముంబై ఇండియన్స్ ఓపెనర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ లఖ్‌నవూతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. శుక్రవారం నెట్స్‌లో సాధన చేస్తుండగా రోహిత్ మోకాలికి గాయమైందని, అతడు బరిలోకి దిగడం లేదని టాస్ అనంతరం హార్దిక్ తెలిపాడు. కాగా, ఐపీఎల్‌లో రోహిత్ ఓ మ్యాచ్‌కు దూరమవడం 2021 తర్వాత ఇదే తొలిసారి. ఇక, ముంబై ఇండియన్స్ తరఫున 100వ ఐపీఎల్ మ్యాచ్ బరిలోకి దిగిన సందర్భంగా సూర్యకుమార్‌కు జట్టు యాజమాన్యం ప్రత్యేక జెర్సీని బహూకరించింది.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్ష్ (సి అండ్ బి) విఘ్నేష్ 60, మార్‌క్రమ్ (సి) రాజ్ బవ (బి) హార్దిక్ 53, పూరన్ (సి) చాహర్ (బి) హార్దిక్ 12, పంత్ (సి/సబ్) బాష్ (బి) హార్దిక్ 2, బదోని (సి) రికెల్టన్ (బి) అశ్వని 30, మిల్లర్ (సి) నమన్ (బి) హార్దిక్ 27, అబ్దుల్ సమద్ (సి) నమన్ (బి) బౌల్ట్ 4, శార్దూల్ (నాటౌట్) 5, ఆకాశ్‌దీప్ (సి) శాంట్నర్ (బి) హార్దిక్ 0, అవేశ్ (నాటౌట్) 2, ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 203/8; వికెట్ల పతనం: 1-76, 2-91, 3-107, 4-158, 5-173, 6-182, 7-200, 8-200; బౌలింగ్: బౌల్ట్ 3-0-28-1, దీపక్ చాహర్ 2-0-23-0, అశ్వని కుమార్ 3-0-39-1, శాంట్నర్ 4-0-46-0, విఘ్నేష్ పుతూర్ 4-0-31-1, హార్దిక్ పాండ్యా 4-0-36-5.

ముంబై: విల్ జాక్స్ (సి) బిష్ణోయ్ (బి) ఆకాశ్‌దీప్ 5, రికెల్టన్ (సి) బిష్ణోయ్ (బి) శార్దూల్ 10, నమన్ (బి) దిగ్వేష్ 46, సూర్యకుమార్ (సి) సమద్ (బి) అవేశ్ 67, తిలక్ (రిటైర్డ్ అవుట్) 25, హార్దిక్ పాండ్యా (నాటౌట్) 28, శాంట్నర్ (నాటౌట్) 2, ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 191/5; వికెట్ల పతనం: 1-11, 2-17, 3-86, 4-152, 5-180; బౌలింగ్: శార్దూల్ 4-0-40-1, ఆకాశ్‌దీప్ 4-0-46-1, అవేశ్ ఖాన్ 4-0-40-1, దిగ్వేష్ రాఠి 4-0-21-1, రవి బిష్ణోయ్ 4-0-40-0.



షూటింగ్ వరల్డ్ కప్

చైన్ సింగ్‌కు కాంస్యం

న్యూఢిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో భారత షూటర్ చైన్ సింగ్ కాంస్య పతకంతో మెరిశాడు. అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో శుక్రవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో చైన్ సింగ్ మొత్తం 443.7 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. హంగేరి షూటర్ ఇస్త్వాన్ పెని స్వర్ణం, చైనాకు చెందిన తియాన్ రజతం సాధించారు.

ఫైనల్‌కు హితేష్

ప్రపంచ బాక్సింగ్ కప్



న్యూఢిల్లీ: జాతీయ చాంపియన్ హితేష్ బ్రెజిల్‌లో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ కప్‌లో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. 70 కిలోల విభాగం బౌట్‌లో హితేష్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో హితేష్ 5-0తో ఫ్రాన్స్ బాక్సర్ మకాన్ ట్రవోర్‌ను చిత్తు చేశాడు. ఫైనల్ బౌట్‌లో ఇంగ్లండ్‌కు చెందిన ఒడెల్ కమరతో హితేష్ తలపడనున్నాడు. మిగతా బాక్సర్లలో జదుమని సింగ్ (50 కిలోలు), విశాల్ (90 కిలోలు), సచిన్ (60 కిలోలు) సెమీఫైనల్స్‌లో తమ ఓటమి పాలయ్యారు.

గ్రాండ్‌స్లామ్‌ల ప్రైజ్‌మనీ పెంచాల్సిందే..

నిర్వాహకులకు లేఖ రాసిన టాప్-10 ఆటగాళ్లు

న్యూఢిల్లీ: నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల ప్రైజ్‌మనీని పెంచాల్సిందేనని ప్రపంచ టెన్నిస్ పురుషుల, మహిళల టాప్-10 ప్లేయర్లు స్పష్టంజేశారు. ఈమేరకు వారు ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ల నిర్వాహకులకు లేఖ రాశారు. గ్రాండ్‌స్లామ్స్ ద్వారా సమకూరే ఆదాయానికి అనుగుణంగా ఆటగాళ్ల ప్రైజ్‌మనీని కూడా పెంచాలని ఆ లేఖలో కోరారు. అంతేకాదు..ఈ విషయమై ఆటగాళ్లతో చర్చించేందుకు ఈనెల 22 నుంచి మాడ్రిడ్‌లో జరిగే టెన్నిస్ టోర్నీ సందర్భంగా చర్చలకు రావాలని గ్రాండ్‌స్లామ్ నిర్వాహకులను ఆహ్వానించారు. లేఖపై జొకోవిచ్, జానిక్ సిన్నర్, కొకా గాఫ్, సబలెంకా తదితర టాప్‌స్టార్లు సంతకం చేశారు.

డ్రగ్స్ కేసులో కెనడా క్రికెట్ కెప్టెన్ అరెస్ట్

9 కిలోల మారిజువానా స్వాధీనం



బ్రిడ్జిటౌన్ (బార్బడోస్): కెనడా క్రికెట్ జట్టు కెప్టెన్ నికొలాస్ కిర్టన్‌ను డ్రగ్స్ కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని ఇక్కడి అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టడీలోకి తీసుకున్న పోలీసులు..ఏకంగా తొమ్మిది కిలోల మారిజువానాను కిర్టన్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. 26 ఏళ్ల కిర్టన్ గత ఏడాది జూలైలో కెనడా జట్టు అన్ని ఫార్మాట్ల కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. బార్బడోస్‌లో జన్మించిన నికొలాస్ దేశవాళీ అండర్-17, అండర్-19 పోటీలలో ఆ జట్టుకు ఆడాడు. అయితే అతడి తల్లి కెనడా వాసి కావడంతో అక్కడికి వెళ్లి ఆ దేశ జాతీయ జట్టుకు ఆడుతున్నాడు.

మే 24న స్వదేశంలో 'నీరజ్ చోప్రా' టోర్నీ

న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వచ్చే నెలలో స్వదేశీ అభిమానులను అలరించనున్నాడు. మే 24న హరియాణాలోని పంచకులలో అతడి పేరిటే జరిగే నీరజ్ చోప్రా క్లాసిక్ జావెలిన్ త్రో ఈవెంట్‌లో పోటీపడనున్నాడు. అటు ప్రపంచ అథ్లెటిక్స్ సంఘం కూడా ఈ ఎన్‌సీ క్లాసిక్‌ను గోల్డ్ కేటగిరీగా పేర్కొంది. దీంతో నీరజ్ ఈవెంట్‌ను సెప్టెంబరులో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు అర్హత టోర్నీగా భావిస్తున్నారు. ఈ టోర్నీలో నీరజ్‌తో పాటు ఇతర ప్రపంచ జావెలిన్ త్రోయర్లు కూడా పాల్గొననున్నట్టు తెలుస్తోంది.

కాంగ్రెస్-బీఆర్ఎస్ బంధం బహిర్గతం


- మజ్లిస్‌ను గెలిపించేందుకే ఎమ్మెల్సీ పోటీకి దూరం
- బీఆర్ఎస్ అవినీతిపై దర్యాప్తు ఏమైంది? : సంజయ్



హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్‌ను గెలిపించేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉన్నాయని.. దీంతో ఆ పార్టీల ఫెవికాల్ బంధం మరోసారి బట్టబయలైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఇన్నాళ్లు తాము చేస్తున్న ఆరోపణలు నిజమేనని తేలిపోయిందని అన్నారు. పార్లమెంటులో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై నిర్వహించిన ఓటింగ్ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశాయని సంజయ్ తెలిపారు. డీలిమిటేషన్ పేరుతో మొన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని.. త్వరలోనే తెలంగాణలో ఉమ్మడిగా బహిరంగ సభను నిర్వహించబోతున్నాయని పేర్కొన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ నాయకులంతా అసెంబ్లీ ఎన్నికల ముందు కోడై కూశారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం, ధరణి పోర్టల్‌లో రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఫార్ములా-ఈ రేసులో కేటీఆర్ అవినీతి చేశారని ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపుతామని ప్రకటించిన కాంగ్రెస్ నేతలు.. తీరా గెలిచాక డబ్బు సంచులకు అమ్ముడుపోయి బీఆర్ఎస్‌తో కుమ్మక్కై అవినీతి కేసులన్నీ నీరుగారుస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి..? ముస్లింలకు రిజర్వేషన్లను కల్పించడం వల్ల గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలు పోటీ చేయాల్సిన 30 చోట్ల మజ్లిస్ పోటీ చేసి గెలిచింది. ఇప్పుడు బీసీ జాబితా ముసుగులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల విద్య, ఉద్యోగాల్లో బీసీలకు తీరని అన్యాయం జరగబోతోంది. ఈ రెండు పార్టీలు కలిసి హైదరాబాద్‌ను మజ్లిస్ చేతుల్లో పెట్టడానికి సిద్ధమయ్యాయి" అని సంజయ్ పేర్కొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు

- బీసీ కోటా బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టండి
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీలో ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి



అమిత్‌షాతో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు బీజేపీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. చట్టసభల్లో బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. శుక్రవారం పార్లమెంట్‌లో హోంమంత్రిత్వశాఖ కార్యాలయంలో అమిత్‌షాతో కృష్ణయ్య సమావేశమయ్యారు. విద్యా ఉద్యోగాల్లో జనాభానుగుణంగా బీసీల రిజర్వేషన్లు 27 నుంచి 56 శాతానికి పెంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగానే బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పనకు బీసీ చట్టం తేవాలన్న ఆర్.కృష్ణయ్య.. ప్రైవేట్ రంగంలోనూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. బీసీల డిమాండ్లు న్యాయమైనవేనని, ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అమిత్‌షా తనకు హామీ ఇచ్చారని ఆర్.కృష్ణయ్య తెలిపారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టికి ఉద్యోగుల ఐకాస వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తమ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉద్యోగుల ఐకాస విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఐకాస ఛైర్మన్ వి. లచ్చిరెడ్డితో కలిసి ఆ సంఘం నేతలు ప్రజాభవన్‌లో శుక్రవారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం తమ సమస్యలను మంత్రికి వివరించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతోపాటు, తాత్కాలిక ఉద్యోగుల బకాయిలను కూడా విడుదల చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఐకాస నేతలు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల వేతనాలపై 'మహాలక్ష్మి' ప్రభావం: ఆర్టీసీ జేఏసీ

ఆర్టీసీ ఉద్యోగుల వేతనాల చెల్లింపుపై 'మహాలక్ష్మి' ఉచిత ప్రయాణం ప్రభావం పడుతోందని ఆర్టీసీ జేఏసీ పేర్కొంది. గతంలో ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఒకే రోజు వేతనాలు చెల్లించిన యాజమాన్యం కొద్ది నెలలుగా ఒక్కో కేటగిరీ ఉద్యోగులకు ఒక్కో రోజున వేతనాలు చెల్లిస్తోందని, ప్రభుత్వం మహాలక్ష్మి పథకం నిధులను ప్రతి నెలా చెల్లించకుండా బకాయిలు పెడుతుండటం వల్లే ఇలా జరుగుతోందని జేఏసీ నేతలు అన్నారు. సకాలంలో జీతాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని జేఏసీ నేతలు కోరారు.

రూ.9కే చీర.. దొరక్క కన్నెర్ర!

- మాల్ నిర్వాహకుల అత్యుత్సాహం తెచ్చిన తంటా
- చీర కోసం వేలసంఖ్యలో ఎగబడ్డ మహిళలు
- క్షణాల్లో సరుకంతా ఖాళీ.. నారీమణుల ఆగ్రహం

వికారాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అగ్గువకు చీర.. ధర కేవలం తొమ్మిది రూపాయలే! ఇలా చెబితే ఎవరికి మాత్రం కొనాలని ఉండదు? మహిళలు కదా.. మరింతగా పోటెత్తారు! అయితే ఆఫర్‌ను ప్రారంభించిన కొద్దిసేపటికే చీరలన్నీ అయిపోవడం.. మహిళలు ఇంకా పెద్ద సంఖ్యలో దూసుకురావడంతో నిర్వాహకులు ఉక్కిరిబిక్కిరయ్యారు. చీరలు అయిపోవడంతో వచ్చిన మహిళలు నోటికి పనిచెప్పారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రారంభించిన జేఎల్ఎం షాపింగ్ మాల్ వద్ద ఇలా తీవ్ర గందరగోళం నెలకొంది. రూ.9కే చీర ఇస్తామని నిర్వాహకులు వారం రోజుల ముందే ప్రకటించడంతో శుక్రవారం ఉదయం 8గంటలకే వికారాబాద్, దాని చుట్టుపక్కల ఊర్ల నుంచి మహిళలు వేల సంఖ్యలో షాపింగ్ మాల్ ముందు పోగయ్యారు. ఆఫర్‌కు అందుబాటులో ఉంచిన 5వేల చీరలు కొద్దిసేపటికే అయిపోయాయి. ఇదే విషయాన్ని నిర్వాహకులు ప్రకటించడంతో అప్పటిదాకా వేచి ఉన్న మహిళలు అగ్గిమీదగుగ్గిలం అయ్యారు. గంటల కొద్దీ వేచి ఉన్నా చీర ఇవ్వరా? అంటూ మండిపడ్డారు. ఇంకొందరు చీర ఇచ్చేదాకా వెళ్లే ప్రసక్తే లేదంటూ అక్కడే కూర్చున్నారు.

కల్లు దొరకలేదనే పిచ్చిలో..

- నిమ్స్ స్పెషాలిటీ, ఎమర్జెన్సీ బ్లాక్‌ల మధ్య ఉన్న ర్యాంప్‌పై నుంచి దూకి వ్యక్తి మృతి

పంజాగుట్ట,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): అతడు కల్లు తాగందే ఒక్క పూటైనా ఉండలేడు.. అలాంటిది ఏకంగా మూడు రోజులు కల్లు లేకుండానే గడిపేసరికి పిచ్చి పిచ్చిగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. తానేం చేస్తున్నాడో తెలియని స్థితిలో ఓ ఎత్తయిన చోటు నుంచి దూకి ప్రాణాలు విడిచాడు. తండ్రిని చికిత్స చేయించేందుకు నిమ్స్‌కు తీసుకొచ్చి దుర్మరణం పాలయ్యాడు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన హనుమండ్ల పోశం అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఈ నెల ఒకటిన అతడిని చికిత్స నిమిత్తం కుమారులు నారాయణ(55), మధుకర్ చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తీసుకొచ్చారు. వైద్యులు అతడికి పరీక్షలు నిర్వహించి ఆస్పత్రిలో చేర్చుకొని చికిత్స అందిస్తున్నారు. 3 రోజుల నుంచి తండ్రి కోసం ఇద్దరు కుమారులు ఆస్పత్రిలోనే ఉన్నారు. కల్లు తాగే అలవాటున్న నారాయణకు 3 రోజులుగా ఆ పరిసరాల్లో ఎక్కడా కల్లు దొరక్కపోవడంతో శుక్రవారం పిచ్చిపిచ్చిగా ప్రవర్తించాడు. నిమ్స్ స్పెషాలిటీ, ఎమర్జెన్సీ బ్లాక్‌ల మధ్య రెండో అంతస్తును కలుపుతూ నిర్మించిన కనెక్టింగ్ ర్యాంప్‌పై నుంచి కిందకు దూకాడు. గాయాలపాలైన అతడిని నిమ్స్ అత్యవసర విభాగంలో చేర్పించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.

పదేళ్లు.. 20 వేల కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

కారుచౌకగా కేటాయించిందీ వివరాలను వెలికి తీస్తున్నట్లు చెబుతున్నారు. ఈ వివరాలన్నిటినీ ప్రజల ముందు పెట్టాలని, కేసీఆర్ పదేళ్ల పాలనలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూముల అమ్మకాన్ని ప్రధాన ఆదాయ వనరుగా ఎలా మార్చుకున్నదీ ప్రజలకు వివరించే ఆలోచన సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నట్లు చెబుతున్నారు. మరోవైపు, ఒక ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేటాయించిన భూములను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెనక్కి తీసుకుంటామని చెబితే రాష్ట్రానికి పరిశ్రమలు ఎలా వస్తాయని ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి వ్యాఖ్యలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేటీఆర్ వ్యాఖ్యలకు ఆదిలోనే చెక్ పెట్టాలని, అప్పుడు మాత్రమే హెచ్ఎండీఏ, టీజీఐఐసీ తదితర సంస్థల ద్వారా జరిగే ప్రభుత్వ భూముల అమ్మకాల పట్ల కొనుగోలుదారుల్లో నమ్మకాన్ని కలిగించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. లేకపోతే, ప్రభుత్వ ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రభుత్వ పెద్దలు భావిస్తునట్లు తెలుస్తోంది. వీటికితోడు, కేసీఆర్ పదేళ్ల పాలనలో జరిగిన ప్రభుత్వ భూముల అమ్మకాలు, పర్యావరణ విధ్వంసం తదితర వివరాలను బయటపెట్టి.. ఇప్పుడు ఆ భూములను ప్రభుత్వం వెనక్కు తీసుకోవచ్చా!? అంటూ బీఆర్ఎస్ నేతలను నిలదీయాలని ఆలోచిస్తున్నారు.

పదేళ్లలో రూ.20 వేల కోట్లకుపైగా ఆదాయం

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ప్రభుత్వ భూములను అమ్మేసి రూ.20 వేల కోట్లకుపైగా ఆదాయాన్ని ఆర్జించినట్లు ప్రభుత్వం లెక్కలు తీసింది. వీటిలో కోకాపేట, నియో పొలిస్ వంటి ప్రాంతాలు అత్యంత విలువైనవే కాకుండా అక్కడ కొండలు, గుట్టలు, చెట్లు, పొదలనూ తొలగించారని సమాచారం సేకరించింది. తన పాలనలో కేసీఆర్ కూడా రాష్ట్ర బడ్జెట్‌కు వాణిజ్య పన్నులు, లిక్కర్ అమ్మకాలతో పాటు ప్రభుత్వ భూముల అమ్మకాన్నే ప్రధాన ఆదాయ వనరుగా ఎంచుకున్నారంటూ గణాంకాలు సేకరించింది. 2015 నుంచి 2024 వరకు టీజీఐఐసీ భాగస్వామ్యంతోనూ, ప్రభుత్వమే నేరుగానూ సుమారు 342 ఎకరాల భూమిని వేలం వేసి.. రూ.9,031 కోట్ల మేరకు ఆదాయాన్ని సమకూర్చుకుందని నివేదిక సిద్ధం చేసింది. వాస్తవానికి, 650 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని వేలం పెట్టగా.. అందులో 342 ఎకరాల భూముల అమ్మకం మాత్రమే జరిగిందని, న్యాయపరమైన చిక్కులు, ఇతర కారణాలతో మిగిలిన భూమి అమ్మకం పెండింగ్‌లో పడిందని గుర్తు చేసింది. ఇక, 2018 నుంచి 2024 వరకు హెచ్ఎండీఏ ద్వారా ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేసి.. 1,445 ప్లాట్ల (7,81,612 చదరపు గజాలు)ను విక్రయించిందని, తద్వారా, రూ.11,875 కోట్ల మేరకు ఆదాయాన్ని సమకూర్చుకుందని సమాచారం సేకరించింది. వీటిలో కోకాపేట, నియో పొలిస్, బాచుపల్లి, మేడిపల్లి, మోకిల తదితర అత్యంత విలువైన భూములూ ఉన్నాయని పేర్కొంది. వెరసి, ప్రభుత్వ స్థలాల అమ్మకాల ద్వారా రూ.20,906 కోట్ల మేరకు ఆదాయాన్ని సమకూర్చుకుందని పేర్కొంది. హెచ్ఎండీఏ ద్వారా అమ్మిన ప్లాట్లలో ప్రభుత్వ భూములతోపాటు అసైన్డ్, ల్యాండ్ పూలింగ్ స్కీం ద్వారా సేకరించిన భూములూ ఉన్నాయి.

అన్నీ హాట్ కేక్ భూములే!

హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ద్వారా, ప్రభుత్వమే నేరుగానూ అవిష్మన భూములన్నీ బాగా డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనే ఉన్నాయి. కోకాపేట, గచ్చిబౌలి, బుద్వేలు, పుప్పాలగూడ, మణికొండ, నార్సింగి, నియో పోలిస్ వంటి ప్రైమ్ ఏరియాల్లోనే ఈ భూములున్నాయి. కోకాపేటలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి కేటాయించిన భూమి రూ.వందల కోట్లలో ఉంటుందని చెబుతున్నారు. ఇలా ప్రైమ్ ఏరియాల్లో ప్రభుత్వ భూములను తెగనమ్మిన బీఆర్ఎస్ నాయకత్వం.. ఆయా ప్రాంతాల్లో పర్యావరణకూ పాతరేసిందని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. అవసరానికి మించి ఆకాశ హర్మ్యాలను నిర్మించుకోవడానికి అనుమతులు ఇచ్చి పర్యావరణంతోపాటు కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలనూ సృష్టించారని తప్పుబడుతున్నారు. కోకాపేట వంటి ప్రాంతాల్లో అదనంగా పదుల అంతస్తుల్లో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి మరీ ప్రభుత్వ భూములను గత ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని గుర్తు చేస్తున్నారు. ఈ అంశాలన్నీ సవివరంగా ప్రజల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ పెద్దలు కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు.

నియోపోలీస్ చౌరస్తా వద్ద నిరుద్యోగుల ఆందోళన



ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

నార్సింగ్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కోకాపేట్ గుట్టలను నియోపోలీస్ పేరుతో వేలంపాటలో అమ్ముకొని బీఆర్ఎస్ పార్టీ నాశనం చేసిందని, ఆ వేలాన్ని రద్దు చేసి వాటిని కాపాడాలని కొంతమంది నిరుద్యోగులు కోకాపేట్ గుట్టపై మెరుపు ధర్నా చేశారు. శుక్రవారం మధ్యాహ్నం వీరంతా గంటపాటు నియోపోలీస్ గుట్టపై ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంచె గచ్చిబౌలి భూముల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఐటీ కంపెనీల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మాజీమంత్రి కేటీఆర్ వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కోకాపేట్ భూములను వేలం వేసినప్పుడు పర్యావరణంపై లేని ప్రేమ.. కంచె గచ్చిబౌలి భూములపై ఎందుకని వారు ప్రశ్నించారు. కోట్లాది రూపాయల ముడుపులు తీసుకొని రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములను కట్టబెట్టారని ఆరోపించారు. నిరుద్యోగుల కోసం ప్రభుత్వం చేస్తున్న పనులను అడ్డుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేలం వేసిన కోకాపేట్ నియోపోలీస్ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ఈకో పార్క్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి కేటీఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులతో నినాదాలు చేశారు.

రేవంత్‌రెడ్డి విధ్వంసాన్ని ఆపరేం?

- తెలంగాణలో బుల్డోజర్‌రాజ్‌ను పట్టించుకోరా?
- రాహుల్‌కు మాజీ మంత్రి హరీశ్ బహిరంగ లేఖ



హైదరాబాద్/ సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): "దేశవ్యాప్తంగా బుల్డోజర్ రాజ్‌ను వ్యతిరేకిస్తున్న మీరు తెలంగాణలో రేవంత్‌రెడ్డి విధ్వంసాన్ని ఆపరెందుకు? హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట పేద, మధ్యతరగతి ఇళ్లను కూలగొడుతూ.. బుల్డోజర్ పాలన చేస్తుంటే ఎందుకు పట్టించుకోరు రాహుల్‌జీ" అని మాజీమంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ మేరకు లోక్‌సభాపక్షనేత రాహుల్‌గాంధీకి శుక్రవారం ఆయన బహిరంగ లేఖరాశారు. రేవంత్ రెడ్డి వైఖరి కారణంగా కంచ గచ్చిబౌలిలోని వందల ఎకరాల్లో విధ్వంసం జరిగిందని, నెమళ్ల సహా ఇతర పక్షులు, జంతువులు తమ ఆవాసాలు కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గంపై ఆందోళన చేస్తున్న హెచ్‌సీయూ విద్యార్థులు, ప్రొఫెసర్లపై పోలీసులు లాఠీచార్జి చేయడం.. అందరినీ కలిచివేసిందన్నారు. "రోహిత్ వేముల ఆత్మహత్య సమయంలో హెచ్‌సీయూను సందర్శించిన మీరు.. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హెచ్‌సీయూ విద్యార్థులకు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నా. హెచ్‌సీయూ విషయంలో మీరు, మీ పార్టీ మౌనంగా ఉండడానికి కారణం తెలపాలని విద్యార్థులు, తెలంగాణ ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నా. పార్టీ ఫిరాయింపుల విషయంలో చట్టం తెస్తామని మీరు హామీ ఇవ్వగా.. ఇక్కడ మీ ముఖ్యమంత్రే ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. ఈ విషయాల్లో మీరు ఎందుకు మౌనంగా ఉంటున్నారు" అని రాహుల్‌గాంధీని ప్రశ్నించారు.

జింక రక్తపు మరకలు రాహుల్ చేతికే అంటాయి

- రేవంత్ చర్యలతో వృక్ష, జంతుజాలానికి నష్టం: కేటీఆర్

కంచ గచ్చిబౌలి భూముల్లో విధ్వంసం తర్వాత విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు.. ఓ జింకపై దాడి చేశాయని, తీవ్రంగా గాయపడిన జింకను హెచ్‌సీయూ విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది వెటర్నరీ ఆస్పత్రికి తరలించే సరికే మృత్యువాత పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జింక రక్తపు మరకలు రాహుల్ గాంధీ చేతికే అంటాయని 'ఎక్స్' వేదికగా ఆయన విమర్శించారు. కంచ గచ్చిబౌలి అటవీ ప్రాంతాన్ని రేవంత్‌రెడ్డి బుద్ధిహీనంగా ధ్వంసం చేయడం వల్ల విలువైన వృక్ష, జంతుజాలానికి నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో విధ్వంస పాలన: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం విధ్వంసకర పాలన సాగుతోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. కంచ గచ్చిబౌలి భూముల్లో నెమళ్లు అరుస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని, జింకలకు నిలువ నీడ లేకుండా చేస్తున్నారని, ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాశరథి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ జాగృతి రూపొందించిన "ఆ చల్లని సముద్ర గర్భం" దృశ్య గీతాన్ని ప్రసాద్ ల్యాబ్‌లో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రకృతి విధ్వంసానికి వ్యతిరేకంగా మరో ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

అటవీ భూముల కబ్జాకు కేరాఫ్ బీఆర్ఎస్:చామల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల కబ్జాకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ అని, గడిచిన పదేళ్లలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భూకబ్జాలకు పాల్పడ్డారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కంచ గచ్చిబౌలి భూములపై బీజేపీ, బీఆర్ఎస్ అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ చేసే అసత్య ప్రచారానికి బీజేపీ ఆజ్యం పోస్తోందన్నారు. కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లో పార్టీల్లో పాల్గొనేవారని, అందుకే ఆయనకు అక్కడ రాత్రివేళల్లో పులులు కనిపించి ఉంటాయని ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్న కిషన్ రెడ్డి మార్ఫింగ్ ఫొటోలను ఎలా పోస్టు చేశారని ప్రశ్నించారు.



శాంతి చర్చల కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలి

- ఎన్‌కౌంటర్లు, గాలింపు నిలిపివేయాలి
- ఇరువర్గాలు సాయుధ ఘర్షణను ఆపాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రతినిధులు
- జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన శాంతి చర్చల కమిటీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే, తాము శాంతి చర్చలకు సిద్ధమేనని సీపీఐ మావోయిస్టు పార్టీ ప్రకటించడంపై శాంతి చర్చల కమిటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఇదో మంచి పరిణామమని, ముఖ్యంగా మధ్య భారతంలోని ఆదివాసీ, గిరిజనులకు శాంతి లభించే దిశగా అడుగు ముందుకు పడినట్లేనని అభిప్రాయపడ్డారు. ఇరుపక్షాలు సాయుధ ఘర్షణలను ఆపాలని, కాల్పుల విరమణ ప్రకటించాలని విన్నవించారు. కేంద్రం శాంతి చర్చల దిశగా ముందుకు రావాలని కోరారు. శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారమిక్కడ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రధాన వక్తగా పాల్గొన్న ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ.. శాంతి చర్చలంటే కేవలం మావోయిస్టు పార్టీకి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రభుత్వం తన అధికారాన్ని ఇష్టానుసారంగా సమాజంపై ప్రయోగించడాన్ని నిరసించడమని స్పష్టం చేశారు. సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆదివాసీ, గిరిజనులపై సాగుతున్న దౌర్జన్యాలను నిలువరించడం, వారి మాన, ప్రాణాలను రక్షించుకోవాలన్న దృష్టికోణంతో శాంతి చర్చలు సాగాలని సూచించారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వెంటనే గాలింపు చర్యలు, ఎన్‌కౌంటర్లను నిలిపేయాలని కోరారు. శాంతి చర్చల దిశగా ముందుకు రావాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై అభిప్రాయాన్ని తెలపాలని పేర్కొన్నారు. తన ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకొని మావోయిస్టు పార్టీ శాంతి చర్చలపై సానుకూలత వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి, ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ అల్లం నారాయణ తదితరులు శాంతి చర్చల కమిటీ ప్రయత్నాన్ని స్వాగతించడంతో పాటు మద్దతు తెలిపారు. ఇరుపక్షాలతో చర్చించడానికి జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన శాంతి చర్చల కమిటీ ప్రతినిధులను ప్రకటించారు.

ఎప్పుడైనా ఉప ఎన్నికలు రావచ్చు

- పార్టీపరంగా సిద్ధంగా ఉందాం
- ఏ ఎన్నిక జరిగినా మనదే విజయం
- కంచ గచ్చిబౌలిలో సర్కారీ విధ్వంసం
- బుల్డోజర్లతో అమానుష చర్యలు
- దేశంలో బీజేపీ గ్రాఫ్ పడిపోతోంది: కేసీఆర్



ఎర్రవెల్లి నివాసంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్, చిత్రంలో కేటీఆర్, సబిత

హైదరాబాద్, గజ్వేల్/మర్కుక్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): "తాజా పరిణామాలు చూస్తుంటే ఉప ఎన్నికలు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. ఉప ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు. కాబట్టి.. పార్టీపరంగా సిద్ధంగా ఉందాం" అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ఏ ఎన్నిక జరిగినా బీఆర్ఎస్‌కు విజయం దక్కడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, పార్టీ అధ్యక్షులతో శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈనెల 27న వరంగల్‌లో చేపట్టనున్న భారీ బహిరంగ సభ ఏర్పాటు, జన సమీకరణ వంటి అంశాలపై గులాబీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని 400 ఎకరాల్లో కాంగ్రెస్ సర్కార్ విధ్వంసానికి పాల్పడుతోందని, పర్యావరణ పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న విద్యార్థుల పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. అక్కడి అటవీ భూముల్లో చెట్లను నరకడమే కాకుండా పక్షులు, జంతుజాలానికి ఇబ్బంది కలిగించేలా బుల్డోజర్లతో ప్రభుత్వం అమానుష చర్యలకు పాల్పడుతోందని, దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. "దేశంలో బీజేపీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభావం తగ్గిపోయి.. ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. భవిష్యత్తులో ఆ రెండు పార్టీలకు ఇబ్బందులు తప్పవు. అధికార పార్టీ స్వయంకృతాపరాధంతో ప్రజలకు దూరమవుతోంది. ఈ సమయంలో అప్రమత్తంగా ఉందాం. సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ.. ప్రజలకు దగ్గరగా ఉంటూ ముందుకు వెళ్దాం" అని పార్టీ నేతలకు సూచించారు. కాంగ్రెస్ నాయకుల మోసపూరిత మాటలు నమ్మి ఓటేశారని, వారి మాటలు మోసపూరితమని ప్రజలు ఇప్పుడు గుర్తిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమాన్ని తెలంగాణవ్యాప్తంగా పండుగలా జరపాలని, ప్రతి గ్రామం, వార్డు పరిధిలో పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు. వరంగల్ సభకు జనం అధిక సంఖ్యలో తరలివచ్చేలా దృష్టిసారించాలన్నారు. సభకు ప్రజల నుంచి భారీ స్పందన రావడం ఖాయమని, సభకు తరలి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు సూచించారు.

కేసీఆర్ సొంత మీడియాకే 348.43 కోట్లు!

2014 నుంచి 2023 దాకా ప్రభుత్వ ప్రకటనల్లో అగ్రభాగం వాటికేనన్న రాష్ట్ర ప్రభుత్వం

- 2016లో నమస్తే తెలంగాణ సర్క్యులేషన్ 8,94,626.. 2019లో 3,26,654కే పరిమితం
- సీఏ ధ్రువీకరించిన పత్రాలతో అడ్డగోలు టారిఫ్‌లు నిర్ణయించారనే భావన
- నిబంధనలను ఉల్లంఘించి రేటు పెంచుకున్నారంటున్న ప్రభుత్వ వర్గాలు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలన సమయంలో మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన మీడియా సంస్థలకు అడ్డగోలుగా ప్రభుత్వ ప్రకటనలను జారీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వారి ప్రచురణ, ప్రసార మాధ్యమాలకు 2014 నుంచి 2023 మధ్య ఏకంగా రూ.348.43 కోట్ల ప్రకటనలు ఇచ్చారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇందులో నమస్తే తెలంగాణకు రూ.182 కోట్లు, తెలంగాణ టుడేకు రూ.150 కోట్లు, టీ న్యూస్ చానల్‌కు రూ.16.43 కోట్లు ఉన్నట్టు వెల్లడించాయి. పత్రికల సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా టారిఫ్‌లను పెంచి, నిధులు చెల్లించారని ఆరోపించాయి.

లెక్కలన్నీ తీస్తామన్న లెక్కతో..

కేసీఆర్‌కు చెందిన ప్రచురణ, ప్రసార మాధ్యమాలకు గత పదేళ్లలో ఏమేరకు ప్రకటనలు ఇచ్చారో లెక్కలన్నీ తీస్తామని సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవలి శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించి ప్రభుత్వ వర్గాలు వివరాలను బయటపెట్టాయి. "2011 జూన్ 6న నమస్తే తెలంగాణ పత్రిక ప్రారంభం కాగా.. 2012 జూన్ 20న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పత్రికకు ప్రతి చదరపు సెంటీమీటర్‌కు రూ.875 టారిఫ్‌తో ప్రకటనలకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం ఆ పత్రికకు 4,90,423 సర్క్యులేషన్ ఉందని చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని పరిగణనలోకి తీసుకుంది. తర్వాత 2016లో జీవో నం.84 ద్వారా వివిధ పత్రికల ప్రకటనల రేటును బీఆర్ఎస్ ప్రభుత్వం సవరించింది. అప్పట్లో నమస్తే తెలంగాణ సర్క్యులేషన్ 8,94,626 కాపీలుగా సీఏ ధ్రువీకరణను పరిగణనలోకి తీసుకుని టారిఫ్ రేటును రూ.1,250కు పెంచింది. మళ్లీ 2019 జనవరి 10న రేట్లను సవరించింది. ఈసారి నమస్తే తెలంగాణ సర్క్యులేషన్ 3,26,654గా (ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్-ఏబీసీ ప్రకారం) తేల్చి టారిఫ్‌ను రూ.1,500కు పెంచింది." అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. బీఆర్ఎస్ పదేళ్ల పాలన కాలంలో సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా రూ.71.79 కోట్లు, ఇతర శాఖల ద్వారా రూ.57.97 కోట్లు, భూసేకరణ కోసం జిల్లా కలెక్టర్ల ద్వారా రూ.51.73 కోట్లు కలిపి రూ.182 కోట్లు నమస్తే తెలంగాణకు ప్రకటనల కోసం ప్రభుత్వం వెచ్చించిందని వెల్లడించాయి.

మిగతా సంస్థలకు కూడా..

ఒక పత్రికకు ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వాలంటే కనీసం 18 నెలల పాటు ఆ పత్రిక ప్రచురణలు వెలువడాలని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కానీ 2016 డిసెంబరు 15న ప్రారంభమైన తెలంగాణ టుడే పత్రికకు మూడు నెలలకే 2017 మార్చి 14న జీవో నం.682 ద్వారా ప్రకటనలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపిందని వివరించాయి. "ప్రారంభంలో తెలంగాణ టుడే పత్రిక సర్క్యులేషన్ 1,49,245గా ఉందన్న సీఏ ధ్రువపత్రం ఆధారంగా టారిఫ్‌ను రూ.1000గా నిర్ణయించారు. తర్వాత రెండేళ్లకే 2019 జనవరి 10న రూ.2000కు పెంచారు. తెలంగాణ టుడేకు 2019 నుంచి 2023 మధ్య రూ.150 కోట్ల ప్రకటనలు ఇచ్చారు. టీ న్యూస్ చానల్‌కు కూడా రూ.16.43 కోట్ల ప్రకటనలు ఇచ్చారు" అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నిబంధనలను ఉల్లంఘించి సొంత మీడియాకు ప్రకటనలు ఇచ్చుకున్నారని ప్రభుత్వం భావిస్తున్నట్టు పేర్కొన్నాయి. ఆ సమయంలో సీఎం కేసీఆర్ చేతుల్లోనే సమాచార శాఖ కూడా ఉందని గుర్తుచేశాయి. మొత్తంగా పదేళ్లలో ప్రభుత్వ ప్రకటనల కోసం 1,757 కోట్లను వెచ్చించగా.. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల మీడియా సంస్థలకే 38.4 శాతం నిధులు మళ్లించినట్లు తేలిందని వెల్లడించాయి. ఆ సంస్థల్లో కేసీఆర్ కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా పనిచేశారని వివరించాయి.



ఖమ్మం జిల్లా బోదులబండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

అర కిలో కోత పెట్టినా మిల్లర్లు జైలుకే..

- ధాన్యంలో తరుగు పేరిట రైతులను ఇబ్బంది పెడితే చర్యలు
- శ్రీరామనవమి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం: పొంగులేటి

నేలకొండపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంలో తరుగు పేరుతో అర కిలో తీసినా ఆ మిల్లర్లను నేరుగా జైలుకు పంపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. రైతుల పట్ల అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులను ఉపేక్షించబోమన్నారు. ఖమ్మం జిల్లాలోని బోదులబండలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ సభలో ఆయన మాట్లాడుతూ.. రైతులను తరుగు పేరిట ఇబ్బందులు పెట్టే మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో రేవంత్‌రెడ్డి సర్కారు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వాన్ని నడిపిన పెద్ద మనిషి రూ.7.19లక్షల కోట్ల అప్పులు చేసి పోయాడని, ఆయన చేసిన అప్పులు తీర్చుకుంటూ ఎన్నికల హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. శ్రీరామనవమి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం కట్టుకాచారంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, అనంతనగర్‌లో రూ2 కోట్లతో నిర్మిస్తున్న 33/11కేవీ విద్యుత్తు సబ్-స్టేషన్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.

పెరిగిన సీతారామ అంచనా వ్యయం

- 19,400 కోట్లకు ఆమోదం.. మళ్లీ టీఏసీకి డీపీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు అంచనాల సవరణకు ఆమోదముద్ర పడింది. దీన్ని తొలుత రూ.13057.98 కోట్లకు సవరించారు. తాజాగా ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు రూ.19400 కోట్లకు ఆమోదముద్ర వేశారు. కేంద్ర జలశక్తి శాఖకు చెందిన టెక్నికల్ అడ్వైజరీ కమిటీ(టీఏసీ)కూడా త్వరలోనే ఈ ప్రాజెక్టు డీపీఆర్‌పై సమావేశం కానుంది. గత ఫిబ్రవరి 11న టీఏసీ సమావేశం కాగా... ప్రాజెక్టు డిజైన్లను సమగ్రంగా పరిశీలించాలని, సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణ ప్రాంతం వద్ద భూకంప అధ్యయనాలు చేయాలని, ఇరిగేషన్ ప్లానింగ్ ప్రతిపాదనలు సమర్పించాలని సూచించింది.

'విజయ' పాల సేకరణ ధరల సవరణ

- గేదె పాలు ధర రూ. 85.. ఆవు పాల ధర రూ. 41.60

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ(విజయ డెయిరీ) పాల సేకరణ ధరలు సవరించింది. పాలల్లో ఉన్న వెన్న శాతం ఆధారంగా ధరలు నిర్ణయించింది. గేదె పాలు పోసే రైతులకు లీటరుకు రూ. 5 చొప్పున ధర పెంచింది. ఈ పెంపుతో 10 శాతం వెన్న ఉండే గేదె పాల ధర లీటరకు రూ. 80 ఉండగా.. ఇకమీదట రైతులకు రూ. 85 చెల్లించనున్నారు. 5 శాతం వెన్న ఉండే పాలకు లీటరుకు రూ. 42.50 పైసలు చెల్లించాలని డెయిరీ నిర్ణయించింది. గేదె పాల ఉత్పత్తి, సేకరణ దిశగా రైతులను మరింత ప్రోత్సహించేందుకే ధరలు పెంచినట్లు డెయిరీ జనరల్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. మరోవైపు ఆవు పాల ధరలను తగ్గించారు. 3 శాతం వెన్న ఉన్న ఆవు పాలకు లీటరుకు రూ. 37 చొప్పున, 4.5 శాతం వెన్న ఉన్న పాలకు లీటరుకు రూ. 41.60 పైసల చొప్పున రైతులకు చెల్లించనున్నారు. సవరించిన ధరలు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి వచ్చాయని, ప్రతి మూడు నెలలకోసారి పాల సేకరణ ధరలు సమీక్షించాలని నిర్ణయించామని విజయ డెయిరీ తెలిపింది.

టీజీ ఎప్‌సెట్ దరఖాస్తుకు ముగిసిన గడువు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్-2025కు దరఖాస్తు గడువు శుక్రవారంతో ముగిసింది. అయితే ఆలస్య రుసుం రూ.200తో ఈ నెల 8 వరకు, 500తో 14 వరకు, రూ.5 వేలతో 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి మొత్తం 2,91,965 దరఖాస్తులు అందగా, ఇందులో ఇంజనీరింగ్ స్ట్రీమ్ కోసం 2,10,567 మంది, అగ్రికల్చర్ స్ట్రీమ్ కోసం 81,172 మంది, రెండు స్ట్రీమ్‌ల కోసం 226 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. టీజీ ఎప్‌సెట్ అగ్రికల్చర్ పరీక్షలు ఏప్రిల్ 29, 30 తేదీల్లో, ఇంజనీరింగ్ పరీక్షలు మే 2 నుంచి 4వ తేదీ వరకు జరగనున్నాయి. టీజీ ఎప్‌సెట్‌కు గతేడాదికన్నా ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2024లో టీజీ ఎప్‌సెట్‌కు మొత్తం 3,54,786 మంది దరఖాస్తు చేసుకోగా, 2025 ఎప్‌సెట్‌కు గడువులోగా అందిన దరఖాస్తులు 2.92 లక్షలలోపే ఉండడం గమనార్హం. ఈ ఏడాది టీజీ ఎప్‌సెట్ పరీక్షలు రాసేందుకు ఏపీ అభ్యర్థులకు అవకాశం కల్పించకపోవడం వల్లే దరఖాస్తుల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది.

టీటీడీ సిఫారసు లేఖలకు ప్రత్యేక వెబ్‌సైట్

- ఆ పోర్టల్ ద్వారా జారీ చేసినవే చెల్లుబాటు
- లేఖల జారీకి ప్రజాప్రతినిధులకు ప్రత్యేక లాగిన్ ఐడీ

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు ప్రజాప్రతినిధులు సిఫారసు లేఖలు జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. http://cmottd.telangana.వెబ్‌సైట్n ద్వారా జారీ చేసిన సిఫారసు లేఖలు మాత్రమే ఇకపై తిరుమలలో చెల్లుబాటు అవుతాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శుక్రవారం పంపారు. సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుకు ప్రజాప్రతినిధులు వినియోగిస్తున్న లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌తోనే ఈ పోర్టల్‌లో లాగిన్ అయ్యేలా ఏర్పాటు చేశారు. తిరుమల దర్శనానికి ప్రజాప్రతినిధులు ఇచ్చే సిఫారసు లేఖలన్నింటినీ ఈ పోర్టల్ ద్వారానే ఇవ్వాలని సూచించారు. పోర్టల్‌లో నమోదు కాని లేఖలను టీటీడీ అంగీకరించదని స్పష్టం చేశారు. కాగా, ప్రజాప్రతినిధి తమ ఐడీతో పోర్టల్‌లో లాగిన్ అయ్యాక తాము ఎవరికి లేఖ ఇస్తున్నామో ఆ భక్తులు వివరాలు, వారికి ఏ రకమైన దర్శనం కావాలనే వివరాలు నమోదు చేయాలి. ఆపై సిఫారసు లేఖను డౌన్‌లోడ్ చేసి దానిపై సంతకం చేసి తిరిగి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చెయ్యాలి. ఇలా అప్‌లోడ్ చేసిన లేఖలు టీటీడీ లైజనింగ్ అధికారికి, లేఖ పొందిన భక్తులకు వాట్సాప్‌లో చేరుతాయి.

ఆందోల్‌లో జేఎన్‌టీయూ ఫార్మసీ పీజీ క్యాంపస్

- 15ఎకరాల భూమిని కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్‌లోని ఆందోల్ గ్రామంలో ఫార్మసీ పీజీ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 15 ఎకరాల భూమిని కేటాయించింది. ఫార్మసీ కళాశాలను మరింత విస్తరించాలన్న జేఎన్‌టీయూ ఉన్నతాధికారుల ప్రతిపాదన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా భూవికి సంబంధించిన డాక్యుమెంట్లను శుక్రవారం జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్ రెడ్డికి.. ఆందోల్ ఆర్డీవో పండు అందజేశారు. ఈ సందర్భంగా క్యాంపస్ కోసం ప్రభుత్వం నుంచి భూమి కేటాయించేందుకు సహకరించిన మంత్రి దామోదర రాజనర్సింహాకు వర్సిటీ ఉన్నతాధికారులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆందోల్‌లో ఫార్మసీ పీజీ క్యాంపస్ నిర్మాణానికి రూ.40 కోట్ల వ్యయమవుతుందని, ఆ నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి జేఎన్‌టీయూ నుంచి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకునేందుకు పోటీ

బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారు

అన్ని జిల్లాల్లోనూ నైపుణ్య శిక్షణ కేంద్రాలు: మంత్రి శ్రీధర్‌బాబు

వరంగల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్త పరిశ్రమలు తెచ్చి హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్, బీజేపీలు పోటీ పడి అడ్డుకుంటున్నాయని మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. జంతువులు, పక్షులంటే తమకు మాత్రం ప్రేమ లేదా అని అన్నారు. పర్యావరణం గురించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు 2019లో వరంగల్ అజంజాహిమిల్లులో పెద్ద పెద్ద చెట్లను నరికి పార్టీ సభ పెట్టినప్పుడు గుర్తుకు రాలేదా అని మంత్రి ప్రశ్నించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర యువత భవిష్యత్తుకు పరిశ్రమలు తీసుకొచ్చి, లక్షలాది మందికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే.. అడ్డుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. యువతలో నైపుణ్యాన్ని పెంచేందుకు 33 జిల్లాల్లోనూ నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివిన విద్యార్థులు 25 లక్షల నుంచి 30 లక్షల మంది వరకు ఉన్నారని, వారందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని వెల్లడించారు. నిరుద్యోగులకు ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా ఉపాధి కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారన్నారు. దీంతో పాటు డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీనిలో నిరుద్యోగులు తమ అర్హతలతో నమోదు చేసుకుంటే.. వివిధ కంపెనీలు తమకు కావాల్సిన వారిని నేరుగా ఎంపిక చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలు కంపెనీలకు ఎంపికైన వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలు విద్యార్థులకు..

భవిష్యత్తు కల్పించాలి

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను బోధించాలి.. పెద్దగా ప్రాధాన్యం లేని వాటిని రద్దు చేయాలి

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలన్నీ విద్యార్థులు కేంద్రంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. యూనివర్సిటీల్లో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కోర్సులు ఉండాలని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి, ఆర్థిక స్థోమత లేని కుటుంబాల నుంచే విద్యార్థులు వస్తున్నారని, వారికి సరైన భవిష్యత్తు కల్పించేలా బోధన ఉండాలని అన్నారు. ఆర్థిక స్థోమత ఉన్న కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకొని ప్రైవేట్ యూనివర్సిటీల వైపు వెళ్తున్నారని తెలిపారు. వారితో ఎదురయ్యే పోటీని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఎదుర్కోవాలంటే డిమాండ్ ఉన్న కోర్సులనే బోధించాలని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పలు యూనివర్సిటీల్లో పెద్దగా ప్రాధాన్యం లేని కోర్సులను బోధిస్తున్నారని, వాటిని రద్దు చేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. ఆయా కోర్సులకు చెందిన ప్రొఫెసర్లకు అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలు అప్పగించాలన్నారు. యూనివర్సిటీలను కొందరు ప్రొఫెసర్లకు పునరావాస కేంద్రాలుగా మార్చవద్దని అన్నారు. ఈ సందర్భంగా వీసీలకు తమ వర్సిటీల్లో ప్రొఫెసర్ల కొరత, భవనాలు, ఇతర వసతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకురాగా.. వర్సిటీల అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వీసీలంతా వర్సిటీలవారీ సమస్యలు, ఉమ్మడి సమస్యలపై ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావుతో సమావేశమై చర్చించాలని, తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు.



విద్యా కమిషన్‌పై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో కేకే, వేం నరేందర్‌రెడ్డి, అధికారులు

జీవన నైపుణ్యాలు పెంపొందించాలి

రాష్ట్రంలో మెరుగైన విద్యావ్యవస్థ ఏర్పాటు కోసం సమగ్ర విధాన పత్రం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. విద్యా కమిషన్‌ను ఆదేశించారు. ఉత్తమ విద్యావ్యవస్థ కోసం ఎంత ఖర్చయినా వెనుకాడబోమని ప్రకటించారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల స్థాయిలో తీసుకురావాల్సిన మార్పులపై రూపొందించే విధాన పత్రం విషయంలో వివిధ సంఘాలు, ప్రముఖులతో చర్చించాలని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని, విద్యా వ్యవస్థలో తెలంగాణ అగ్రగామిగా ఉండేందుకు దోహదపడేలా సూచనలు, సలహాలు ఉండాలని అన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో లోపాలు, తీసుకురావాల్సిన సంస్కరణలపై శుక్రవారం పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం, ఉపాధ్యాయుల నియామకం, అమ్మ ఆదర్శ కమిటీలు, పుస్తకాలు, యూనిఫారాల పంపిణీతోపాటు యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, యంగ్‌ఇండియా స్కిల్ వర్సిటీల నిర్మాణాల గురించి సీఎం వివరించారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అద్దం పట్టేలా విధానపత్రం ఉండాలని, అదే సమయంలో ఆచరణ సాధ్యమయ్యేలా ఉండాలని సూచించారు. ప్రాథమిక దశలో అందే విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది బలంగా పడుతుందని, ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తే ఉన్నత చదువుల్లో విద్యార్థులు మెరుగ్గా రాణించగలరని పేర్కొన్నారు. కాగా, ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ప్రాథమిక విద్యలో అనుసరిస్తున్న విధానాలను విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యావ్యవస్థలో మార్పులకు పరీక్షల విధానం, పాఠశాలల్లో తనిఖీలు, జీవన నైపుణ్యాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రధాన కార్యదర్శి జయప్రకాశ్ నారాయణ వెల్లడించారు.

సీతారాముల కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కల్యాణం ప్రారంభమవుతుండగా... ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్‌రెడ్డి స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. కాగా, భద్రాద్రి రాముడికి ముఖ్యమంత్రి అధికారికంగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఒకే ఒక్క సారి జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకే ఒక్కసారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. నిరుడు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ... పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ముఖ్యమంత్రి సహా ఇతర ప్రజాప్రతినిధులెవరూ పాల్గొనలేదు. దశాబ్దం తర్వాత సీతారాముల కల్యాణోత్సవానికి సీఎం రేవంత్ అధికారికంగా హాజరవుతున్నారు.

8న అహ్మదాబాద్‌కు సీఎం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 8న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు వెళ్లనున్నారు. రెండు రోజుల పాటు అక్కడ జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల్లో సీఎం పాల్గొననున్నారు. ఈ సమావేశాల తొలిరోజు దాదాపు 169 మంది పాల్గొంటారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఇక రెండో రోజు ఈ నెల 9న ఏఐసీసీ సభ్యులు, ఎంపీలు, వివిధ రాష్ట్రాల మంత్రులు, సీనియర్ నేతలు కలిసి 1725 మందితో ఏఐసీసీ సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. కాగా, ఎన్నికల్లో గెలిచేందుకు ఐదేళ్లపాటు కష్టపడాలని డీసీసీ అధ్యక్షులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. ఆరు నెలలు, ఏడాదిపాటు పనిచేస్తే సరిపోదని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడాలని, రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర తరహాలో ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. శుక్రవారం వివిధ రాష్ట్రాలకు చెందిన 302 మంది డీసీసీ అధ్యక్షులు సమావేశానికి హాజరయ్యారు.

'రాయలసీమ'పై న్యాయ పోరాటమే

- 'గోదావరి-బనకచర్ల'పైనా సుప్రీంకు
- అనుమతి లేని వాటిని అడ్డుకుందాం
- భద్రాచలం చుట్టూ రక్షణ గోడకు కేంద్ర సాయం కోరదాం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల అనుసంధానంతోపాటు రాయలసీమ ఎత్తిపోతల పథకంపై న్యాయ పోరాటం చేయాలని, ఇందుకు సుప్రీం కోర్టును ఆశ్రయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. జలసౌధలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నీటి ఒప్పందాలను ఉల్లంఘిస్తూ ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న ఈ ప్రాజెక్టులను అడ్డుకోవాలని అన్నారు. ఈ ప్రాజెక్టులతో తెలంగాణలో సాగు, తాగునీటి అవసరాలపై తీవ్ర ప్రభావం పడనుందని పునరుద్ఘాటించారు. వీటిపై మున్ముందు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించడానికి వీలుగా న్యాయ నిపుణులు, నీటిపారుదల శాఖ స్టాండింగ్ కౌన్సెల్, అడ్వకేట్ జనరల్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం దేశ అత్యున్నత న్యాయస్థానంలో గట్టిగా పోరాడాలని అధికారులకు నిర్దేశించారు. రాయలసీమకు 200 టీఎంసీలను తరలించడానికి రూ.80 వేల కోట్లతో ఏపీ ప్రతిపాదించిన గోదావరి-బనకచెర్ల ప్రాజెక్టు 1980 నాటి గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ అవార్డుకు, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014కు వ్యతిరేకమని తెలిపారు. గోదావరి-కృష్ణాపై ఏ ప్రాజెక్టును చేపట్టాలన్నా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం సీడబ్ల్యూసీ క్లియరెన్స్ తీసుకొని, గోదావరి, కృష్ణా బోర్డులతో డీపీఆర్‌లను పరిశీలన చేయించుకోవాల్సి ఉంటుందని, తర్వాత అపెక్స్ కౌన్సిల్ అనుమతి తీసుకోవాలని, కానీ, ఏ అనుమతులు లేకుండా ప్రాజెక్టును ఏపీ ముందుకు తీసుకెళుతోందని తెలిపారు. ఇక, శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి నీటిని తరలించడానికి వీలుగా చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకంపై గతంలోనే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశామని, నిరంతర ప్రయత్నాల ఫలితంగా పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిపుణుల అంచనాల కమిటీ గత ఫిబ్రవరిలో ప్రాజెక్టు వద్ద పూర్వస్థితిని పునరుద్ధరించాలని ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఎన్జీటీ, సుప్రీంకోర్టుతో పాటు ఇతర చోట్ల తెలంగాణ అభ్యంతరాల వల్లే రాయలసీమకు పర్యావరణ అనుమతి రాలేదన్నారు. అయినా, ఇతర మార్గాల ద్వారా ప్రాజెక్టు నిర్మాణం చేపడుతోందని, దీన్ని చూస్తూ ఊరుకోమని, అక్రమ ప్రాజెక్టులపై సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ముంపు బారిన పడకుండా భద్రాచలం చుట్టూ రక్షణ గోడ నిర్మాణానికి కేంద్ర సహాయాన్ని కోరుతామని చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, సత్వర నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రిజర్వాయర్లలో పూడికతీత పనులకు త్వరలో టెండర్లు పిలవాలని ఆదేశించారు.

ఉద్యోగాలిస్తేనే రాష్ట్ర ఏర్పాటుకు సార్థకత

చదువుకున్న ప్రతి బిడ్డకు ఉపాధి అవకాశాలు.. రూ.9వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం అమలు

- 112 మంది 'యాదాద్రి' నిర్వాసితులు, 51మంది డీఏవోలకు నియామక పత్రాలు



యాదాద్రి పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులకు నియామకపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగాలు ఇస్తేనే... తెలంగాణ ఏర్పాటుకు సార్థకత, అర్థం, పరమార్థం ఉంటుందన్న ఆలోచనతో ప్రజాప్రభుత్వం ముందుకెళ్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. చదువుకున్న ప్రతి బిడ్డకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాలన్నదే తమ అభిమతమని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని ఆశించే వారి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు చెందిన 112 మంది భూనిర్వాసితులకు జెన్‌కోలో ఉద్యోగాలు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వారితోపాటు డివిజనల్ అకౌంట్స్ అధికారులుగా ఎంపికైన 51 మందికి మాదాపూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో భట్టి నియామకపత్రాలు ఇచ్చారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ భూనిర్వాసితులకు ఉద్యోగాలిస్తామని గత పాలకులు చెప్పినా కార్యరూపం దాల్చలేదని గుర్తు చేశారు. పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్, తాను సమష్టిగా ఆలోచించి,భూనిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇచ్చిన మాటప్రకారం ఇప్పుడు 112మందికి నియామక పత్రాలు ఇచ్చామన్నారు. ఇదే సందర్భంలో ఆర్థికశాఖలో 51 మంది డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వ పాలనలో 59,000 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించి, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించామన్నారు. ఉద్యోగాలు పొందలేని యువత కోసం రూ.9,000కోట్లతో స్వయం ఉపాధి పథకాలు అందించడానికి రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించామన్నారు. లబ్ధిదారుల ఎంపిక నుంచి గ్రౌండింగ్ వరకు క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించామని, నిర్దిష్ట వ్యవధిలో పథకాన్ని అమలుచేస్తామని ప్రకటించారు. ఇటీవల దావోస్‌లో రూ.1.80లక్షలకోట్ల పెట్టుబడులకు సీఎం రేవంత్‌ఎంవోయూ చేసుకున్నారని, రానున్న రోజుల్లో ఆయా సంస్థల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. హైదరాబాద్ విస్తరణలో భాగంగానే ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి పూనుకున్నామన్నారు. అభివృద్ధిలో దేశం, ప్రపంచంతో తెలంగాణ పోటీ పడుతోందన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తూనే పెట్టుబడి వ్యయం అధికంగా వెచ్చించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని పేర్కొన్నారు. "నేను 4 నెలల్లోనే పదవీ విరమణ చేసేవాడిని. మీరు 35 ఏళ్ల సర్వీసులో ఉంటారు. ప్రజలకు సేవలందించేందుకు పునరంకితం కావాలి" అని సూచించారు.

రేపు సన్న బియ్యం లబ్ధిదారుల ఇంట్లో భోజనం

- ప్రజాప్రతినిధులందరూ పాల్గొనాలి
- భద్రాచలంలో లబ్ధిదారుడి ఇంటికి వెళ్లనున్న సీఎం: మంత్రి ఉత్తమ్ వెల్లడి
- శుక్రవారం సూర్యాపేటలో ఓ లబ్ధిదారు ఇంట్లో భోజనం చేసిన మంత్రి



సూర్యాపేటలో సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న మంత్రి ఉత్తమ్, కలెక్టర్ తేజస్‌నందలాల్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగ (ఆదివారం) రోజున మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు సన్న బియ్యం లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. అదేరోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి... భద్రాచలంలో సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తారని తెలిపారు. సచివాలయంలో శుక్రవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని సూచించారు. "సన్నబియ్యం సరఫరాలో ఎలాంటి అవకతవకలు జరగనివ్వొద్దు. గోదాముల నుంచి బియ్యం రవాణా, రేషన్ షాపుల నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచేయాలి. ప్రజల నుంచి ఏమైనా ఫిర్యాదులుంటే పరిష్కరించాలి. ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం చేరేలా చర్యలు తీసుకోవాలి. డీలర్లుగానీ, అధికారులు గానీ ఏమైనా అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. గతంలో సంవత్సరానికి రూ.10,665 కోట్లు ఖర్చుపెట్టి దొడ్డు బియ్యం పంపిణీ చేసినా ప్రభుత్వం ఆశించిన మేరకు ప్రయోజనం కలగలేదని, రేషన్ బియ్యం పక్కదారి పట్టిందని ఆరోపించారు. ఇప్పుడు రూ.13వేల కోట్లు వెచ్చించి 30 లక్షల టన్నుల సన్న బియ్యాన్ని పేదలకు అందిస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సభ్యుల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, అర్హులైన పేదలందరినీ లబ్ధిదారులుగా నమోదు చేస్తామని ప్రకటించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక 'సన్న బియ్యం'తో లబ్ధి పొందే కుటుంబాల సంఖ్య కోటి దాటుతుందని పేర్కొన్నారు. కాగా, మంత్రి ఉత్తమ్ శుక్రవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రెండో వార్డులో సన్న బియ్యం లబ్ధిదారు పాలడుగు శ్రీనివాస్ ఇంట్లో భోజనం చేశారు. ఇక నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం సన్న బియ్యం లబ్ధిదారులైన వల్లాల లక్ష్మమ్మ, సైదులు దంపతుల ఇంట్లో భోజనం చేశారు.



బాధితులకు రికవరీ చెక్కులను అందజేస్తున్న సీపీ సీవీ ఆనంద్. చిత్రంలో డీసీపీ ధార కవిత, ఏసీపీ శివమారుతి

కన్నీరే ఆనందబాష్పాలై..

- సైబర్ వలకు చిక్కి లక్షలు పోగొట్టుకున్న బాధితులు
- వెంటనే ఫిర్యాదు చేసిన కేసులకు సంబంధించి రూ.3.75 కోట్లు రికవరీ చేసిన సైబర్ క్రైం పోలీసులు
- కోర్టు అనుమతితో 55 మంది బాధితులకు చెక్కులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయనో, రుణాలిప్పిస్తామనో, క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని ఓటీపీ చెప్పాలనో ప్రలోభపెట్టడం ద్వారా.. డ్రగ్స్ పార్శిల్ దొరికిందనో, మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారని బెదిరించడం ద్వారానో ఎంతోమంది అమాయకులను సైబర్ నేరగాళ్లు నిండా ముంచుతున్నారు. అయితే తాము మోసపోయామని వెంటనే గుర్తెరిగి.. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదుచేస్తే వారు పోగొట్టుకున్న డబ్బు రికవరీ అయ్యే అవకాశాలెవక్కువగా ఉంటాయి. ఇలా ఫిర్యాదులొచ్చిన వివిధ కేసులకు సంబంధించి సాంకేతిక ఆధారాల ప్రకారం సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లోని డబ్బును ఫ్రీజ్ చేసి బాధితుల కళ్లలో ఆనందాన్ని నింపారు పోలీసులు. ఇటీవల కాలంలో నమోదైన 55 కేసుల్లో రూ. 3.75 కోట్లు రికవరీ చేసి కోర్టు అనుమతితో బాధితుల ఖాతాల్లో జమ చేశారు. సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ రికవరీ చెక్కులను బాధితులకు అందజేశారు. కాగా సైబర్ క్రిమినల్స్ చేతికి చిక్కి డబ్బులు పోగొట్టుకుంటున్న బాధితులు.. సకాలంలో స్పందించి మొదటి గంటలోపు (గోల్డెన్ అవర్) పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుందని సీపీ పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో ఎన్‌ఆర్‌ఐ మహిళ

- రూ.13.29 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆమె ఓ ఎన్‌ఆర్‌ఐ (44)! సెలవులు రావడంతో హైదరాబాద్‌కొచ్చి సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి లక్షల్లో డబ్బు సమర్పించుకుంది. తాము టెలికం సంస్థ నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు.. మహిళల అక్రమ రవాణా కేసుకు సంబంధించి డబ్బు ఆమె ఖాతాలో జమైందని, ఆ ఖాతా నుంచి విదేశాలకు అక్రమంగా డబ్బు తరలిందని, పైగా ఆమె ఫోన్ నుంచి అసభ్య సందేశాలు వెళ్లాయని, దీనికి సంబంధించి ఢిల్లీ పోలీసులు కేసు కూడా నమోదు చేశారని చెప్పడంతో హడలెత్తిపోయింది. కొద్దిసేపటికి సీబీఐ అధికారినంటూ ఓ సైబర్ నేరగాడు వీడియో కాల్ చేసి డిజిటల్ అరెస్ట్ అయ్యారంటూ ఆమెను బెదిరించాడు. అయితే ఇందులోంచి బయటపడేందుకు మార్గం ఉందని.. ఖాతాలో ఉన్న డబ్బంతా ఆర్బీఐ ఖాతాకు పంపితే వెరిఫై చేసి రెండ్రోజుల్లో మళ్లీ ఖాతాకు క్రెడిట్ చేస్తామంటూ నమ్మబలికాడు. అవలి వ్యక్తి మాటలకు భయపడిపోయిన ఆమె, తన ఖాతాలో ఉన్న రూ.13.29 లక్షలను సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాకు బదిలీచేసింది. తర్వాత వారిని సంప్రదించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేసింది.

క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి



వినయ్(ఫైల్)

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో కుప్పకూలి ప్రాణాలు వదులుతున్న చిన్న వయస్కుల సంఖ్య రోజురోజుకి పెరుగుతూ ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి శుక్రవారం క్రికెట్ ఆడుతూ గుండెనొప్పితో కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. సీఎంఆర్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న ఖమ్మం జిల్లాకు చెందిన వినయ్ తమ కళాశాల మైదానంలోనే మరణించాడు. కళాశాల విద్యార్థుల కథనం ప్రకారం.. వినయ్, ఇతర స్నేహితులు శుక్రవారం సాయంత్రం కళాశాల మైదానంలో క్రికెట్ ఆడారు. ఏమైందో తెలియదు కానీ.. ఆటలో భాగంగా ఫీల్డింగ్ చేస్తున్న వినయ్.. ఛాతీలో నొప్పితో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి విద్యార్థులు, స్నేహితులు వినయ్‌ను హుటాహుటిన సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానీ, వినయ్ అప్పటికే మరణించాడని అక్కడి వైద్యులు నిర్ధారించారు.

బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రిలో ప్రత్యేక పరిశోధన కేంద్రం



బసవ తారకం క్యాన్సర్ సెంటర్‌లో ప్రత్యేక పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలకృష్ణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి-రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో క్యాన్సర్‌పై పరిశోధనలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ, ప్రొఫెసర్ డాక్టర్ కె. శ్రీనాథ్ రెడ్డి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. అమెరికాకు చెందిన ప్రవాసాంధ్ర దంపతులు డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, కల్యాణి ఈ కేంద్రానికి రూ. 10 కోట్లు అందించారు. దీంతో ఈ కేంద్రానికి కల్యాణి ప్రసాద్ క్యాన్సర్ రీసెర్చి సెంటర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. పాతికేళ్లు పూర్తి చేసుకొని రజతోత్సవాలను జరుపుకొంటున్న వేళ ప్రత్యేక పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషాన్నిస్తోందన్నారు. దీన్ని ఏర్పాటుకు భారీ విరాళాన్ని అందించిన డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, కల్యాణి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ నిర్వహించే పరిశోధనలు దేశంలోని క్యాన్సర్ రోగులకు సాంత్వన కలిగిస్తాయని ఆశిస్తున్నట్లు వివరించారు.

బర్డ్ ఫ్లూపై రంగంలోకి కేంద్రం

- జీవభద్రత నిబంధనలు కఠినతరం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ సహా దేశవ్యాప్తంగా ఆరు జోన్లలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో.. జీవభద్రత నిబంధనలను కేంద్రం కఠినతరం చేసింది. శుభ్రతను పాటించాలని, పౌల్ట్రీ ఫారాల్లోకి ఎవరు పడితే వారు ప్రవేశించకుండా చూసుకోవాలని, నెలరోజుల్లోగా సంబంధిత అధికారుల వద్ద తప్పనిసరిగా పౌల్ట్రీ ఫారాల వివరాలు నమోదుచేసుకోవాలని పౌల్ట్రీ యజమానులకు సూచించింది. దీనిపై కేంద్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ శుక్రవారం అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించి, ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. మన ఆహార భద్రతను, గ్రామీణ ప్రాంతాల జీవనోపాధికి.. పౌల్ట్రీ రంగాన్ని కాపాడుకోవడం కీలకమని ఆమె పేర్కొన్నారు. "ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ ఈసారి ఒక జాతి జీవాల నుంచి మరో జాతి జీవాలకు కూడా సోకుతోంది. కోళ్లకే పరిమితం కాక.. అడవి పక్షులకు, కొన్ని ప్రాంతాల్లో పిల్లిజాతి జీవాలకు కూడా సోకుతోంది" అని సీనియర్ అధికారి ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని ఓ పౌల్ట్రీఫామ్‌లో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన నేపథ్యంలో గురువారం 10 వేల కోళ్లను చంపేసిన వైద్యబృందం.. శుక్రవారం మరో 6 వేల కోళ్లను చంపి, లోతైన గోతిలో పాతిపెట్టింది. కోళ్ల కోసం తీసుకొచ్చిన 5 టన్నుల దాణాతోపాటు, బర్డ్ ఫ్లూ సోకిన కోళ్లు పెట్టిన 14 వేల గుడ్లను సైతం వారు పగలగొట్టి అదే గోతిలో పారబోసి పూడ్చేశారు. ఫామ్ చుట్టూ సున్నం చల్లి శానిటైజ్ చేశారు. ఫామ్‌లోని ఐరన్ జాలీలను మంటతో శుద్ధి (ఫ్యూమిగేషన్) చేశారు.

గ్రూప్-1 నియామకాలకు లైన్ క్లియర్

- జీవో 29పై పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు
- గతంలోనే తిరస్కరించామని గుర్తు చేసిన ధర్మాసనం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రూప్-1 ఉద్యోగాల నియామకాలకు మార్గం సుగమం అయింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 29ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. జీవో 29ను రద్దు చేయాలంటూ సూరేపల్లి శ్రీనివాస్ ఫిబ్రవరి 17న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పునకు పూర్తి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 29ని తీసుకొచ్చిందని పిటిషన్‌లో తెలిపారు. దీని వల్ల రాష్ట్రంలో వేలాది మందికి నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్ పి.శ్రీనరసింహ, జస్టిస్ జె.బాగితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే జీవో 29పై గతంలోనే పిటిషన్లు దాఖలయ్యాయని, వాటిని సుప్రీంకోర్టు తిరస్కరించిందని ధర్మాసనం గుర్తు చేసింది. గ్రూప్-1కు సంబంధించి నియామక ప్రక్రియ చివరి దశలో ఉందని, ఈ దశలో అందులో జోక్యం చేసుకోలేమని తెలుపుతూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

కాంగ్రెస్ నేతకు గుండెపోటు

- సీపీఆర్ చేసి కాపాడిన ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటనలో గుండెపోటుకు గురైన ఓ కాంగ్రెస్ నేతకు ఎమ్మెల్యే డాక్టరు తెల్లం వెంకట్రావు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. శుక్రవారం మంత్రి తుమ్మల భద్రాచలం పర్యటనకు వచ్చారు. ఆ పర్యటనలో వారి వెంట ఉన్న దుమ్ముగూడెం మండలం లచ్చిగూడెంకు చెందిన కాంగ్రెస్ నేత తోటమళ్ల సుధాకర్‌కు గుండెపోటు వచ్చింది. అక్కడే ఉన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వెంటనే సుధాకర్‌కు సీపీఆర్ చేశారు. అనంతరం సుధాకర్‌ను ఆస్పత్రికి తరలించారు. వైద్యులు గుండె రక్తనాళాల్లో రెండు స్టెంట్లు వేశారు. సుధాకర్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఎమ్మెల్యే సీపీఆర్ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా, ఆయనకు నెటిజన్లు, కాంగ్రెస్ శ్రేణుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



కాంగ్రెస్ నేత సుధాకర్‌కు సీపీఆర్ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

మహిళలకు డ్రోన్లు!

పంటలకు మందుల పిచికారీలో వినియోగం.. కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయం

- 10 లక్షల డ్రోన్ కొనుగోలుకు 80 శాతం సబ్సిడీ
- డ్రోన్ల నిర్వహణపై మహిళలకు శిక్షణ
- 'నమో డ్రోన్ దీదీ' పథకం కింద తర్ఫీదు
- సంగారెడ్డి జిల్లా జోగిపేటలో తొలిసారి ట్రైనింగ్

జోగిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అన్నిరంగాల్లో అవకాశాలు కల్పించి ప్రోత్సహించే దిశగా చర్యలు చేపడుతున్న ప్రభుత్వాలు.. డ్రోన్లను ఆపరేట్ చేయడంలోనూ వారికి శిక్షణ ఇస్తున్నాయి. పంట పొలాల్లో పురుగు మందులను పిచికారీ చేసేందుకు డ్రోన్లను వినియోగించడంపై మహిళలకు తర్ఫీదునిస్తున్నాయి. అంతేకాదు.. 80 శాతం సబ్సిడీ ఇస్తూ మహిళలు వాటిని కొనుగోలు చేసేందుకూ అవకాశం కల్పిస్తున్నాయి. పంటలకు పురుగు మందుల పిచికారీలో అధునాతన ఆవిష్కరణ అయిన డ్రోన్‌ను వినియోగించాలని శాస్త్రవేత్తలు నిర్ణయించిన నేపథ్యంలో.. ఇందులో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలను భాగస్వాములను చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'నమో డ్రోన్ దీదీ' పేరిట పథకాన్ని చేపట్టింది. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ ఇచ్చి ఆదాయం లభించేలా చేయడం, వ్యవసాయంలో సాంకేతికత, యాంత్రీకరణ ద్వారా పని భారాన్ని, పెట్టుబడి వ్యయాన్ని గణనీయంగా తగ్గించడమే ఈ పథకం ఉద్దేశం. ఇందులో భాగంగా రాష్ట్రంలోనే తొలిసారిగా సంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హెటిరో గ్రూప్ సౌజన్యంతో మహిళలకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. జోగిపేటలోని మహిళా సమాఖ్య భవనంలో 9 రోజులపాటు డ్రోన్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఫ్లయింగ్ వెడ్జ్ (డ్రోన్ ఆపరేటింగ్), సింక్రో (టెక్నికల్ సపోర్ట్) అనే రెండు సంస్థల సహకారంతో హెటిరో డ్రగ్స్ పరిశ్రమ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లాలోని 10 మండలాలకు చెందిన 50 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. మార్చి 20న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి శిక్షణను ప్రారంభించారు. మార్చి నెలాఖరు వరకు కొనసాగిన ఈ శిక్షణలో డ్రోన్ ఫ్లయింగ్‌పై సైద్ధాంతిక, ఆచరణాత్మక శిక్షణ ఇచ్చారు. తొమ్మిది రోజుల శిక్షణలో తొలుత డ్రోన్ గురించి పూర్తి పరిజ్ఞానాన్ని మహిళలకు వివరించారు. అనంతరం పంట పొలాల వద్దకు తీసుకెళ్లి.. డ్రోన్ ఎగురవేయడంపై క్షేత్రస్థాయిలో తర్ఫీదు ఇచ్చారు.



డ్రోన్ ఎగురవేయడంపై మహిళలకు శిక్షణనిస్తున్న శిక్షకులు

80 శాతం సబ్సిడీతో డ్రోన్లు..

'నమో డ్రోన్ దీదీ' పథకం కింద శిక్షణ పొందిన మహిళలకు డ్రోన్ కొనుగోలు చేసే అవకాశం కూడా ప్రభుత్వం కల్పిస్తోంది. రూ.10 లక్షల విలువైన డ్రోన్‌ను బ్యాంకు రుణం ద్వారా కొనుగోలు చేసే వీలు కల్పిస్తూ.. అందులో 80 శాతం సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వనున్నాయి. మిగిలిన రూ.2 లక్షల రుణ మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కాగా, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి చొరవ చూపి ప్రభుత్వ నిధులతో 10 డ్రోన్లను కొనుగోలు చేసి వాటి ద్వారా మహిళలకు శిక్షణ ఇప్పించారు. శిక్షణలో పాల్గొన్న వారి నుంచి ఔత్సాహికులైన 20 మంది మహిళలను ఎంపిక చేసి ఈ డ్రోన్‌లను వారికి ఇవ్వనున్నారు. ఒక్కో డ్రోన్ ద్వారా ఒకరు ఆపరేటర్‌గా, మరొకరు సహాయకురాలిగా వ్యవహరిస్తూ ఇద్దరు మహిళలు ఉపాధి పొందే వీలుంటుంది. డ్రోన్లతో పండ్ల తోటలు, కూరగాయల సాగు, పత్తి, లాంటి పంటలకూ మందులు పిచికారీ చేయడం, ద్రవరూపంలోని ఎరువులు వేయవచ్చు. దీంతో ఏడాది పొడవునా పనులు దొరుకుతాయి. కాగా, డ్రోన్ నడపడం ఎంతో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని శిక్షణ పొందిన బేగరి అనిత అనే మహిళ అన్నారు. డ్రోన్ నడపడం ద్వారా.. దానికోసం తీసుకున్న రుణం వాయిదా, ఖర్చులు పోను నెలకు రూ.లక్ష దాకా ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు.

'హైదరాబాద్ ఎమ్మెల్సీ'కి తప్పని పోరు!

(మొదటి పేజీ తరువాయి)

లెక్కింపు జరుగుతాయి. ఈ ఎమ్మెల్సీ స్థానం పరిధిలో కార్పొరేటర్లతోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కలిపి 112 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ఎంఐఎంకు 40 మంది కార్పొరేటర్లు, ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్సీ, ఏడుగురు ఎమ్మెల్యేలు కలసి 49 మంది ఓటర్లున్నారు. బీజేపీకి రాజ్యసభ సభ్యుడితో కలిపి నలుగురు ఎంపీలు, ఒక ఎమ్మెల్సీ, ఒక ఎమ్మెల్యే, 19 మంది కార్పొరేటర్లు కలిపి 25 మంది ఓటర్లు ఉన్నారు. ఇద్దరు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, ఐదుగురు ఎమ్మెల్యేలు, 15 మంది కార్పొరేటర్లతో కలిపి బీఆర్‌ఎస్‌కు 24 మంది.. ఒక ఎంపీ, నలుగురు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఏడుగురు కార్పొరేటర్లతో కలిపి 14 మంది కాంగ్రెస్ ఓటర్లున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పోటీకి దూరంగా ఉండగా.. సరిపడా బలం లేకున్నా బీజేపీ వ్యూహాత్మకంగా బరిలో నిలిచింది. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వైఖరి ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు మజ్లిస్‌కే అత్యధిక సంఖ్యలో ఓటర్లు ఉండటంతో.. తమ అభ్యర్థి ఎన్నిక లాంఛనమే అన్న ధీమాలో ఆ పార్టీ ఉంది.

టేబుళ్లు తుడిచే వారికే టికెట్లా?: రాజాసింగ్

పార్టీలో పార్లమెంట్ సభ్యుల అనుచరులకే పదవులు కట్టబెడుతున్నారని.. మిగతా సీనియర్ నేతలు, కార్యకర్తలు కనిపించడం లేదా అని బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులకు గులాంగిరీ చేసేవారికి, సీనియర్ నేత ఆఫీసు టేబుల్ శుభ్రం చేసేవారికి పోస్టులు, టికెట్లు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా పార్టీలో సీనియర్, సిన్సియర్ నాయకులను గుర్తించాలని.. కొందరు సీనియర్ నాయకులను పాత సామానులా బయటికి పంపించేయాలని వ్యాఖ్యానించారు.



విత్తన పండగను ప్రారంభిస్తున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి

సంప్రదాయ విత్తనాలతో ఆరోగ్యకర ఉత్పత్తులు

- రసాయనాల వినియోగంతో ఆహారోత్పత్తులు విషతుల్యం
- నకిలీ విత్తనాలు, ఎరువులతోనే వ్యవసాయ సంక్షోభం
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి
- అన్మాస్‌పల్లిలో అట్టహాసంగా ప్రారంభమైన విత్తన పండగ

కడ్తాల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దేశీయ, సంప్రదాయ విత్తన సంపదను పరిరక్షించుకోవాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తుల దిగుబడికి విత్తనాల ఎంపిక కీలకమన్నారు. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని 'ది ఎర్త్ సెంటర్'లో శుక్రవారం తెలంగాణ తొలి విత్తనాల పండగ అట్టహాసంగా ప్రారంభమైంది. దేశీయ సంప్రదాయ విత్తనాల వైభవాన్ని చాటి, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్(సీజీఆర్) సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే కార్యక్రమానికి కేరళ, తమిళనాడు, ఒడిసా, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, విత్తన నిపుణులు, పర్యావరణ వేత్తలు, దేశీయ సంప్రదాయ ధాన్యాల ఉత్పత్తిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దేశీయ సంప్రదాయ విత్తనాలు, సేంద్రియ ఆహార ఉత్పత్తుల ప్రదర్శనలకు సంబంధించి విత్తన పండగలో 50 ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. పంటల అధిక దిగుబడి, ఆదాయాన్ని పెంచుకోవడం కోసం మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగించడం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యంగా మారుతున్నాయని అన్వేష్ రెడ్డి అన్నారు. తద్వారా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి సాధ్యమని చెప్పారు. పూర్వం 2 లక్షల వంగడాలు ఉండేవని, కాలక్రమేణా అవన్నీ అంతరించిపోయి.. వరి, గోధుమ ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలిపారు. వ్యవసాయంలో సంక్షోభానికి నకిలీ విత్తనాలు, ఎరువులే కారణమన్నారు. వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం, విత్తనాభివృద్ధి సంస్థ చర్యలు తీసుకుంటాయని చెప్పారు.

సేంద్రియ సాగుతో ప్రకృతి సంరక్షణ

- వ్యవసాయ యంత్రాల ఆవిష్కరణలు అవసరం
- ప్రకృతి-సేంద్రియ రైతు సమ్మేళనంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- వ్యవసాయ యంత్రాల తయారీదారులను రాజ్‌భవన్‌లో సత్కరిస్తామని వెల్లడి



పద్మశ్రీ గ్రహీత సుభాష్ శర్మకు బహుమతి ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శంకర్‌పల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సేంద్రియ సాగుతో భూసారాన్ని కాపాడుకోవడమే కాక ప్రకృతిని సంరక్షించుకోవచ్చునని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో శుక్రవారం జరిగిన రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ప్రకృతి మరియు సేంద్రీయ రైతు సమ్మేళనం-2025కు గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమ్మేళనంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ యంత్రాల స్టాళ్లను సందర్శించి, యంత్రాలను పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. గత డిసెంబరులో మెదక్‌లోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించినప్పుడు సేంద్రియ వ్యవసాయం కోసం ఎంతో తెలుసుకున్నానని గవర్నర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వ్యవసాయ యంత్రాల ఆవిష్కరణలు విస్తృతంగా జరగాలని ఆకాంక్షించారు. సేంద్రియ వ్యవసాయాన్ని అనుసరించి సత్ఫలితాలు సాధించిన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, గుజరాత్ ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు తెలంగాణకు ఆదర్శం అన్నారు. ప్రకృతి ఆధారిత సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏకలవ్య ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. వికారాబాద్ జిల్లా జినుగుర్తిలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో సేంద్రియ పద్ధతులను రాబోయే తరాలకు నేర్పిస్తున్నారని చెప్పారు. తెలంగాణ గ్రామీణ వికాస కేంద్రం వారు రసాయనాలు లేకుండా వనమూలికలతో షాంపు, సబ్బులు, ఫినాయిల్ వంటివి తయారు చేస్తున్నారని వివరించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 25 మండలాలలోని 650 మంది రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించడంలో ఏకలవ్య గ్రామీణ వికాస కేంద్రం సఫలీకృతమైందని అభినందించారు. పోచంపల్లిలోని చేనేత కార్మికుల కోసం చింతకింది మల్లేశం నూతన యంత్రాన్ని తయారు చేసి వారికి బాసటగా నిలిచారని గవర్నర్ పేర్కొన్నారు. కాగా, నూతన వ్యవసాయ యంత్రాలను తయారు చేసిన వారిని ఏడాదికోసారి రాజ్‌భవన్‌లో సత్కరించాలని విశ్రాంత బ్రిగేడియర్ గణేశం ఈ సందర్భంగా చేసిన ప్రతిపాదనకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు.

వక్ఫ్ బిల్లుపై జగన్ డబుల్ గేమ్!

- లోక్‌సభలో వ్యతిరేకం.. రాజ్యసభలో మద్దతు
- మైనారిటీల్లో తీవ్ర అసంతృప్తి

అమరావతి/న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుపై జగన్ ఆడిన డబుల్ గేమ్ రాజ్యసభ సాక్షిగా బయటపడింది. వక్ఫ్ బిల్లు మైనారిటీలకు వ్యతిరేకంగా ఉందని.. దాన్ని వ్యతిరేకిస్తున్నామని జగన్, వైసీపీ నేతలు పదేపదే ప్రకటనలు చేస్తూ వచ్చారు. ఎన్డీయేకు బలం ఉన్న లోక్‌సభలో బిల్లును వ్యతిరేకించిన వైసీపీ.. రాజ్యసభలోనూ వ్యతిరేకిస్తుందని అంతా భావించారు. కానీ, గురువారం రాత్రి వరకు తన సభ్యులకు ఎలాంటి విప్ జారీ చేయలేదు. రాజ్యసభలో వైసీపీ ఎంపీలు ఏడుగురూ బిల్లుకు అనుకూలంగా ఓటేశారని టీడీపీ నేతలు చెబుతున్నారు. జాతీయ మీడియా సైతం.. వైసీపీ విప్ జారీ చేయకపోవడంతో ఆ పార్టీ ఎంపీలు ఆత్మప్రబోధానుసారం ఓటేస్తారని కథనాలు రాసింది. వైసీపీ రెండు నాల్కల ధోరణిపై సోషల్ మీడియాలోనూ వార్తలు వైరల్ కావడంతో పార్టీ పెద్దలు దిద్దుబాటు చర్యలకు దిగారు. హడావుడిగా విప్ జారీ చేశారు. అయితే అప్పటికే రాజ్యసభలో బిల్లుపై ఓటింగ్ ముగిసింది. అంతా అయ్యాక విప్ జారీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తడంతో తాము ముందే జారీ చేశామని వైసీపీ పెద్దలు వివరణ ఇచ్చారు. పరిమళ్ నత్వానీ ఒక్కరే క్రాస్ ఓటింగ్ చేశారని వైసీపీ వర్గాలు అంగీకరించాయి. కానీ, ఐదుగురు ఎంపీలు అనుకూలంగా ఓటేశారని ప్రచారం జరుగుతోంది. వక్ఫ్ బిల్లు మైనారిటీలకు వ్యతిరేకంగా ఉందంటూ నిన్నటి వరకు నానా యాగీ చేసి.. చడీచప్పుడు లేకుండా రాజ్యసభలో మద్దతివ్వడం ఎంతవరకు సమంజసమని ముస్లిం సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

మాజీ ఎంపీ హర్షకుమార్‌పై కేసు

- పాస్టర్ మృతిపై నిరాధార ఆరోపణలు

రాజానగరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్‌పై తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. రాజానగరం ఎస్‌ఐ నాగార్జున కేసు వివరాలను విలేకరులకు తెలియజేశారు. 'పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతిపై హర్షకుమార్ ప్రజల్ని రెచ్చగొడుతున్నారు. తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు, నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. వాటికి తగ్గ ఆధారాలు చూపించాలని అడిగితే ఇంతవరకు చూపించలేదు. దీంతో 196, 197 సెక్షన్ల కింద హర్షకుమార్‌పై కేసు నమోదు చేశాం' అని ఎస్‌ఐ చెప్పారు.

వంద శాతం కచ్చితత్వం

సర్కాడియాన్ యాప్‌తో గుండె జబ్బుల పరీక్షలు

యాప్‌తో వ్యాధి గుర్తించిన వారికి సంప్రదాయ పరీక్షల్లోనూ నిర్ధారణ

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బుల నిర్ధారణకు ఓ బాలుడు రూపొందించిన సర్కాడియాన్ యాప్‌పై సంశయాలు తొలగిపోయాయి. ఆ యాప్ వంద శాతం కచ్చితత్వంతో పనిచేస్తోందని స్పష్టమైంది. ఇటీవల ఏఐ నిపుణుడు సిద్ధార్థ్ నంద్యాల అనే ఎన్నారై విద్యార్థి 7 సెకన్లలో గుండె జబ్బును నిర్ధారించే ఏఐ ఆధారిత సర్కాడియాన్ యాప్‌తో గుండె పరీక్షలు నిర్వహించి సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ యాప్ పనితీరు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశం అయింది. వైద్య వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య విద్యా శాఖ అనుమతితో గుంటూరు, విజయవాడ ప్రభుత్వాస్పత్రుల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద కార్డియాలజీ ఓపీ విభాగాలకు వచ్చే రోగులకు ఈ యాప్‌తో గుండె స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. విజయవాడలో 992 మంది రోగులను పరీక్షించగా వీరిలో 19 మందికి గుండె సంబంధిత వ్యాధులు ఉన్నట్లు యాప్ నిర్ధారించింది. ఈ 19 మంది రోగులను కార్డియాలజీ వైద్య బృందం ఈసీజీ, 2డి ఎకో పరీక్షలతో మరోసారి వార్డులో పరీక్షలు జరపగా ఈ 19 మందికి గుండె జబ్బులున్నట్లు తేలింది. గుంటూరు జీజీహెచ్‌లో 863 మందికి స్క్రీనింగ్ చేయగా, వీరిలో 16 మందికి గుండె జబ్బులు ఉన్నట్లు సర్కాడియాన్ యాప్ తేల్చింది. అయితే అందులో నలుగురు వైద్య బృందం పరీక్షలకు హాజరుకాకుండా ఆసుపత్రి నుంచి వెళ్లిపోయారు. మిగిలిన 12 మందికి కార్డియాలజిస్టుల ఆధ్వర్యంలో ఈసీజీ, ఎకో పరీక్షలు చేయగా, ఆ 12 మందికి గుండె జబ్బుల నిర్ధారణ అయ్యింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.